**Islam- Ek Swayam sidh Eeshwareeya**
**Jeevan Vyavastha *(Telugu)***

# ఇస్లామ్ మాత్రమే
# ప్రకృతి ధర్మం


హిందీ మూలం

**శ్రీ రాజేంద్ర నారాయణ్ లాల్**

తెలుగు రూపం

**అబ్దుల్ వాహెద్**



TRUST

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (Regd.)**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-2. ఫోన్:040-24564583

***Islam Maatrame Prakruthi Dharmam (Telugu)***

Source : Islam- Ek Swayam sidh Eeshwareeya Jeevan Vyavastha

**TIP Series No.** : **361**

Writer : Sri Rajendra Narayan Lal

Translated by : Abdul Wahed

*All Rights Reserved with Publishers*

1st Edition : October 2024

Copies : 2000

**Price** : **Rs.80**

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24576237, 24564583
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# ఒకట్రెండు మాటలు

శ్రీ రాజేంద్ర నారాయణ్ లాల్ రాసిన ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంది.

ఈ పుస్తకం మొదట 1978లో వారణాసి (యుపి)లోని రామ్‌నగర్‌లో వున్న ఇస్లామీ సాహిత్య సదన్ నుండి ప్రచురించబడింది. ఇప్పుడు న్యూఢిల్లీలోని సాహిత్య సౌరభ్ నుండి ప్రచురించబడుతోంది.

ఈ పుస్తకంలో అనేక చోట్ల అబూ ముహమ్మద్ ఇమాముద్దీన్ రామ్ నగరి రాసిన పాదసూచికలు కూడా ఉన్నాయి.

శ్రీ రాజేంద్ర నారాయణ్ లాల్ రాసిన పాఠ్యంలో అక్కడక్కడ స్పష్టత కోసం ప్రచురణకర్త కొన్ని పదాలు బ్రాకెట్లలో ఇచ్చారు.

దేశ ప్రజలలో ఒకరి మతం గురించి మరొకరు నిష్పక్షపాతంగా అధ్యయనం చేసే వాతావరణాన్ని సృష్టించడం ఈ పుస్తకాన్ని ప్రచురించడంలో ముఖ్య ఉద్దేశ్యం.

అందువల్ల, ఈ పుస్తకం ఇస్లాం రూపురేఖలు అర్థం చేసుకోడానికి తోడ్పడు తుందని, దేశంలో మతవర్గాల మధ్య సుహృద్భావ వాతావరణం సృష్టించడానికి సహాయపడుతుందని మేము ఆశిస్తున్నాము.

ఉర్దూ, ఇంగ్లీష్ తదితర భారతీయ భాషల్లో కూడా ఈ పుస్తకం అనువదించబడు తోంది.

**– ప్రకాశకులు**

# అభ్యర్థన

శ్రీ రాజేంద్ర నారాయణ్ లాల్ పుస్తకాన్ని ప్రచురిస్తున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంది. హిందూమతం, బౌద్ధమతం, క్రైస్తవ మతంపై రచయిత వ్యక్తం చేసిన అభిప్రాయాలను, వాటికి వివరణగా మేము ఇచ్చిన పాదసూచికలను వివాదాలుగా పరిగణించవద్దని పాఠకులను అభ్యర్థిస్తున్నాము. రాజేంద్ర నారాయణ్ గారి ఆలోచనలు వాస్తవాలపై ఆధారపడి ఉంటే, లోతుగా పరిశీలించదగ్గవి అవుతాయి. ఇస్లాం పట్ల ఇటువంటి అభిప్రాయాలను వ్యక్తం చేసిన మొదటి వ్యక్తి కాదు రాజేంద్ర నారాయణ్. భారతదేశంలోను, ఇతర దేశాలలోను అనేకమంది పండితులు ఇటువంటి అభిప్రాయాలను ప్రకటిస్తూనే వస్తున్నారు. చాలా మంది ఇస్లాం మతం స్వీకరించడం కూడా జరిగింది. ఇస్లాంను ప్రశంసించేవారు చాలా మంది ఉన్నారు.

ఇక్కడ ఒక ఉదాహరణ చూద్దాం. 1979 జనవరి చివరిలో, రాయచూర్ (కర్ణాటక) హైకోర్టు న్యాయమూర్తి శ్రీ రామాజీ గౌరవార్థం ముస్లింలు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్, స్పెషల్ డిప్యూటీ కమీషనర్, జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ తదితర అధికారులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా న్యాయమూర్తి గారికి, హాజరైన పెద్దలందరికీ పవిత్ర ఖుర్ఆన్ కన్నడ అనువాదం ప్రతి బహుమతిగా ఇచ్చారు. న్యాయమూర్తి దివ్యఖుర్ఆన్ అనువాద ప్రతిని తీసుకుని ప్రసంగిస్తూ ఇలా అన్నారు –

“పవిత్ర ఖుర్ఆన్ అనువాదం నాకు దొరికినందుకు చాలా సంతోషిస్తున్నాను. ఇది నిజంగా నా సౌభాగ్యం, దేవుని అనుగ్రహము. నేను దివ్య ఖుర్ఆన్ అధ్యయనం చేయలేదు, కాబట్టి నేను ఈ పవిత్ర గ్రంథం గురించి ఇప్పుడేమీ మాట్లాడలేను. కాని నేను ఖుర్ఆన్ సందేశం గురించిన కొన్ని సూరాలను (అంటే అధ్యాయాలు) అధ్యయనం చేసాను. దానివల్ల నాకు ఖురాన్ దేవుని సందేశం అని, దైవం తరఫున ప్రవక్త

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు పంపబడిందని, ఈ సందేశం ఏ ప్రత్యేక సముదాయానికి సంబంధించింది కాదని, మొత్తం మానవాళికి సంబంధించిందని తెలిసింది. ఇస్లాం అనే పదం మానవజాతి మొత్తానికి శాంతి సందేశాన్ని ఇస్తుంది. దేవుడు ఒక్కడే అని, సర్వసృష్టికి ఆయనే సృష్టికర్త అని, ఆయనే విశ్వప్రభువు అని, యావత్తు మానవాళి పట్ల కరుణామయుడని, కృపాకరుడని ఖుర్ఆన్ చెబుతుంది. పవిత్ర ఖురాన్ ప్రారంభంలోనే అల్లాహ్ గురించిన ఈ స్తోత్రం ఉంది. "అన్ని స్తోత్రాలు సర్వ లోకాల ప్రభువు, కరుణామయుడు, కృపాకరుడైన అల్లాహ్‌కే చెందుతాయి. ఆయన ప్రతిఫల దినానికి స్వామి. మేము నిన్ను మాత్రమే ఆరాధిస్తాము, నిన్ను మాత్రమే మేము సహాయం కోసం అర్థిస్తాము. మాకు రుజుమార్గం చూపించు" అని ప్రార్థిస్తాము. "మాకు రుజుమార్గం చూపించు" అనే పదాలను మరోసారి చెబుతున్నాను. మొదటి అధ్యాయంలోని ఈ పదాలు నిజానికి తాళం చెవి వంటివి.

ఈ ప్రారంభ వాక్కుల వివరణే మొత్తం మానవాళి మార్గదర్శకత్వం కోసం ఈ పవిత్ర గ్రంథంలో ఉంది. దేవుడు ఒక్కడే అని దివ్యఖుర్ఆన్ చెబుతుంది. ఆయనే సర్వ సృష్టికి ప్రభువు. అందువల్ల, ఆయన చూపిన మార్గంపై మనం నడవాలి. ఖురాన్ బోధనలను అనుసరించడం ద్వారా మాత్రమే మానవసమాజాల్లో పెరుగుతున్న సమస్యలను పరిష్కరించవచ్చు. (దావత్ దినపత్రిక, ఢిల్లీ, ఫిబ్రవరి 4, 1979)

ఈ దివ్యఖుర్ఆన్ కన్నడ అనువాద గ్రంథం ప్రారంభోత్సవాలు కర్ణాటకలోని వివిధ నగరాల్లో జరిగాయి. అనువాద ప్రతులను హిందూ సోదరులకు పంచడం జరిగింది. హిందూ ధార్మికపెద్దలు కూడా న్యాయమూర్తి గారి మాదిరిగా పవిత్ర ఖుర్ఆన్ ప్రతి స్వీకరించి తమ సంతోషాన్ని ప్రకటించారు.

పవిత్ర ఖురాన్ను ఎవరు దైవగ్రంథంగా పరిగణించినా, పరిగణించకపోయినా, ఇది అంతిమ దైవగ్రంథం అన్న విషయాన్ని ఎవరూ కాదనలేరు. పవిత్ర ఖురాన్ అవతరించి 14 వందల సంవత్సరాలు గడిచాయి. ఈ సుదీర్ఘ కాలంలో గొప్ప తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, సాహితీవేత్తలు కవులు జన్మించారు. కానీ ఎవ్వరూ దైవప్రవక్తగా చెప్పుకుని, తనపై దివ్యవాణి అవతరిస్తుందని చెప్పుకోలేకపోయారు. ఏ రచయిత, కవి కూడా తన గ్రంథం దివ్యగ్రంథం అని చెప్పుకోలేకపోయాడు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) దేవుని ప్రవక్త, పవిత్ర ఖురాన్ దైవగ్రంథం అని చెప్పడానికి ఇది ప్రత్యక్ష సాక్ష్యం.

నిజమైన దైవిక మతానికి ఆధారం ఒకే ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడు, ఆయన దైవత్వంలో భాగస్వామి లేడు అనే విశ్వాసం. ఆయనే విశ్వానికి సృష్టికర్త, యజమాని. నిర్వాహకుడు ఆయనే. ఆయన ఒక్కడే ఆరాధ్యుడు. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. పవిత్ర ఖురాన్ను నిష్పక్షపాతంగా అధ్యయనం చేస్తే ఈ దైవగ్రంథం మొదటి నుండి చివరి వరకు ఈ విశ్వాసంపైనే ఆధారపడి ఉందని తెలుస్తుంది. ఈ గ్రంథంలోని వ్యక్తిగత, కౌటుంబిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక బోధనలు ఆదేశాల సారాంశం ఏమిటంటే, మానవ జీవితంలోని అన్ని రంగాలలో విద్యాశిక్షణలకు మూలం ఈ విశ్వాసమే. ఈ ధర్మం పేరు ఇస్లాం. అంటే సంపూర్ణ జీవితంలో దైవవిధేయతా ధర్మం.

పవిత్ర ఖురాన్ తనను ఏకైక దైవగ్రంథంగా చెప్పుకోదు. ఒక కొత్త మతం తీసుకొచ్చినట్లు కూడా చెప్పదు. సృష్టి ప్రారంభం నుండి దేవుడు మనుషుల్లో తన ప్రవక్తలను నియమించడం ద్వారా తన బోధనలను, ఆదేశాలను తెలియజేస్తున్నాడని దివ్యఖుర్ఆన్ వివరిస్తుంది. పవిత్ర ఖురాన్ ప్రకారం, ప్రపంచంలోని ప్రతి దేశంలో దైవప్రవక్తలు వచ్చారు. వారందరి మూలధర్మం ఒక్కటే. వారందరి బోధనలు ఒక్కటే. అదే ఇస్లాం. తేడా కేవలం కాలదేశాలను బట్టి బాహ్యరూపంలో మాత్రమే ఉంది. అంతర్గతంగా ఆత్మ అన్నింటిదీ ఒక్కటే.

దైవప్రవక్తల సంప్రదాయం ఏమిటంటే, ప్రతి ప్రవక్త తనకు ముందు వచ్చిన ప్రవక్తలను, వారు తీసుకువచ్చిన పుస్తకాలను ఆమోదించేవారు. వాటిని సత్యమని ధ్రువీకరించేవారు. ఈ సంప్రదాయం ప్రకారం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకు ముందు వచ్చిన దైవప్రవక్తలను ధ్రువీకరించారు. పవిత్ర ఖురాన్ అంతకు ముందు వచ్చిన దైవగ్రంథాలను ధ్రువీకరించింది. సత్యధర్మానికి అంతిమ రూపం ఇస్లాం అని రాజేంద్ర నారాయణ్ సరిగ్గా చెప్పారు. ఇదే మాట దివ్య ఖుర్ఆన్ ఇలా ప్రకటించింది:

“ప్రవక్తా! మేము నీ వద్దకు పంపిన ఈ గ్రంథం సత్యాన్ని తీసుకొని వచ్చింది. తన కాలంలో ఉన్నటువంటి ‘అల్ కితాబ్’లోని భాగాలను అది ధ్రువీకరిస్తుంది, పరిరక్షిస్తుంది.” (ఖుర్ఆన్, 5:48)

ధ్రువీకరిస్తుంది, పరిరక్షిస్తుంది అన్నది తెలుగులో చేసిన అనువాదం. అసలు అరబిక్ పదం “ముహైమిన్”. దీనికి – పర్యవేక్షణ, సాక్ష్యం, అమానతు, ధ్రువీకరణ,

సహాయం మొదలైన అర్థాలున్నాయి. మునుపటి దైవగ్రంథాలలోని అన్ని సత్యబోధనలను ఈ గ్రంథం సంరక్షించిందని, వాటిని పర్యవేక్షిస్తోందని, వాటిని కాపాడుతుందని, సహాయపడుతుందని, ఆ గ్రంథాలలోని దైవాదేశాలను సత్యాలుగా ధ్రువీకరిస్తుందని, అవి సత్యమైనవిగా సాక్ష్యమిస్తుందని ఈ మాటల భావం. ఆయా దైవగ్రంథాలలో చోటు చేసుకున్న మార్పులు చేర్పులను ఖురాన్ సాక్ష్యం ద్వారా పరికించి, పరిశీలించి వేరుపరచవచ్చు.

ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోకుండా, ఖురాన్ అవతరించిన సమయంలో శత్రువులు, ప్రస్తుత కాలంలోని విరోధులు ఖురాన్ మునుపటి గ్రంథాల బోధనల కాపీ అని చెబుతారు. వారి ఉద్దేశ్యం దివ్యఖురాన్ అనేది దైవగ్రంథం కాదని, మానవ రచన అని, మునుపటి గ్రంథాలలోని వివిధ భాగాలను తీసుకొని హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా సంకలనం చేయబడిందని, దానిని దైవవాణిగా చెప్పడం జరిగిందని చెప్పడం. అజ్ఞానపూర్వక, భ్రమాత్మకమైన ఇలాంటి మాటలను విశ్లేషించడం తార్కిక అవసరం.

ఏదైనా జాతి ధర్మభ్రష్టతకు గురైనప్పుడు దానిని సంస్కరించడానికి దైవప్రవక్త వచ్చినప్పుడు ఆ జాతి రెండు భాగాలుగా చీలిపోతుంది. స్వేచ్ఛగా ఆలోచించే వారిది ఒక వర్గం. ఈ వర్గం వారు దైవప్రవక్తను అంగీకరించి, అతని అనుయాయులుగా మార్తారు. రెండవ వర్గం జడత్వవాదులు, స్వార్థ నేతలది. వీళ్ళు దైవప్రవక్తను అంగీకరిస్తే అతనికి అధీనమైపోతామని భయపడుతుంటారు. అప్పుడు తమ గౌరవప్రతిష్ఠలు, హోదా గౌరవాలు అన్నీ నాశనమైపోతాయని అనుకుంటారు. అందువల్ల ప్రవక్తకు విరోధులై చంపడానికి కూడా సిద్ధపడతారు. ఈ దశకు చేరుకున్నప్పుడు వారిపై దైవాగ్రహం అవతరిస్తుంది. వారు నాశనం చేయబడతారు. దైవప్రవక్తను విశ్వసించిన వారు మాత్రమే సురక్షితంగా ఉంటారు. కానీ కాలక్రమేణ కొన్ని తరాల తరువాత, వారి ఆ జాతి సంతానంలో చెడు క్రమంగా మరలా ప్రబలుతుంది. వారు ధర్మబోధనలకు దూరమవుతారు. ధర్మగ్రంథాల్లో మార్పులు చేర్పులతో తమ ప్రవర్తనకు అనుగుణంగా మతాన్ని మార్చేస్తారు. అలా చేసి తమ ప్రవర్తన ధర్మవిరుద్ధంగా లేదనిపించుకుంటారు. తమ గౌరవప్రతిష్ఠలు దీనివల్ల మరింత పెరుగుతాయని భావిస్తారు.

యూదులు, క్రైస్తవులు తమ మతం, ధర్మగ్రంథాల విషయంలో ఇదే చేశారు. ప్రవక్త మూసా (అస), ప్రవక్త దావూద్ (అస), ప్రవక్త క్రీస్తు (అస) మొదలైన వారి

బోధనలు ఏమిటో? యూదులు, క్రైస్తవులు వాటిని ఎలా మార్చేశారో? పవిత్ర ఖురాన్ స్పష్టంగా వివరించింది. భారతదేశంలో ఏమి జరిగి ఉంటుందో దీన్ని బట్టి అంచనా వేయవచ్చు. అలా జరిగి ఉండకపోతే, ధర్మానికి హాని జరిగినప్పుడల్లా తాను వస్తానని కృష్ణుడు చెప్పిన మాటలకు అర్థమేమిటి? నా అభిప్రాయం ప్రకారం శ్రీకృష్ణుడు తనను తాను దైవంగా చెప్పుకోలేదు. దైవం తరఫున పంపబడినట్లు చెప్పి ఉంటారు. ఈ మాటల ద్వారా కూడా మనకు తెలుస్తున్నదేమిటంటే ధర్మం కాలగమనంలో వక్రీకరించబడుతూ వచ్చింది. గీతలోని శ్రీకృష్ణున్ని బృందావనంలో గోపికలతో విహరిస్తున్న రూపంలో చూస్తున్నాం. బుద్ధుడు వేదాలను కూడా అంగీకరించలేదు. ఆయన్ను కూడా దేవుడిగా మార్చి అవతారాల్లో చేర్చడం జరిగింది. స్వామి దయానంద్ ఏ మాటలు చెబుతూ ఈ ప్రపంచాన్ని విడిచివెళ్ళారో గుర్తుంచుకోవడం అవసరం.

మనకు నిజమైన మత భావన ఉంటే, సత్యం గురించి జిజ్ఞాస ఉంటే, మనం వేదాలను, ఉపనిషత్తులను, ఖురాన్ను నిష్పాక్షికంగా అధ్యయనం చేయాలి. ఈ పుస్తకాలలో ఎన్ని దైవబోధనలున్నాయి? బయటి నుంచి జరిగిన కల్తీ ఎంత అనేది అప్పుడు స్పష్టంగా అర్థమవుతుంది.

**- అబూ ముహమ్మద్ ఇమాముద్దీన్**

**రామ్ నగర్ (వారణాసి)**

# భూమిక

దైవేచ్ఛ లేనిదే ఏదీ జరగదు. అరుదైన మహా సంఘటన అయినా, అల్పమైన పనయినా ఏదైనా సరే దైవేచ్ఛ ఫలితమే. ఈ మామూలు ప్రయత్నం కూడా అలాంటిదే. ఈ ప్రయత్నం పాఠకుల ముందు పుస్తక రూపంలో ఉంది. ఈ చిరుపుస్తకం ప్రశ్నలు జవాబుల రూపంలో రాసిన పుస్తకం. క్లుప్తత ఈ చిరుపుస్తకం ప్రత్యేకత. సత్యాలను సాధారణ ప్రజలందరికీ సమర్పించే ఉద్దేశ్యంతో రాసిన పుస్తకం ఇది. రెఫరెన్సులు, వివరాలు ఉద్దేశ్యపూర్వకంగానే ఇందులో ఇవ్వలేదు. ఎందుకంటే, సాధారణ ప్రజలకు వాస్తవాలు సులభంగా అర్థమయ్యేలా చేయడానికి. సాధారణ ప్రజలు తమ స్వంత బుద్ధీ వివేకాలతో స్వయంగా సరైన నిర్ణయాలు తీసుకోగలరు. వారిపై ఎలాంటి మానసిక ఒత్తిడి, అయోమయాలు ఉండవు. వృద్ధాప్యంలో, నా రిటైర్మెంటు తర్వాత ఆధ్యాత్మికత అవసరమయ్యింది. మానసిక శాంతి చాలా అవసరమయ్యింది. ఈ సందర్భంగా నేను నా మతాన్ని, ఇతర మతాలను తెలుసుకునే ప్రయత్నం చేశాను. తులనాత్మక విశ్లేషణ, అవలోకనాల తర్వాత నేను ఇస్లాంను అనుసరించదగిన మతంగా, అన్ని సమస్యలకు ఒకే ఒక్క పరిష్కారంగా తెలుసుకున్నాను. సమస్యలు వ్యక్తిగతమైనవి కావచ్చు, కుటుంబ సమస్యలు కావచ్చు, పౌర, సామాజిక, రాజకీయ, నైతిక, మతపరమైన, మానసిక, ఆర్థిక, జాతీయ, అంతర్జాతీయ, ఇహలోక లేదా పరలోక సమస్యలు ఏవైనప్పటికీ, క్లుప్తంగా ఇస్లాం అన్ని మానవ సమస్యలకు పరిష్కారమిచ్చే మాస్టర్ కీ (Master Key) అని చెప్పవచ్చు. ఇస్లాంలో ఉన్న స్పష్టత, శక్తి, సరళత, సార్వత్రికత, ప్రామాణికత చెక్కుచెదరనిది. ఒకే దేవుడిపై విశ్వాసం, స్వచ్ఛమైన ఏకేశ్వరవాదం ఇందులో ఉంది. అలాగే ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ (స) వ్యక్తిత్వం అద్భుతమైనది. పరిపూర్ణమైనది. ఎవరైనా ఇస్లాంను స్వచ్ఛమైన మనస్సుతో, పక్షపాతం లేకుండా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, నిస్సందేహంగా ఇస్లాం ఒక సత్యమనే

నిర్ణయానికి వస్తారు. ఇస్లాంకు ముందుకాలంలో అరబ్బులు పాపాల్లో కూరుకుపోయి ఉండేవారు. ముహమ్మద్ (స) ఇస్లాం బోధనల ద్వారా కొద్ది సమయంలోనే వారిని పూర్తిగా ఆధ్యాత్మికతకు, మానవతకు ఉదాహరణలుగా మార్చివేశారు. కామి, క్రోధి, లోభి, వ్యభిచారి, జూదరి, జగడాలమారి, తాగుబోతు, హింసాస్వభావి, దొంగ, నికృష్ట అవిశ్వాసంలో పడి ఉన్న జాతిని కేవలం అదే తరంలోనే హృదయాలను మార్చేయడం ఒక పెద్ద మహత్యమే. చరిత్రలో ఇలాంటి మరొక ఉదాహరణ లేదు[1]

యావత్తు అరబ్బు జాతి సామూహికంగా పాపాల దీర్ఘకాలిక రోగం నుంచి ఇస్లాం అనే ఔషధం ద్వారా స్వల్పకాలంలోనే బాగుపడిందంటే అర్థం ఈ ఔషధం చారిత్రకంగా రుజువయ్యింది. ఇలాంటి రుగ్మతలతో అలమటిస్తున్న ఏ సమాజాన్నైనా బాగుచేయగలిగిన అద్భుత ఔషధంగా అది ఉపయోగపడుతుందని భావించాలి. ప్రస్తుతకాలంలో మొత్తం ప్రపంచం కొద్దోగొప్పో ఇలాంటి రోగంతోనే బాధపడుతోంది. మనదేశంలో అయితే ఈ వ్యాధి మహమ్మారిగా మారిపోయింది. ఈ వ్యాధికి దేవుడిచ్చిన ఔషధం వాడడం అవసరం, అనివార్యం. భారత ఉపఖండంలో మంత్రి నుంచి మామూలు అటెండరు వరకు మామూళ్ళు తీసుకోవడం మామూలే. బజారు

---

1. భారతదేశంలో శ్రీ రామచంద్రుడు, శ్రీకృష్ణుడు, మహాత్మ బుద్ధుడు ఇతర మహాపురుషులు అందరూ పండితులు, రాజ కుటుంబాలకు చెందినవారు. వారు గొప్ప జ్ఞానులు, దార్శనికులు. శ్రీరామచంద్రుని తండ్రి దశరథుడి రాజ్యం ఆదర్శ రాజ్యం. కృష్ణుడి మామ దుర్మార్గుడు. కౌరవులు, పాండవుల ఘర్షణ కుటుంబ ఘర్షణ. అంతకు మించి అప్పట్లో రాజ్యంలో మరెలాంటి అధర్మం ప్రబలిన ప్రస్తావన లేదు. బుద్ధుడు కూడా దేశంలో వ్యాపించిన అధర్మానికి విరుద్ధంగా సన్యాసం తీసుకోలేదు. వృద్ధుడిని, శవాన్ని చూసిన ప్రభావంతో ప్రపంచం నుండి విరక్తి చెందారు.

మహనీయ ముహమ్మద్ (స) విషయం వేరు. ఆయన కాలంలో సార్వత్రికంగా ఆ ప్రాంత మంతా తెగలుగా విభజితమై ఉండేది. ఎటువంటి పరిపాలనా వ్యవస్థ లేదు. యావత్తు రాజ్యంలో అనైతికత, దుర్మార్గాలు. మద్యం, వ్యభిచారం, దుర్మార్గాలు, దౌర్జన్యాలు, దోపిడీ, లూటీ... అక్కడ లేని కుకర్మలంటూ ఏవీ లేవు. యూదులు, క్రైస్తవులు కూడా ధర్మభ్రష్టతకు గురైన కాలం, ప్రాంతం అది. దేశమంతటా అజ్ఞానం ప్రబలింది, బహుదైవారాధన వ్యాపిం చింది. ముహమ్మద్ (స) వంశం బహుదైవారాధకుల ఆధ్యాత్మిక నేతల వంశం. పూర్తి అజ్ఞానంలో ఉండేవారు. మక్కా నగరంలో, బహుదైవారాధన కేంద్రంలో, కేవలం కొద్ది మంది మాత్రమే చదవడం, వ్రాయడం తెలిసినవారు. దాదాపు అందరూ పూర్తిగా నిరక్ష రాస్యులు. ఇక అక్కడ పాఠశాలలెక్కడ ఉంటాయి? చదివించేవారెవరుంటారు? ప్రవక్త ముహమ్మద్ (స) కూడా నిరక్షరాస్యులే. మక్కావాసుల

నుంచి కోర్టు వరకు అవినీతి ప్రబలింది. కొంతమందిని మినహాయిస్తే మిగిలిన వాళ్ళందరు ఈ అవినీతి ఊబిలోనే కూరుకుపోతారేమో అన్న అనుమానాలు బలంగా ఉన్నాయి. ఇస్లాంకు ఏ మతం పట్ల కూడా విరోధం లేదు. ముహమ్మద్(స) కన్నా ముందు వచ్చిన దైవ సందేశహరులందరినీ అది గౌరవిస్తుంది. ఇస్లామీయ విశ్వాసం ఏమిటంటే, ముహమ్మద్(స) చివరి దైవ సందేశహరుడు. ఆయనకు పూర్వం వచ్చిన దైవసందేశహరుల ద్వారా పంపబడిన దైవాదేశాలను స్వార్థపరులు మార్చేయడం లేదా కాలప్రభావం వల్ల మార్పులు చేర్పులకు గురికావడం వల్ల మనుషులు సత్యమార్గం నుండి దూరమయ్యారు. దివ్యఖుర్ఆన్ దైవాదేశాల ద్వారా కలుషితమైన ధర్మాన్ని సంస్కరించి, సర్వకాలాలకు స్థిరమైన మార్పు చెందని దైవాదేశాలను ప్రజలకు ఇవ్వడం జరిగింది. ఇది వాస్తవం. రాముడు, కృష్ణుడు, మూసా, బుద్ధుడు, ఈసా వంటి మహాత్ముల తర్వాత ముహమ్మద్ (స) రాక దైవేచ్ఛ వల్ల మానవ కళ్యాణానికి అవసరమయింది. అందువల్లనే ఆయన్ను దైవం పంపించాడు. “దేవుడు ఒక్కడే”, “ముహమ్మద్ (స) చివరి దైవప్రవక్త” అనేది ఇస్లాం విశ్వాస వచనం. మూలసూత్రం. వేదాలు చరిత్రపరంగా ప్రాచీనగ్రంథాలు. హిందువుల నమ్మకం ప్రకారం ఇవి దేవుడిచ్చినవి. వేదాలు దేవుడి ఏకత్వాన్ని స్పష్టంగా ప్రకటిస్తాయి. వేదాల్లో స్పష్టంగా చెప్పబడింది – “ఏకమేవ ద్వితీయో నాస్తి,” – అంటే అర్థం దేవుడు ఒక్కడే, రెండవవాడు లేడు. ఇతర మతాలు కూడా దేవుడు ఒక్కడే అని నమ్ముతాయి. కాలక్రమేణా ఈ మతాల్లో ఏకేశ్వరవాదం స్వచ్ఛంగా మిగలకపోయినా మౌలికంగా దేవుడు ఒక్కడే అని నమ్ముతాయి. అందువల్లే, ఇస్లాంలోని ఏకేశ్వరవాదం, ‘కలిమా (విశ్వాస వచనం)’

---

వద్ద నాలుగైదు పేజీల చిన్నపాటి మతపుస్తకం కూడా ఏదీ ఉండేది కాదు. వారి దేవీ దేవతల కథలు కూడా లేవు. అన్నీ అవ్యవస్థిత, మౌఖిక, మార్పులు చేర్పులకు గురైన అనాచారాలు, దురాచారాలే ఉండేవి. యావత్తు అరబ్బు జాతి ఈ దురాచారాల్లోనే మునిగిపోయి ఉండేది.

ఆ కాలంలో ప్రపంచంలో ఎక్కడా సత్యధర్మం అనేది లేదు. ఇలాంటి దేశంలో, ఇలాంటి ప్రజల మధ్య యావత్తు ప్రపంచానికి ఏకేశ్వరవాద సత్యధర్మాన్ని పరిచయం చేయడానికి, ప్రజల వ్యవహారాలను పరిశుద్ధపరచడానికి దైవం ముహమ్మద్(స)ను ఎన్నుకున్నాడు. ఆయన బోధనలు, ఆదేశాలతో ఒక ఏకేశ్వరవాద సమూహం రూపుదిద్దుకుంది. 23 సంవత్సరాల నిరంతర ప్రయత్నాల ఫలితంగా అక్కడ ఒక విస్తృత, సమగ్ర, సార్వత్రిక విప్లవం చోటు చేసుకుంది. దేవుని సత్యధర్మం స్థాపించబడింది. ఒక పవిత్రమైన నాగరికత, సంస్కృతి ఉద్భవించాయి. ఒక పటిష్టమైన శాసనం ఉనికిలోకి వచ్చింది. ఇలాంటి మరో విప్లవం మానవచరిత్రలో వెదికినా దొరకదు.

లోని మొదటి భాగం అందరికి అంగీకారయోగ్యమైంది. 'కలిమా' రెండవ భాగం "ముహమ్మద్ (స) చివరి దైవప్రవక్త." ఈ భాగం కూడా వాస్తవం. దీనికి సాక్ష్యం అవసరమా? "ప్రత్యక్ష్ కిమ్ ప్రమాణమ్" అంటే స్పష్టంగా కనిపిస్తున్న విషయానికి ప్రమాణం కావాలా? అంటారు. గణితంలోను విజ్ఞాన శాస్త్రంలోను బిందువు (Point)కు కొలత లేదు. కొలత లేదనడానికి రుజువేమిటంటే, అది విస్పష్ట సత్యం (Axiom) కాబట్టి. ముహమ్మద్ (స) చివరి దైవప్రవక్త అనడానికి కూడా ఇదే వర్తిస్తుంది.[1]

---

1. ఇప్పుడు వేద ఋషుల భవిష్యవాణులు, మహాత్మ బుద్ధుడి మాటల ద్వారా కూడా ముహమ్మద్ (స) చివరి దైవప్రవక్త అని రుజువవుతోంది. మరింత సమాచారం కోసం డాక్టర్ వేద ప్రకాశ్ ఉపాధ్యాయ ఎం.ఎ. (సంస్కృతం, వేద), డి. ఫిల్ (ధర్మ శాస్త్రా చార్య), రాసిన పుస్తకం దాంతోపాటు నేను రాసిన వివరణ "వేదాల చివరి ఋషి నరాశంస, ఖుర్ఆన్‌లోని చివరి దైవప్రవక్త ముహమ్మద్" చూడగలరు. వేదప్రకాశ్ జీ తన పుస్తకంలోని "భూమిక"లో ఇలా రాశారు: "చరిత్రాత్మక విషయాలపై పరిశోధన చేయాలన్న ఉత్సాహం నాకెప్పుడూ ఉండేది. వేదాలలో, బైబిలులో బౌద్ధ గ్రంథాలలో ఋషి ఆగమనం గురించి చెప్పబడింది. ఆ ఋషి ముహమ్మద్ (స) అని నిర్ధారణ అవుతోంది. అందువల్ల ఈ సత్యాన్ని బయటపెట్టడం, ఈ మాట ప్రజలకు నచ్చక పోయినా సరే చెప్పడం అవసరమని నా మనస్సాక్షి ప్రేరేపించింది.

   మత సంకుచిత భావాలు నాకు లేవు. ఎక్కడైనా ఏదైనా విషయం సత్యమని, సరైనదని అనిపిస్తే దాన్ని బహిష్కరించే సాహసం నేను చేయను. వేదాలలో పన్నెండు భార్యలు కలిగి, ఒంటె సవారి చేసే "నరాశంస" ప్రస్తావన ఉంది. సాయణాచార్యుడు నరాశంస అంటే మానవుల ప్రశంసలు పొందే వ్యక్తి అని అర్థం చెప్పారు. ఈ విషయంలో సాయణాచార్యుడితో నాకు భేదాభిప్రాయం ఉంది. నా అభిప్రాయం ప్రకారం నరాశంసలో "నర" అంటే మనిషి, ప్రశంసితుడైన వ్యక్తిని సూచిస్తుంది. "ముహమ్మద్" అనే పదం "నరాశంస" కు అరబ్బీ అనువాదం.

   ముహమ్మద్ అంటే అర్థం వేదప్రకాశ్ గారు చెప్పినదే, కానీ సాయణాచార్యుడు చెప్పిన అర్థాన్ని తీసుకుంటే అది కూడా పూర్తిగా ముహమ్మద్ (స)కు వర్తిస్తుంది. ఎందుకంటే ప్రపంచంలో ముహమ్మద్ (స) కంటే ఎక్కువ ప్రశంసలు పొందిన వ్యక్తి, ప్రశంసలు పొందే వ్యక్తి మరెవ్వరూ లేరు. మహాత్మ బుద్ధుడి సమాచారానికి సంబంధించి వేదప్రకాశ్ ఇలా రాశారు: "ఋషిని బౌద్ధ మత పరిభాషలో బుద్ధుడు అని అంటారు... గౌతమ బుద్ధుడు తన మరణ సమయంలో తన ప్రియశిష్యుడు నందాతో ఇలా అనేవారు:

   "నందా, ఈ లోకంలో నేను మొదటి బుద్ధుడిని కాను, చివరి బుద్ధుడినీ కాను. ఈ లోకంలో సత్యం, పరోపకారం బోధించడానికి మరొక బుద్ధుడు తన కాలంలో వస్తాడు.

ముహమ్మద్ (స) మాదిరిగా ఇంత పెద్ద సంఖ్యలో అనుచరులు, అనుయాయులు, ఆయన పట్ల చెక్కుచెదరని విశ్వాసం కలిగిన వారు మరొకరు లేరన్నది ముస్లిమేతరులు కూడా నిజాయితీగా అంగీకరించక తప్పదు. ఇస్లాం మాదిరిగా పటిష్టమైన విశ్వాసం కలిగిన అత్యధిక సంఖ్యలో అనుయాయులు ఉన్న ధర్మం భవిష్యత్తులో ఏదన్నా వస్తుందని ఎవరైనా అనుకుంటే అది అవివేకమే అవుతుంది. ఈ విధంగా ఇస్లాం కలిమా అంటే విశ్వాస వచనం "లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్" అనేది నిరూపిత సత్యం. గణిత శాస్త్రంలో ఒక సిద్ధాంతం (Theorem) మాదిరిగా అది నిరూపితమైంది. సిద్దాంత నిరూపణ ప్రక్రియలో నిరూపణ తర్వాత Q.E.D అని వ్రాస్తారు. అంటే నిరూపించవలసింది నిరూపితమైంది అని అర్థం. ఇస్లాంను సమర్థించే ఈ సాక్ష్యం పట్ల ముస్లిమేతరులు కోపించడం సముచితం కాదు. పగలును పగలు అని, రాత్రిని రాత్రి అని చెప్పడమే సత్యం. నేను ప్రత్యేకంగా నా మిత్రులు, సహచరులు, నా తోటి హిందూ సోదరులను, సహధర్మ హిందువులకు అభ్యర్థించేది ఏమిటంటే, సహిష్ణుత, ఆలోచనాస్వేచ్ఛ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి నా తర్కాన్ని పరిశీలించాలి. ఇస్లాంను, ముహమ్మద్(స)ను నిష్పక్షపాతంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. ప్రవక్త ముహమ్మద్ (స) గురించి తమలో ఉన్న నిరాధార సందేహాలను వదులుకోవాలి. ఇలా చేస్తే ఆలోచనా స్వేచ్ఛ సిద్ధాంతాన్ని గౌరవించినట్లు అవుతుంది. పాములను,

---

ఆయన పవిత్రమైన మనస్సాక్షి కలిగినవాడు. ఆయన హృదయం పరిశుద్ధం. బుద్ధీ జ్ఞానాలు సమృద్ధి కలిగినవాడు. ఆయన అందరికీ నాయకుడు అవుతాడు. నేను ఈ ప్రపంచానికి ఎలా శాశ్వత సత్యం బోధించానో అదేవిధంగా ఆయన కూడా ప్రపంచానికి సత్యం బోధిస్తాడు. ప్రపంచానికి ఆయన స్వచ్ఛమైన, కాలుష్యం లేని, పరిపూర్ణమైన జీవనమార్గాన్ని చూపిస్తాడు. నందా! ఆయన పేరు మైత్రేయ."

గమనించవలసిన విషయమేమిటంటే, ముహమ్మద్ (స)కు సంబంధించి వివిధ గుణాలు, లక్షణాలకు సంబంధించిన భవిష్యవాణులను డాక్టర్ వేద ప్రకాశ్ సేకరించారు. ఈ గుణగణాలన్నీ ముహమ్మద్ (స)కు పూర్తిగా వర్తిస్తాయి. గౌతమ బుద్ధుడు స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (స)ను చూశారా అన్నట్లు ఉంది ఈ వర్ణన. డాక్టర్ వేద ప్రకాశ్ ఒక బౌద్ధ పండితుని వ్యాసం ద్వారా బౌద్ధ భాషలో "మైత్రేయ" అంటే దయ అని నిరూపించారు. ముహమ్మద్ (స)కు గుణనామం "రహ్మత్," అంటే దయ అని అర్థం. చివరి దైవగ్రంథం పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది– "వమా అర్సల్నాక ఇల్లా రహ్మతల్లిల్ ఆలమీన్" (21:107), అంటే "ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము". డా. వేద ప్రకాశ్ ఈ వాక్యాన్ని పైన పేర్కొన్న పుస్తకంలో రాశారు.

మర్రిచెట్లను పూజించడం ద్వారా మాత్రమే సహిష్ణుత పరిచితం కాదు. మాంసం, మద్యం, మత్స్యం, మైథునం, ముద్రలను నమ్మే వాళ్ళకు ధార్మిక సమ్మతి ఇవ్వడం మాత్రమే ఆలోచనా స్వేచ్ఛకు నిదర్శనం కాదు. మనం ప్రపంచంలోని మహోన్నత దైవప్రవక్త, అద్వితీయ సంస్కర్త, మానవాళికి కారుణ్యమూర్తి ప్రవక్త ముహమ్మద్ (స)కు మన మనోమస్తిష్కాల్లో సముచిత స్థానం ఇవ్వకపోవడం ఒక దురదృష్టకరమైన విషయం. లెక్కలేనన్ని హిందూ ధార్మిక గ్రంథాల్లో దేవతలు, అవతారపురుషులు పాపులను నాశనం చేసిన విషయాలు సగర్వంగా ప్రస్తావించబడ్డాయి. కాని పాపులను నాశనం చేయకుండా వారి పాపాలను నాశనం చేసిన చారిత్రక మహామనీషి ముహమ్మద్ (స). ఈ సంస్కరణా ప్రక్రియ ద్వారా ఆయన సమిష్టిగా హృదయాలను మార్చి, పాపులను అతి తక్కువ సమయంలో పుణ్యాత్ములుగా మార్చేశారు. హిందువులు వెయ్యి సంవత్సరాల కన్నా ఎక్కువ కాలంగా ముస్లింలతో సంబంధాలు కలిగి ఉన్నారు. కాని ఇస్లాంలోని సామాజిక, నైతిక విలువలతో హిందువులు ఎంత ప్రయోజనం పొందాలో, ఎంతగా తమ ధర్మాన్ని సుసంపన్నం చేసుకోవాలో అంతగా చేయలేకపోవడం ఆశ్చర్యకరం. ఇస్లాం రాకముందు భారతదేశంలోని హిందువులు ఇతర మతాలు, సంస్కృతుల పట్ల పూర్తి సహన సామరస్యాలు ప్రదర్శించారు. కాని ఇస్లాం పట్ల ఈ ఉదాసీనతకు మూల కారణం విజేతల పట్ల ఓడిపోయిన వారిలో సహజంగా ఉండే ద్వేషం. ఇందులో ముస్లింల బాధ్యత కూడా చాలా ఉంది. ఈ సుదీర్ఘ కాలంలో, ముస్లింలు రాజకీయంగానే ఎక్కువగా హిందువులకు పరిచయ మయ్యారు కాని ఇస్లాం వాస్తవికతను పరిచయం చేయలేదు.

మరో చేదు వాస్తవమేమిటంటే భారతదేశానికి ముస్లిములు వచ్చారు కాని ఇస్లామ్ రాలేదు.[1]

1. భారతదేశంలో ఇస్లాం ముస్లిం విజేతల వల్ల ప్రవేశించలేదు, ముస్లిం సంతులు, ఫకీర్లు, వలీల వల్ల ప్రవేశించిందన్నది కాదనలేని సత్యం. ఈ పుణ్యపురుషులు ఇస్లామీయ ఆదర్శాలను ప్రచారంలోకి తెచ్చారు. అంటరానితనం, నిమ్నోన్నతా భేదభావాలను వారు పాటించలేదు. వారు సమాజంలో బడుగువర్గాలను పైకి లేపారు, వారిని హృదయాలకు హత్తుకున్నారు. మానవతను ప్రదర్శించారు. ఈ పుణ్యపురుషులు ఏ ప్రాంతానికి వెళ్ళినా అక్కడి దొంగలు, దోపిడీముఠాలు, బందిపోట్లు, వ్యభిచారులను సంస్కరించి సన్మార్గాన నడిచేలా చేశారు. ఇలా అనేకమంది ఇస్లాం స్వీకరించారు. భారతదేశంలోని ముస్లిములలో కొద్ది మంది తప్ప మిగిలినవారంతా ఆ కాలంలో ఈ పుణ్యపురుషుల వల్ల ఇస్లాం స్వీకరించిన వారి సంతానమే.

భారతదేశానికి వచ్చిన ముస్లింలు రాజకీయాలకు, పాలనాధికారానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారు. ఇస్లాంలోని నైతికత, నాగరికత, సంస్కృతులకు ద్వితీయ ప్రాధాన్యత మాత్రమే ఇచ్చారు. ఎందుకంటే, ముస్లింలు స్వయంగా ఇస్లాం ఆదర్శాలకు అనుగుణంగా మారనందువల్ల భారతదేశంలో ఇస్లాం సంపూర్ణ రూపంలో ప్రజల ముందుకు రాలేదు. అవినీతి ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత కాలంలో ముస్లింలు స్వయంగా ఇస్లామీయ నైతికతకు కట్టుబడుతూ ముస్లిమేతరులకు ఇస్లాంలోని అద్భుతమైన, ఆకర్షణీయమైన అసలు చిత్రాన్ని, ఇస్లామీయ ఉన్నత జీవన శైలిని పరిచయం చేయవలసిన అవసరం ఉంది. మానవ శ్రేయస్సుకు ఇది చాలా అవసరం. ఇప్పుడు దేశంలో అవినీతి చాలా పెరిగిపోయింది. రాజకీయ నాయకుల ద్వారా నైతికప్రమాణాల పునరుద్ధరణ సాధ్యం కాదు. ప్రబలంగా ఉన్న అవినీతిని అంతం చేయడానికి ఆలోచనాపరులైన హిందువులు, ఆదర్శ ఆచరణల ముస్లిములు కలిసి పనిచేయవలసిన అవసరం ఉంది. ఈ పుస్తకానికి సంబంధించి కూడా కొన్ని విషయాలు చెప్పవలసిన అవసరం ఉంది. ఇస్లాంలోని సుగుణాల గురించి అనేకమంది ముస్లిములు, ముస్లిమేతరులు చాలా విషయాలు రాశారు. విద్వేషధోరణులతో కొంతమంది పండితులు ఇస్లాంను, ఇస్లాం ప్రవక్తను విమర్శించారు. నా లాంటి సాధారణ వ్యక్తి ఇస్లాం గురించి రాసే కొత్త విషయాలేముంటాయని ఈ చిరుపుస్తకాన్ని చూసిన పాఠకులు భావించవచ్చు. నా వినయ పూర్వకమైన అభ్యర్థన ఏమిటంటే, ఇస్లాం ప్రపంచంలోని సామాన్య ప్రజలకు అత్యంత ప్రియమైనది, దైవం కూడా సర్వసాధారణ ప్రజల నుంచే తన ప్రవక్తను ఎంచుకున్నాడు. దైవేచ్ఛ వల్లనే ప్రవక్త ముహమ్మద్(స) జీవితాంతం సామాన్య మనిషిగానే ప్రజల్లో ఉన్నారు. ఎందుకంటే అత్యంత సామాన్యమైన మనిషి కూడా ప్రవక్తను చేరుకోడానికి ఎటువంటి ఇబ్బంది ఉండకుండా దైవం ఇలా చేశాడు.[1]

---

1. యావత్తు అరేబియాపై ప్రవక్త ముహమ్మద్ (స) రాజ్యాధికారం స్థాపించబడిన తర్వాత ఆయన కావాలనుకుంటే తన కోసం ఒక రాజభవనాన్ని నిర్మించుకోవచ్చు, కావాలనుకుంటే మహారాజుగా భోగభాగ్యాల జీవితం గడపవచ్చు. కానీ అసాధారణమైన, అద్భుతమైన విజయాలు సాధించిన తర్వాత కూడా ఆయన సాధారణ జీవితం కొద్దిగా కూడా మారలేదు. ఖర్జూరపు ఆకుల పైకప్పు, మట్టిగోడల చిన్న కుటీరం, ద్వారం వద్ద తలుపులకు బదులు గోనెపట్టా వేలాడుతూ ఉండేది. సాధారణమైన భోజనం, చాలా సందర్భాల్లో పస్తులే. మాసికలు వేసిన దుస్తులు. కంబళి, గోనెపట్టాలే పడక దుప్పట్లు. ఖర్జూరపు ఆకులతో నేసిన పైకప్పు ఉన్న మస్జిదులో చాపలపై కూర్చుని పూర్తి అరేబియాను పాలించారు. పేదల మధ్య జీవించి పేదల మధ్య చనిపోవాలని దైవాన్ని వేడుకునేవారు. చరిత్రలో ఇలాంటి పాలకుడి ఉదాహరణ మరొకటి దొరకదు. అలా ఉండేవారు మహామనీషి ప్రవక్త ముహమ్మద్ (స).

కాబట్టి నా లాంటి ఒక సాధారణ వ్యక్తి ఈ చిరుపుస్తకాన్ని రాయడంలోను ఒక ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా ప్రపంచంలో అత్యధికంగా ఉన్న సామాన్య ప్రజలకు ఇది ఉపయోగపడుతుంది. ఈ పుస్తకం వల్ల ఇస్లాంకు వ్యతిరేకంగా పక్షపాతంతో విమర్శలు చేస్తున్నవారు, ప్రవక్త గురించి అపార్థాలు కలిగి ఉన్నవారు తమ అపార్థాలు, అపోహలకు దూరమవుతారన్న ఆశ మాత్రమే కాదు, విశ్వాసం కూడా నాకు ఉంది.

జూలై, 1978 **- రాజేంద్ర నారాయణ్ లాల్,** ఎం.ఏ

వారణాసి

# మతం ప్రాముఖ్యత

**ప్రశ్న: ఈ వైజ్ఞానిక యుగంలో కూడా మతానికి, ధర్మానికి ప్రాముఖ్యత ఉందా?**

జవాబు: ఖచ్చితంగా! సైన్స్, మతం ఒకదానికొకటి విరుద్ధంగా లేవు. సైన్స్ అనేది మానవజీవితంలో వికాస కోణం. రాతి యుగం నుండి అణు యుగం వరకు విజ్ఞానం అభివృద్ధి చెందింది. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. రాతి యుగంలో రాతి ఆయుధాలకు ఎంత ప్రాముఖ్యం ఉండేదో నేటి ఈ ఆధునిక యుగంలో అణుబాంబులకు కూడా అంతే ప్రాముఖ్యం ఉంది. ఒకప్పుడు ఎడ్లబండికి ఈ రోజు విమానానికి ఉన్నంత ప్రాముఖ్యత ఉండేది. దీనివల్ల తెలిసేదేమంటే, వైజ్ఞానిక ఆవిష్కరణల ప్రాముఖ్యత కాలక్రమేణా తగ్గుతూ పోతుంది. దీనికి విరుద్ధంగా సత్యధర్మ సిద్ధాంతం శాశ్వతమైనది, సర్వకాలాలకు సంబంధించింది. సైన్స్ మనిషి జీవన ప్రమాణాలను పెంచగలదు. దీన్ని అదుపు చేయకపోతే అది మనిషిని రాక్షసుడిగా మార్చేస్తుంది. మరోవైపు, ఒక సంపూర్ణ ధర్మం మనిషి జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు మనిషి జీవితాన్ని ప్రమాణబద్ధం చేస్తుంది. సినిమా వల్ల లభించే వినోదం మనిషి జీవితానికి ఉపయోగపడవచ్చునేమో కాని భార్యాపిల్లలను పస్తులుంచి సినిమా వినోదాన్ని పొందడం జరగదు. మనిషికి కారు అవసరం కావచ్చు కానీ లంచాలు తిన్న డబ్బుతో కాదు. అక్రమ సంపాదన ద్వారా డబ్బు పోగేసి పెంచుకున్న జీవన ప్రమాణాలు ఎల్లప్పుడూ ఖండించదగినవే. అద్భుతమైన, అతి గొప్ప ఆవిష్కరణలు ఉన్నప్పటికీ నేడు కూడా మానవ విలువలు అలభ్యమయ్యాయన్న వాస్తవాన్ని ఎవరు తిరస్కరించగలరు? మనిషి భౌతికసుఖాల కోసం ఎంతగా పరుగులు పెడుతున్నాడో అంతగా వాస్తవానందానికి దూరమవుతున్నాడు. మనం భౌతిక సుఖాలలో మునిగిపోయామని వర్డ్స్ వర్త్ చెప్పిన మాటల్లో ఎంతో సత్యముంది. సైన్స్ రెండువైపులా పదునున్న కత్తి వంటిది. విద్యుచ్ఛక్తి నిస్సందేహంగా ఇంట్లో వెలుగులు పరచుకునేలా చేస్తుంది. కానీ పొరబాటున తాకినా తక్షణం ప్రాణాలు హరిస్తుంది. అతన్ని కాపాడాలనుకునే వ్యక్తి కూడా తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అతను కూడా

ప్రమాదానికి గురవుతాడు. సైన్సులో మంచి చెడు– రెండూ ఉన్నాయి. అయితే సైన్సును నియంత్రించి, నష్టాలను అరికట్టడం అన్నది సంపూర్ణ సత్య ధర్మంలోని సార్వత్రిక సూత్రాల ద్వారా సాధ్యం. అణు బాంబులు హైడ్రోజన్ బాంబులు, న్యూట్రాన్ బాంబులు సైన్సు ఇచ్చిన కానుకలు. రెడ్ క్రాస్, ఐక్యరాజ్యసమితి మతధర్మం ఇచ్చిన బహుమతులు. ఏది ఏమైనా మనం బతకాలి, అందరినీ బతకనివ్వాలంటే సామరస్య, సౌహార్ధ, పరస్పర అభిప్రాయమార్పిడుల వైఖరితోనే వ్యక్తిగత, సామాజిక, జాతీయ, అంతర్జాతీయ సుఖశాంతులు లభిస్తాయి. పరలోక చింతన కూడా మనకు అవసరం. సత్యధర్మం దేవుడు మాధ్యమంగా మనిషిని మనిషితో కలుపుతుంది. అందువల్ల సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు అయిన దేవుని నీడలోనే మన జీవన సౌధాన్ని నిర్మించుకోవాలి. మనిషికి తన కోసం, తన కుటుంబానికి, తన దేశానికి, మొత్తం మానవాళికి వసతి కల్పించే అనేక అంతస్తులతో కూడిన జీవన భవనాన్ని కట్టుకోవాలి. ఈ జీవనభవనం సత్యధర్మం పునాదులపై నిలబడాలి. ఏకేశ్వరవాదం, సమానత్వం, సోదరభావాల సిమెంటుతో ఈ భవనాన్ని దృఢంగా కట్టుకోవాలి.

**ప్రశ్న: ప్రపంచంలో ప్రబలంగా ఉన్న మతాలన్నీ ఒకదాన్ని మరొకటి వ్యతిరేకిస్తు న్నాయి. ప్రతి మతం దేనికదే గొప్ప మతంగా చెప్పుకుంటుంది. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి?**

**జవాబు:** ముఖ్యమైన మతాల విశ్లేషణాత్మక, తులనాత్మక, సమన్వయాత్మక అధ్యయనం చేయాలి. ప్రపంచంలో ఒకే ఒక్క మతం ఉండడమన్నది సాధ్యం కాదు. అన్నింటి అత్యుత్తమ గుణాలను మనం గ్రహించే గుణగ్రాహిగా మారగలం. చైనాలో కన్ఫ్యూషియనిజం ప్రాచీనకాలంలో మతంగా ఉండేది. అది ఇప్పుడు లేదు. జైనమతం హిందూ మతంలో విలీనం అయ్యింది. పార్శీ మతం, సిక్కు మతం, యూదు మతం, షింటో మతం ప్రాంతీయమైనవి, సంఖ్యాపరంగా చాలా చిన్నవి. కాబట్టి హిందూ మతం, బౌద్ధమతం, క్రైస్తవ మతం, ఇస్లాం మతాల తులనాత్మక అధ్యయనం చేస్తే మనకు కావలసిన సమాధానం దొరుకుతుంది. ఈ మతాలన్నింటినీ స్వామి దయానంద సరస్వతి "సత్యార్థ ప్రకాశ్" అనే పుస్తకంలో సమీక్షించారు. కాని దురదృష్టవశాత్తు, స్వామీజీ పక్షపాతంతోను, సంకుచితంగాను, రంధ్రాన్వేషణా ధోరణిని అవలంబించారు. స్వామీజీ ధర్మసంస్కరణ ఉద్దేశ్యంతో ఈ పని చేసినప్పటికీ, ఆయన పాటించిన వైఖరి వల్ల తన ఉద్యమాన్ని విస్తరించలేకపోయారు. ఆయన ప్రారంభించిన ఆర్యసమాజ్ తక్కువ సమయంలోనే బలహీనపడింది.

# హిందూ ధర్మం

హిందూ ధర్మాన్ని స్థాపించిన వ్యక్తి అంటూ ఎవరు లేరు[1].

కానీ హిందూ ధర్మం ప్రకారం, వేదాలను శ్రుతులు అంటారు. అంటే దైవ గ్రంథాలు. కానీ సాధారణ హిందువు వేదాలను చూడ్డం చాలా అరుదు. ఇండ్లలో వేదప్రతులు ఉండడమనే ప్రశ్నే లేదు. ఈ పరిస్థితిలో సగటు హిందువు వేదాల నుంచి జ్ఞానం ఆర్జించే అవకాశాలు లేవు. అంతేకాదు మెజారిటీ హిందువుల మతం అయిన సనాతన ధర్మం బ్రాహ్మణులు తప్ప ఇతర వర్ణాల వారు వేదాలను చదవకుండా నిషేధిస్తుంది. క్షత్రియులు, వైశ్యులు, శూద్రులతో సహా సాధారణ హిందువులు ఎవ్వరూ తమ ధర్మగ్రంథాలను చదవకపోవడం హిందూ మతంలో ఒక విచిత్రమైన పరిస్థితి.

బ్రాహ్మణులు తప్ప ఇతర హిందువులు ఎవ్వరూ వేదాలు చదవకుండా

---

1. ఈ సందర్భంగా ప్రసిద్ధ పండితుడు రామ్ ధారి సింగ్ దినకర్ పరిశోధనను పరిశీలించడం కూడా అవసరం. ఆయన హిందీలో రాసిన పుస్తకం "సంస్కృతికే చార్ అధ్యాయ్"లో "హిందూ సంస్కృతికే రచయిత" అనే శీర్షికతో ఇలా రాశారు – వాస్తవానికి, క్రైస్తవ మతం యేసుక్రీస్తుతోను, ఇస్లాం మతం ప్రవక్త ముహమ్మద్ తోను ప్రారంభమైనట్లు, హిందూ మతం ఏ ఒక్క వ్యక్తితో ప్రారంభం కాలేదు అని రాశారు. ఒక సాధారణ హిందువును మీ మతగ్రంథం ఏది అని అడిగితే, అతను ఒక్కదాని పేరు కూడా చెప్పలేడు. అదేవిధంగా, మీ మతంలోని ముఖ్యమైన వ్యక్తి, అవతార్, నబీ లేదా ప్రవక్త ఎవరు అని అడిగితే అప్పుడు ఏ ఒక్క పేరును కూడా చెప్పలేడు. అలా చెప్పలేకపోవడం సముచితమే. ఎందుకంటే మన మతం ఒక మహాత్ముని నుండి రాలేదు. లేదా ఏదో ఒక సంప్రదాయం నుండి రాలేదు. నిజం ఏమిటంటే, హిందూ మతం అనేది ఏదో ఒక విశ్వాసం మీద ఆధారపడలేదు. అది అనేక విశ్వాసాల సంచయనం. వివిధ కాలాల్లో భారతదేశానికి వచ్చిన అనేక జాతుల కలయికతో ఎలా భారతీయులు ఏర్పడ్డారో అదేవిధంగా హిందూమతం కూడా ఆ వివిధ సముదాయాల మత విశ్వాసాలతో రూపొందింది. (పేజీ 45)

"సంస్కృతి కే చార్ అధ్యాయ్" నుంచి మరిన్ని కొటేషన్లు మున్ముందు ఇవ్వడం జరిగింది.

నిషేధించడానికి కారణం అవి సామాన్య జ్ఞానానికి మించినవి. క్లుప్తంగా చెప్పాలంటే ఈ ధర్మగ్రంథాలు కేవలం సంస్కృత గ్రంథాలయాల్లో అలంకరణలుగా ఉండిపోయాయి. లేదా నగరాల్లో అత్యల్ప సంఖ్యలో ఉన్న బ్రాహ్మణుల ఇండ్లలో ఏదో మూలన అలంకరణగా ఉండిపోయాయి. శతాబ్దం క్రితం ఆర్య సమాజ్ ఈ పరిస్థితికి వ్యతిరేకంగా ఆందోళన చేసి, హిందువులందరు వేదాధ్యయనం చేసే అవకాశం కోసం గొంతు విప్పింది. కాని సగటు ప్రజలు ఆచరించే హిందూ మతంపై ఈ ఆందోళన ప్రభావం ఏదీ పడలేదు. బ్రాహ్మణేతర కులాలు, మహిళలు ధర్మగ్రంథాలైన వేదాలను అధ్యయనం చేయరాదన్న మనుస్మృతి ఆదేశాలను అతిక్రమించలేదు. ఇదీ హిందూ ధర్మంలో ధర్మగ్రంథాలైన వేదాల పరిస్థితి. కాని వేదాలు అత్యంత ప్రాచీనమైనవి. చరిత్రాత్మకమైనవి.

వైదిక ధర్మానికి పునాది ఏకేశ్వరోపాసన. అందులో విగ్రహారాధన లేదు. వేదాల్లో మౌలికంగా పునర్జన్మ సిద్ధాంతం కూడా లేదు.[1]

---

1. వేద కాలంలో పునర్జన్మభావన లేదని రచయిత చెప్పడం పాఠకులకు ఆశ్చర్యం కలిగించవచ్చు, కానీ ఇలాంటి మాటలు ఇతర మేధావులు, రచయితలు కూడా చెప్పారు. రామ్ ధారి సింగ్ దినకర్ "సంస్కృతి కే చార్ అధ్యాయ్"లో ఇలా రాశారు: "నాస్తికులు, భౌతికవాదులు తప్ప సగటు హిందువుల్లో పరలోక భయం లేని వారు చాలా తక్కువ. కాని ఇది వేద కాలానికి చెందిన విశ్వాసం కాదు. వేద కాలంలో ఋషులు నాస్తికులు లేదా భౌతికవాదులు కాదు, కానీ వారు మరణం గురించి ఆలోచించినట్లు కనబడదు. స్వర్గం దాంతోపాటు ఆత్మలు శిక్షలను అనుభవించే నరకం ఉంటాయన్న భావన కూడా వారిలో ఉండేది కాదు. నిజానికి, వేదకాలం ఋషులు ఆత్మ, పునర్జన్మ, కర్మఫలం వంటి విషయాల గురించి పెద్దగా ఆలోచించలేదు." (పేజీ 81)

ప్రస్తుత పునర్జన్మ సిద్ధాంతం ప్రకారం మానవులు, జంతువులు, కీటకాలు, చెట్లు మొదలైనవన్నీ గత జన్మలోని కర్మల ఫలితంగా అలా జన్మించాయి. ఈ సిద్ధాంతం లేకపోతే దేవుడు అన్యాయం చేశాడనే వాదన వినిపిస్తుంది. అంటే దేవుడు ఒక ప్రాణికి ఉచ్ఛ స్థాయికి చెందిన శరీరాన్ని, మరో ప్రాణికి నీచస్థాయికి చెందిన శరీరాన్ని ఇచ్చాడని, అలాగే మనుషుల్లోను కొందరిని బలవంతులుగా, కొందరిని బలహీనులుగా, కొందరిని ధనవంతులుగా, కొందరిని పేదవారుగా, కొందరిని తెలివైనవారుగా, కొందరిని తెలివి లేనివారుగా చేసి అన్యాయం చేశాడనే వాదన వస్తుంది. అర్థమేమిటంటే, జీవులలో మనిషి అత్యంత ఉన్నతమైనవాడు. ఎందుకంటే మంచి పని, చెడ్డ పని అనేది మనిషికి మాత్రమే వర్తిస్తుంది. కాని ఈ సిద్ధాంతాన్ని నమ్మితే వెంటనే జనించే ప్రశ్న ఏమిటంటే, మనిషి కన్నా

చతుర్వర్ణాలు అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర విభజన కూడా ఒకవిధంగా అర్థశాస్త్ర శ్రమ విభజన వంటిదే. ఈ వర్ణాల మధ్య వివాహాలు కూడా జరిగేవి. విశ్వామిత్రుడు క్షత్రియుడు. అయినా తన కర్మల వల్ల బ్రాహ్మణ రుషిగా మారాడు. అదేవిధంగా పరశురాముడు బ్రాహ్మణుడు అయినప్పటికీ, తన కర్మలరీత్యా క్షత్రియుడు. వశిష్ఠ మహర్షి గురించి ఆయన దాసిపుత్రుడంటారు. వాల్మీకి ఋషి బోయవాడు. శ్రీరాముడు భిల్ల మహిళ శబరీ (శూద్ర) ఎంగిలి రేగుపండ్లు ప్రేమతో

ముందు భూమిపై చెట్టుచేమ లేకపోతే మనిషి ఏం తిని బతకాలి? ఎలా బతగ్గలడు? అలాగే సృష్టి ఆదిలో మనిషి పూర్వజన్మ కర్మల ఫలితం అనేది ఎలా సాధ్యం?

ఈ ప్రశ్నలకు సమాధానం ఏమివ్వబడిందంటే, సృష్టి అనాదిగా కొనసాగుతూ వస్తోంది, అది అనంతమైనది. గ్రంథాలలో సృష్టి గురించి వివరంగా ఉందంటారు. సృష్టి మూలం, పరిణామాల చక్రం కొనసాగుతూ ఉంటుందని, అది శాశ్వతమైనది, అనంతమైనది అంటారు. ఈ సృష్టి అనాది కాలం నుండి ఏర్పడుతూ, క్షీణిస్తూ అలా కొనసాగుతూ ఉంటుందనే వివరణ ఇస్తారు. ఈ వివరణపై మరో ప్రశ్న తలెత్తుతుంది. గ్రంథాల ప్రకారం, ఈ సృష్టి దానికదే ఉనికిలో రాలేదు. దీన్ని దైవం సృష్టించాడు. ఆయనే దీన్ని అంతం చేస్తాడు. ఆయన ద్వారా అది అంతం అవుతుంది. అలాంటప్పుడు సృష్టి చక్రం అనాదిగా కొనసాగుతుందనడం ఎలా సాధ్యం? దీనికి సమాధానంగా దేవుడు అనాదిగా ఉన్నాడని, అనంతుడని, అందువల్ల ఆయన పని కూడా ఆద్యంతాలు లేనిదంటారు.

ఈ వివరణపై కూడా మరో ప్రశ్న పుడుతుంది. సృష్టి అనేది దేవుని పని. అలాంటప్పుడు అది ఎందుకు నాశనం చేయబడుతుంది? ఈ సృష్టిని కారణం, హేతువు లేకుండా ఆద్యంతాలు లేనిదిగా పరిగణించినప్పటికీ పునర్జన్మ సిద్ధాంతం రుజువు కాదు. ఎందు కంటే సృష్టి చక్రంలో ప్రతి సృష్టిలోను ఆది అంతాలు ఉంటాయి. అన్ని ప్రాణులను సృష్టిం చడం జరుగుతుంది. వాటి పునర్జన్మ ప్రళయకాలం వరకు జరగదు. శ్రీ దుర్గా శంకర్ సత్యార్థి ఋగ్వేదంలోని ఏడు మంత్రాల ద్వారా ఖుర్ఆన్ మాదిరిగా వేదాలు కూడా రెండు జన్మలను పేర్కొంటాయని నిరూపించారు. ఒకటి ప్రస్తుత ప్రపంచంలో ఉన్న జన్మ, రెండవది ప్రళయకాలంలో కర్మ ఫలాలను పొందడానికి లభించే మరో జన్మ. స్వామి దయానందుడు పునర్జన్మను ఎలా నమ్మారోనని ఆయన ఆశ్చర్యపోయారు. (మర్కజీ మక్తబా ఇస్లామీ, న్యూ ఢిల్లీ ప్రచురించిన "వేదాలు మరియు ఖురాన్"లో చూడవచ్చు).

నిజానికి, వేదాలలో ఇలాంటి బుద్ధికి అందని వాదనలు ఉండకూడదు. సృష్టిని పరిశీలించ లేని తరువాతి కాలాల్లోని రచయిత అభిప్రాయం కావచ్చిది. దేవుడు సృష్టిని వైవిధ్యం పునాదులపై నిర్మించాడు. సృష్టి వైవిధ్యం ద్వారానే నడుస్తోంది. భూమి, ఆకాశం, సూర్య చంద్రులను చూడండి, మనుషులందరూ ఒకేలా ఉంటే ఎవరి మాట ఎవరు వింటారు. వ్యవస్థీకృతం ఎలా అవుతారు?

తిన్నాడని చెబుతారు. రావణుడు, వాలి మరణించిన తర్వాత వితంతువులైన వారి భార్యల పునర్వివాహాలు కూడా రాముని ఆమోదంతో జరిగాయి. నియోగం గురించి వేదాలలో ప్రస్తావన ఉంది. సగోత్ర వివాహాలు కూడా కృష్ణుడి ఆమోదంతో జరిగాయి. రాముడు తన భార్యను కూడా విడిచిపెట్టాడు, అది సరైనదా కాదా అన్నది వేరే చర్చ. దశరథుని ముగ్గురు రాణులు కౌసల్య, కైకేయి, సుమిత్రలు తమ భర్తల మరణం తరువాత సతి చేయలేదు. కృష్ణుడి కాలంలో వారి బంధువు కుంతి కూడా సతి చేయలేదు.

వేదకాలం, రామాయణం, మహాభారత కాలాల్లోని ధర్మం మధ్యయుగ కాలంలో మారిపోయిందని స్పష్టమవుతోంది. ప్రస్తుత హిందూ మతం, సంస్కృతి కూడా మూల ఆదర్శమైన రాముడు, కృష్ణుడి కాలం నాటి మతం, సంస్కృతికి పూర్తిగా విరుద్ధంగా మారిందని స్పష్టమవుతోంది. ఆర్యులు, ద్రావిడులు, సింధు లోయ ప్రజలు, హూణులు, కుషాణులు మొదలైనవారితో కలయిక, వారి మత విశ్వాసాల ప్రభావం ఫలితంగా హిందూ మతంలో మార్పులు, వైరుధ్యాలు చోటుచేసుకుంటూ వచ్చాయి. ఫలితంగా వేదాలు, ఉపనిషత్తులు, అరణ్యకాల ఏకేశ్వరవాదం క్రమంగా బహుదేవతారాధనగా మారింది. ఋషులు ప్రతిపాదించిన స్మృతులు, తత్వాలకు కూడా మతపరమైన గుర్తింపు లభించింది. పౌరాణిక గాథలు కూడా అత్యున్నత మతపరమైన గుర్తింపును పొందాయి. నిరీశ్వరవాద జైనమతం, బౌద్ధమతం కూడా హిందూ మతంలో విలీనం అయ్యాయి. అంతేకాదు, వైష్ణవం, శైవం, శక్తి, తాంత్రిక సాధన వామమార్గం ఇవన్నీ మతపరమైన గుర్తింపు పొందాయి. నాలుగు వందల సంవత్సరాల క్రితం, అప్పటి వ్యావహారిక భాషలో, తులసిదాస్ భార్య మందలింపులతో తన ఆత్మానందం కోసం రాసిన రామచరితమానస్ ఉత్తర భారతదేశంలో హిందూ మతానికి మూలస్తంభంగా మారింది. అయితే హిందీలో ఉండడం వల్ల దక్షిణాదిలో ప్రజాదరణ పొందలేదు. తులసిదాస్ రాసిన ఇతర గ్రంథాలకు కూడా మతపరమైన గుర్తింపు లభించింది. ముఖ్యంగా హనుమాన్ చాలీసాకు చాలా గుర్తింపు లభించింది. సూర్ దాస్ నాలుగు వందల సంవత్సరాల క్రితం బ్రజ్ భాషలో రాసిన సుర్ సాగర్‌ను ఇష్టంగా పఠిస్తారు. ఇటీవలి సంతోషి మాతతో సహా కొత్త దేవీ దేవతల పరంపర కొనసాగుతూనే ఉంది. హిందూ మతంలో విస్తారమైన మతసాహిత్యం ఉందని వాదిస్తారు. నాలుగు వేదాలున్నాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం. ఈ వేదాల్లో ఏముందో 99 శాతం మంది హిందువులకు తెలియదు. స్మృతులున్నాయి, అందులోని విచారధారలు వేర్వేరు. అనేక ఉపనిషత్తులు ఉన్నాయి, యోగవశిష్ఠ, అరణ్యకాలున్నాయి. ఆరు దర్శనాలున్నాయి. వాటన్నింటిలోను వేర్వేరు భావనలున్నాయి. అతి తక్కువ

సంఖ్యలో ఉన్న కొద్దిమంది పండితులు మినహా సాధారణ హిందువులకు ఈ గ్రంథాల విషయసూచికలు కూడా తెలియవు.

రామాయణాలు కూడా రెండున్నాయి. వాల్మీకి రామాయణం, తులసి రామాయణం. వీటి ఆదర్శాలు కూడా విభిన్నమైనవి. పద్దెనిమిది పురాణాలున్నాయి. వీటి ప్రకారం, శివుడు భంగ్ కూడా తాగేవాడు. దేవతల రాజు ఇంద్రుడు ఎంత కామి అంటే దానికి సంబంధించిన చర్చలు కూడా మనకు లభ్యమవుతాయి. సాధారణ హిందువులకు తెలియని 6 శాస్త్రాలు ఉన్నాయి. హిందూ మతంలో ఐదుగురు ప్రధాన ఆచార్యులు శంకర, రామానుజ, వల్లభ, మాధవ, మరియు నింబార్కాచార్యులు. వారి సంప్రదాయాలు, సూత్రాలు, నమ్మకాలు విభిన్నమైనవి. వీరితోపాటు చాలా మంది ఆచార్యులున్నారు. మూడు ప్రధాన సంప్రదాయాలున్నాయి. వైష్ణవ, శైవ, శాక్త సంప్రదాయం. అన్నీ విభిన్నమైనవి. శుద్ధ ఆస్తికులైన శంకరాచార్యుల అనుచరులు హిందువులే, నిరీశ్వరవాద జైనులు, తాంత్రికవాద వామమార్గీయులు కూడా హిందువులే. ఉల్లిపాయలు, వెల్లుల్లి తినని వారు కూడా హిందువులే, తినకూడనివి తినేసే అఘోరీలు కూడా హిందువులే. పితాంబర ధారులైన సాధువులు కూడా హిందువులే, పూర్తిగా నగ్నంగా ఉండే సాధువులు కూడా హిందువులే. వైష్ణవులకు మాంసం నిషిద్ధం. శాక్తములో మాంసం ఆమోద యోగ్యమైనది. హిందువులు సూత్రప్రాయంగా ఏకేశ్వరవాదులు కాని ఆచరణలో బహుదేవతారాధకులు. సైద్ధాంతికంగా హిందూ ధర్మగ్రంథాలు వేదాలు, కానీ వాస్తవానికి ఉత్తర భారతదేశంలో వారికి రామచరితమానస్. దక్షిణాదిలోని హిందువుల నమ్మకాలు పూర్తిగా భిన్నమైనవి. సంస్కృతి పేరిట హోలీలో తిట్లు, దీపావళిలో జూదం ఆడటం, శివరాత్రి రోజున భంగు తాగడం మతాచారాలు. రామచరిత మానస్‌లో బ్రాహ్మణవాదం ఎంత బలంగా ఉందంటే సర్వగుణవిహీనుడైన బ్రాహ్మణుడు పూజ్యుడు. సర్వగుణ సంపన్నుడైన శూద్రుడు మాత్రం కాదు. స్మృతులన్నింటిలోను మనుస్మృతి శూద్ర వ్యతిరేకమైనది. మనువు, తులసిదాస్ ఇద్దరు శూద్రుల గురించి రాసింది ఒక్కటే. ఈ రెండు గ్రంథాలు లేకపోయినా బహుశా హిందూ మతంలోని విస్తారమైన సాహిత్యంపై ఎటువంటి ప్రభావం ఉండేది కాదు. పురాణాల విషయం ఇలాగే ఉంది. మరణానంతర జీవితం అనే భావనకు సంబంధించి కూడా హిందూ మతంలో వైరుధ్యం ఉంది. వారు స్వర్గనరకాలను నమ్ముతారు, పునర్జన్మను కూడా నమ్ముతారు. శిఖా సూత్ర (పిలక, జంధ్యం) విషయంలోను ప్రత్యామ్నాయాలున్నాయి. హిందూ మత పరిభాషలో సర్వత్రా

అస్పష్టత ఉంది. సంక్షిప్తంగా చెప్పాలంటే హిందూ మతం ఒక అద్భుతమైన విరోధాభాష ఉంది. ఎందుకంటే అందులో ఏకేశ్వరవాదం, బహుదేవతారాధన, ఆస్తికవాదం నిరీశ్వరవాదం, ద్వైతాద్వైతాలు, విశిష్టద్వైతం ద్వైతాద్వైతం, హింసాహింసలు, స్వర్గనరకాలు, పునర్జన్మ, నిరాకార సాకారవాదాలు, పురాణాలు దర్శనాలు, ప్రవృత్తివాదం, నివృత్తివాదం, ఆశావాదం నిరాశావాదం, పిడివాదం, ఉదారవాదం, శాఖాహారం, మాంసాహారం అన్నీ కలగలిసి కనిపిస్తాయి. విస్తారమైన ఈ మతపరమైన సాహిత్యం, ఇందులోని వైరుధ్యాలు డాక్టర్ రాధాకృష్ణన్ వంటి హిందూ పండితుల పరిశోధనకు ఉపయోగ పడవచ్చు. స్వామీ వివేకానంద వంటి చాలా మందికి ఇందులో ఆధ్యాత్మిక వాదాన్ని వెదికే శక్తి ఉండవచ్చు. చాలా మంది సంస్కర్తలకు ఇందులో సంస్కరణా ప్రయత్నాల పేరు ప్రఖ్యాతులు లభించవచ్చు. కాని సగటు హిందువులకు వర్తమాన హిందూ ధర్మంలో ఏదీ అర్థం కాదు. ఇదంతా అయోమయంగా కనిపిస్తుంది. ఇంద్రజాలంగా అనిపిస్తుంది. ఇది బ్రాహ్మణ వాదానికి మరో పేరనిపిస్తుంది. ఇందులో సగటు హిందువులకు వ్యయప్రయాసలతో కూడిన కర్మకాండలు, శూద్రులకు ఘోరమైన అవమానాలున్నాయి. వీటిని 2500 సంవత్సరాల క్రితం బుద్ధుడు మొదలు ఆధునిక కాలంలో గాంధీజీ వరకు పరిష్కరించలేకపోయారు. చివరకు డాక్టర్ అంబేద్కర్ వంటి ఆధునిక వ్యక్తి హిందూ మతాన్ని విడిచిపెట్టవలసి వచ్చింది. మహాత్మా గాంధీ నిరాహార దీక్ష కారణంగా పూనా ఒడంబడికలో దళితులకు ప్రత్యేక ఓటర్ల హక్కును త్యజించడం ద్వారా డాక్టర్ అంబేద్కర్ గొప్ప దాతృత్వం చూపించారు. డాక్టర్ అంబేద్కర్, హిందూ మతాన్ని త్యజించి, బౌద్ధమతాన్ని స్వీకరిస్తున్నప్పుడు భారతదేశంలో బౌద్ధమతం ఎంత బలహీనపడిందో, ఎందుకు బలహీనమయ్యిందో, బ్రాహ్మణులు తెలివిగా బుద్ధుడిని హిందూ మతంలో అవతారంగా మార్చేసి బౌద్ధమతం జన్మస్థలమైన భారతదేశంలో బౌద్ధాన్ని ఎలా తుడిచిపెట్టారనే చారిత్రక వాస్తవాలను దృష్టిలో ఉంచుకుంటే చాలా బాగుండేది. డాక్టర్ అంబేద్కర్ సమానత్వం కోరుకునేవారైతే, ఆఫ్రికాలోని నల్లవారి అణచివేతలపై గాంధీజీ చెప్పిన మాటలు– ఒక జులు క్రైస్తవుడు అయితే, తెల్ల క్రైస్తవులు అతనికి సమానత్వం ఇవ్వరు కాని అదే జులు ఇస్లాంను అంగీకరించినప్పుడు, అతను వెంటనే ఉన్నత స్థాయి ముస్లింతో పూర్తి సమానత్వం పొందుతాడని గాంధీజీ అప్పట్లో చెప్పిన మాటలను అంబేద్కర్ దృష్టిలో ఉంచుకుంటే బాగుండేది.

# బౌద్ధ ధర్మం

హిందూ మతానికి భిన్నంగా బౌద్ధ ధర్మం రూపుదిద్దుకోవడం గురించి మాట్లాడే ముందు బౌద్ధం మౌలికంగా ధర్మశాస్త్రం (Theology) కాదు, నీతిశాస్త్రం (Ethics) అని చెప్పాలి. అప్పట్లో హిందూ ధర్మం అంటే బ్రాహ్మణవాదంగా ఉండేది. దీనికి ప్రతిక్రియగా ఉనికిలోకి వచ్చిందని చెప్పడం అసమంజసం కాదు. ఆ కాలంలో బ్రాహ్మణులు సంస్కృతాన్ని తమ మత భాషగా మార్చేశారు. తద్వారా సగటు ప్రజలను దోచుకోవడం కొనసాగేది. యజ్ఞయాగాలు విపరీతంగా చేయించేవారు. వీటిలో చాలా పెద్ద సంఖ్యలో పశువులు బలయ్యేవి. చాలా విచ్చలవిడిగా జంతుబలి కొనసాగేది. ఈ యజ్ఞయాగాదులే కాకుండా అత్యంత వ్యయభరితమైన కర్మకాండలుండేవి. నిమ్న కులాల పట్ల విద్వేషం, అణచివేతలుండేవి. గౌతమ బుద్ధుడు బాల్యం నుండి చాలా దయార్ద్రహృదయుడు, ఆలోచనాపరుడు. హింసావ్యతిరేకి. దౌర్జన్యాలను వ్యతిరేకించే మనస్తత్వంతో సంస్కరణ కోరుకునే స్వభావి. రాజభోగాలన్నీ ఆయనకు అందుబాటులో ఉన్నాయి. కాని ఒక రోగిని, ముసలివ్యక్తిని, మృతదేహాన్ని చూసి చలించిపోయాడు. వైరాగ్యాన్ని స్వీకరించాడు.

ఒకరోజు అన్నీ త్యజించి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కఠోరమైన తపస్సు తరువాత జ్ఞానోదయం పొందాడు. బాధకు కారణం కోరిక అని, మోక్షం కోసం దానిని త్యజించడం అవసరమని ఆయన ప్రకటించాడు. దేవుని పేరిట మితిమీరిన జీవ హింస, వైదికమతం ముసుగులో నిమ్న కులాలపై వేధింపులకు ప్రతిక్రియగా అహింసను, నిమ్నకులాల పట్ల ఆదరణను బోధించాడు. తన నైతికసూత్రాలను ప్రచారం చేయడానికి వ్యావహారిక భాషను ఆశ్రయించి వేదాలను సవాలు చేశాడు. తన మతంలో దేవునికి కూడా స్థానం ఇవ్వలేదు. హిందూ మతాన్ని సంస్కరించే ఉద్దేశ్యమే బుద్ధునిది అయినప్పటికీ, అందుగ్గాను ఆయన నైతికతను ఆశ్రయించినప్పటికీ, ఒక విధంగా ఆయన సిద్ధాంతాలకు హిందూ మత విశ్వాసాలతో మౌలిక వ్యత్యాసం

ఉంది. అందువల్ల బౌద్ధమతం హిందూ మతానికి పోటీగా స్వతంత్ర మతంగా రూపుదిద్దుకుందని అర్థం చేసుకోవాలి. ఆయన స్వయంగా యువరాజు. ఆయన వ్యక్తిత్వం ప్రజలను ప్రభావితుల్ని చేసింది. నిమ్నకులాల పట్ల సానుభూతి, వ్యావహారిక భాషను ఉపయోగించడం వల్ల అతిస్వల్ప కాలంలోనే ఆయన విజయం సాధించారు, ప్రజలు ఆయన అనుచరులుగా మారారు. ఆయన తన మతాన్ని మిషనరీ మతంగా మార్చుకున్నాడు. మొదట కొంత సంకోచించినా తర్వాత మహిళలను కూడా ధర్మ సంఘంలో అనుమతించాడు. గృహస్థులు, భిక్షువులు, భిక్షుణిలకు వేర్వేరు నియమాలను రూపొందించాడు. ఆయన తరువాత, రాజాశ్రయం లభించడం వల్ల బౌద్ధమతం విస్తరించింది. అశోకుడు, కనిష్కుడు, హర్షుడు బౌద్ధమత విస్తృతికి చాలా తోడ్పాటు అందించారు. ఈ చక్రవర్తుల ప్రోత్సాహంతో, బౌద్ధమతం భారతదేశం సరిహద్దులు దాటి విస్తరించింది. ఎందుకంటే ఆయా దేశాల్లో– ఆ కాలంలో– బౌద్ధ మతం కంటే ఉత్తమమైన మతం మరొకటి లేదు. కాని కాలక్రమేణా బౌద్ధమతం పతనం ప్రారంభమయ్యింది. భారతదేశంలో క్షీణదశకు చేరుకుంది. భిక్షువులు, భిక్షుణిల్లో అవినీతి, వ్యభిచారం ప్రవేశించాయి. రాజాశ్రయం లేకుండా పోయింది. ఇంకా ఇతర చారిత్రక కారణాల వల్ల బౌద్ధం పుట్టిన దేశంలోనే కనుమరుగైంది. టిబెట్లో కూడా అంతరించింది. బౌద్ధమతం సజీవంగా ఉన్న చోట్ల కూడా అది నిష్క్రియాత్మక రూపంలో మాత్రమే మిగిలింది. శక్తి హీనమయ్యింది. బౌద్ధం పుట్టిన భారతదేశంలోనే పురోగతి శిఖరం నుండి పతనావస్థకు చేరుకున్న వైనం ద్వారా బౌద్ధం ప్రాసంగికతను అంచనా వేయవచ్చు. గౌతమ బుద్ధుడు స్వయంగా వ్యతిరేకించిన విగ్రహారాధన, కాలక్రమేణా అతని అనుచరులు అతన్ని దేవుడిగా భావించి విగ్రహంగా పూజించడం స్థాయికి చేరుకుంది. ఏ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా బుద్ధుడు ఉద్యమించాడో అవే మూఢ నమ్మకాలు హిందూ మతం కంటే ఎక్కువగా బౌద్ధుల మహాయాన శాఖలోనూ, టిబెట్ లామాయిజంలోను చొచ్చుకుపోయాయి. అహింస వంటి బౌద్ధమతంలోని ఆకర్షణీయమైన నైతిక సూత్రాలు హిందూ మతంలో విలీనం చేయబడ్డాయి. బ్రాహ్మణులు తెలివిగా బుద్ధుడిని ఒక అవతారంగా మార్చి భారతదేశంలో బౌద్ధాన్ని తెలివిగా తొలగించారు.[1]

చరిత్రలో ఇస్లామ్ స్వల్ప వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం ఒక అద్భుతం అయితే, బౌద్ధమతం పుట్టిన చోటనే స్వదేశంలో అకస్మాత్తుగా క్షీణించడం విచిత్రం. వ్యాధి, వృద్ధాప్యం, మరణాల భయం బౌద్ధమత ప్రారంభానికి మూలం.

---

1. అదే సమయంలో, శంకరాచార్యులు బౌద్ధమతానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించి, దానిని భారతదేశం నుండి నిర్మూలించారు.

ఇందులో దేవుని భయం లేదు. పునాది లేని కట్టడం ఎలా నిలవదో అదేవిధంగా దేవుని విశ్వాసం లేకుండా ఉన్న మతం కూడా నిలబడలేదు. బౌద్ధమతంలోని పది సూత్రాలు, అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం (ఆస్తి త్యాగం) నృత్య సంగీతాల పరిత్యాగం, అంజన్, పండ్లు, పరిమళ ద్రవ్యాల త్యాగం, అసమయ భోజనత్యాగం, మెత్తటి పరుపుల త్యాగం, కామిని కాంచనాల త్యాగం.[1]

ఇందులో కొన్ని మినహాయిస్తే మిగిలినవి కఠినమైనవి నిర్హేతుకమైనవి. బౌద్ధ మతంలోని నిరీశ్వరతత్వం కారణంగా వీటిలోని నైతికత కూడా వ్యర్థమయ్యింది. దేవుని భయం లేకుండా నైతికతను అమలు చేయడం అసాధ్యం. నిరీశ్వరవాద, నిరాశావాద ధర్మం వ్యక్తిని తీర్చిదిద్దడంలో కాని, లోక కళ్యాణానికి గాని ఎంతవరకు తోడ్పడు తుంది? సాధారణ ఇంగితజ్ఞానంతో కూడా దీన్ని సమీక్షించుకోవచ్చు. మనుగడ కోసం పోరాటం (Struggle for Existance) మనిషికి చాలా అవసరం. సమర్థులదే మనుగడ. (Survival of the fittest సహజ ఎంపిక అని కూడా అంటారు). ఇది ఒక వైజ్ఞానిక ఆవశ్యకత. భక్తియార్ ఖిల్జీ కొద్దిమంది సైనికులతో వస్తున్నాడని విని అప్పటి బీహార్ బౌద్ధ రాజు రాజధాని నుండి చెప్పులు కూడా తొడక్కుండా పారిపోయాడు. అదే విధంగా, చైనా దండయాత్ర సమయంలో టిబెట్ ద్వారా ప్రతిఘటన లేకపోవడం జీవితం కోసం పోరాటంలో బౌద్ధమతం నిర్లిప్తతకు చారిత్రక రుజువు. నిరీశ్వరవాదం, నిరాశావాదం (Atheism and Pessimism) మానవాళికి ఎన్నడూ మేలు చేయవు. నైతిక ప్రయోజనాల విషయంలో అయినా గానీ లేక జీవిత పోరాటంలో అయినా గానీ వీటివల్ల లాభం లేదు.[2]

---

1. జీవితకాల బ్రహ్మచర్యానికి సంబంధించిన సూత్రంపై ఆధారపడిన మతం మానవ స్వభావానికి వ్యతిరేకం. దేవుడిపై విశ్వాసం ఉన్నప్పటికీ అది సర్వ మానవుల మతంగా మారలేదు. స్థిరంగా ఉండడం సాధ్యం కాదు. ఈ సూత్రాలను పాటించడం సాధ్యం కూడా కాదు.

2. నిశితంగా గమనిస్తే, బౌద్ధమతం మతాల కోవకు చెందినది కాదు. మతం అనేది దేవునిపై విశ్వాసం, దైవదత్తమైన జ్ఞానం అనే నమ్మకాలపై ఆధారపడి ఉంటుంది. బుద్ధుడు హిందువు అయినప్పటికీ దేవుడిని, వేదాలను తిరస్కరించాడు. దైవతిరస్కారం, వేద తిరస్కారం ఆయన మతానికి మూలాలు. ఆయన చేసిన తపస్సు, ధ్యానాలకు మరి అర్థమేమిటి? తపస్సు ధ్యానం ద్వారా పొందిన జ్ఞానం ఎక్కడ నుండి, ఎవరి నుండి లభించింది? జ్ఞానానికి మూలం దేవుడు. దైవారాధన, భక్తిభావన ప్రాపంచిక జీవితంలో శ్రేయాన్ని, మోక్షాన్ని ప్రసాదిస్తుంది. బుద్ధుని బోధనల్లో ఇవి లేవు.

   బౌద్ధమతం ప్రాథమిక బోధన ప్రపంచాన్ని త్యజించడం, బ్రహ్మచర్యం. ఈ బోధన ప్రకారం సృష్టి కూడా అర్థరహితం అవుతుంది. ఇలాంటి మతం సార్వత్రిక మతం ఎలా

కాగలదు? సంపూర్ణ మానవ జీవన విధానమైన మతమే సంపూర్ణ ధర్మం అవుతుంది. అందులో ప్రాపంచిక జీవిత విధానం, పరలోక చింతన, రెండింటి సమతుల్యం ఉండాలి. బౌద్ధం ఒకవిధమైన అభిప్రాయం. బుద్ధుడు దయార్ద్ర హృదయుడు. ఆయన కాలంలో మతం దుర్వినియోగమవుతూ ఉండేది. బాహ్యాడంబరాలు ముఖ్యంగా ఉండేవి. సదాచరణ, నైతికతలు పరిహాసం పాలయ్యాయి. ఇవన్నీ మతం సాకుతో జరిగేవి. ధార్మికులు కూడా ఇలాగే ఉండేవారు. దేవదాసీలుగా అమ్మాయిలను అర్పించడం, వారి నృత్యగానాలు, అత్యుత్తమమైన ఆహారాన్ని సమర్పించడం, గంజాయి భంగ్ వంటి మత్తు పదార్థాల వినియోగం మతాచారాలుగా మారిపోతే ధర్మంలో పవిత్రత ఎక్కడుం టుంది? దీనితో పాటు యజ్ఞయాగాల్లో పశువుల బలులు విపరీతం అయిపోవడం జరిగింది. ఈ పరిస్థితి బుద్ధుడిని ధర్మవిరోధిగా మార్చేసింది.

భౌతికవాదం మతంలోకి ప్రవేశించిందని గ్రహించిన బుద్ధుడు, ఆధ్యాత్మికతను తన మతంలో ముఖ్యమైనదిగా చేసుకున్నాడు. ప్రపంచ త్యాగం, బ్రహ్మచర్యం, కరుణ, ప్రేమ, సౌమ్యతలు బోధించాడు. ఇది సమాజంపై గొప్ప ప్రభావాన్ని వేసింది. బౌద్ధమతం భారతదేశం నుండి బయటకు విస్తరించినప్పుడు ఇతర దేశాలలో కూడా దానికి స్వాగతం లభించింది. కానీ ఆ దేశాలన్నీ బహుదేవతారాధన పాటించే దేశాలు. బౌద్ధమతం వారి నమ్మకాల పట్ల రాజీ ధోరణి ప్రదర్శించింది. ఫలితంగా స్వయంగా బుద్ధుడి విగ్రహాన్నే పూజించడం ప్రారంభమయ్యింది. బ్రహ్మచర్యం, భిక్షువు, భిక్షుణిల సమ్మిశ్రిత వ్యవస్థ కూడా దేవదాసీలు, దేవతారాధకుల సమ్మిశ్రిత వ్యవస్థ ఎలా మారిందో అలాగే మారిపోయింది. దీనివల్ల కూడా బౌద్ధం దెబ్బతింది. ఆ తరువాత శంకరాచార్యుల ఉద్యమం భారతదేశం నుండి బౌద్ధమతాన్ని నిష్క్రమించేలా చేసింది. బౌద్ధ విహారాలు కూడా ధ్వంసమయ్యాయి. కాని శోచనీయం ఏమిటంటే తర్వాత ఈ విషయంలో ముస్లిం రాజులను దోషులుగా నిలబెట్టారు. బౌద్ధమతంలో ఇతర లోపాలు కూడా ఉన్నాయి. బుద్ధుడు దేవుడిని విశ్వసించనప్పుడు, మొదటి ప్రశ్న సృష్టి ఆరంభం ఎలా, ఎవరి ద్వారా జరిగిందని ఆయన భావించారు? రెండవ ప్రశ్న ఏమిటంటే, బుద్ధుని తపస్సుకు అర్థం ఏమిటి? తపస్సు ధ్యానం దేవునికి సంబంధించినవి. మూడవ ప్రశ్న ఏమిటంటే జ్ఞానానికి మూలం దేవుడు. బుద్ధుడు దేవుని నమ్మనప్పుడు ఆయన పొందిన జ్ఞానానికి మూలం ఏమిటి? ఆయనకు ఎవరి ద్వారా ఎలా జ్ఞానం లభించింది? కొన్ని సంఘటనలు చూసి ఆయన ప్రాపంచిక సుఖాలను త్యజించారు. కొన్ని నియమాలను, సూత్రాలను రూపొందించారు. అన్నీ త్యాగంపై ఆధారపడినవి. ఇలాంటి మతం సంపూర్ణ మతంగా నిలబడలేదు. ఒక జీవన విధానంగా మారే శక్తి దానికి ఉండదు. ఈ విధంగా జీవితం గడపడం సాధ్యం కాదు. నాల్గవ ప్రశ్న ఏమిటంటే, బౌద్ధమతం ప్రకారం, శరీరంతో పాటు జీవి కూడా మరణిస్తుంది. కర్మ ఫలం ప్రకారం, మరొక శరీరం జన్మిస్తుంది. అటువంటి పరిస్థితిలో నిర్వాణం లేదా మోక్షం అర్థం ఏమిటి? మనిషి మళ్ళీ లేపబడక పోతే, మనిషి సృష్టి నిష్ఫలంగా మారిపోతుంది.

# క్రైస్తవం

క్రైస్తవానికి ఆధారం బైబిల్ రూపంలో యేసుక్రీస్తు ద్వారా వెల్లడైన దివ్యజ్ఞానం. అవసరాలు అనివార్య పరిణామాలకు దారి తీస్తాయి. యూదుల మత గ్రంథంలో మార్పులు చేర్పులు జరిగిపోయి, మూసా ప్రవక్త బోధనలకు యూదులు చాలా దూరమైపోయారు. ఈ చెడులను దూరం చేయడానికి యేసు ప్రవక్తగా ప్రభవించారు. తౌరాత్ గ్రంథానికి సంస్కరణ రూపంలో బైబిలు ప్రపంచానికి లభించింది. ప్రపంచ సంక్షేమం కోసం యేసు అద్భుతమైన బలిదానం చేశారు. కాని యేసుక్రీస్తుకు తన జీవితకాలంలో ఆశించిన విజయం లభించలేదు. అయితే ఆయన తర్వాత క్రైస్తవ మతం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ఆయన కన్య మేరీకి జన్మించారు. దేవుని మహత్యాలను నమ్మేవారు ఈ సంఘటనను హేతుబద్ధమైన (Rationale) కథనంగా నమ్ముతారు. నమ్మాలి కూడాను.

ఆది మానవుడెవరన్నది సైన్సుకు ఇప్పటికి కూడా ఛేదించలేని రహస్యమే. అదేవిధంగా, విత్తు ముందా చెట్టు ముందా అనే ప్రశ్న కూడా ఒక చిక్కుముడి. కాని మతానికి ఇది దేవుని పని. ప్రాచీన హిందూ మతం కూడా ఇదే విశ్వాసాన్ని ఆమోదిస్తుంది. శివుడు స్వయంభువు అంటే తల్లిదండ్రులు లేరు. కాని ఆయనకు ఇద్దరు పుత్రులు. కార్తికేయుడు, గణేశుడు. రాముని భార్య జననం కూడా ఇలాంటిదే. ఆమె జనకమహారాజుకు భూమి లోపల నుండి లభించింది. కృష్ణుడి బంధువు కుంతికి కన్యగా ఉన్నప్పుడు కర్ణుడు అనే కుమారుడు జన్మించాడు. ఈ జననాలన్నీ హిందూ మతంలో పవిత్రమైనవి. నిస్సందేహంగా యేసుక్రీస్తు దైవప్రవక్త అయినప్పటికీ క్రైస్తవమతంలో తర్వాతి కాలాల్లో లోపాలు, దోషాలు చోటు చేసుకున్నాయి. త్రిత్వం – దేవుడు, దైవ కుమారుడు, పరిశుద్ధాత్మల విశ్వాసం ప్రవేశించింది. హిందువుల త్రిమూర్తులు –బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. ఈ విశ్వాసం కూడా లోపభూయిష్టమైందే. హిందువుల ఈ

త్రిమూర్తులు వాస్తవానికి దేవుని గుణనామాలు. బ్రహ్మ సృష్టికర్త (Creator), విష్ణు సంరక్షకుడు (Protector), శివుడు లయకారకుడు (Destroyer). కాలక్రమేణా, జైనుల ప్రభావం వల్ల హిందూధర్మంలో విగ్రహారాధన ప్రవేశించింది. అప్పుడు ఈ ముగ్గురు మూర్తులకు సాకారరూపం ఇవ్వడం జరిగింది. నిజానికి నిరాకారుడైన దేవుని గుణనామాలు ఇవి. కానీ క్రైస్తవుల త్రిత్వ విశ్వాసం వేరు. ఇవి వేర్వేరు పేర్లు మాత్రమే కాదు, వేటికవే స్వతంత్ర అస్తిత్వాలు. యేసు దేవుని కుమారుడని భావించడం హిందూ పురాణాల అవతార భావనను పోలి ఉంటుంది. ఈ విశ్వాసం వల్లనే క్రైస్తవ మతం ఏకేశ్వరవాదం నుండి దారి తప్పింది. ఫలితంగా, హిందూ మతంలోని అనేక మూఢనమ్మకాలు, విగ్రహారాధన ఇందులోకి ప్రవేశించాయి. కాలక్రమేణా మేరీమాతను ఆరాధించడం కూడా  క్రైస్తవ మతంలో ప్రారంభమయ్యింది. యేసుక్రీస్తును విశ్వసించడం, పశ్చాత్తాపం, మరణానికి ముందు క్రైస్తవ ఫాదర్ సమక్షంలో తన పాపాలను ఒప్పుకోవడం చేస్తే చాలు మోక్షం లభిస్తుందని విశ్వసించడం మొదలయ్యింది. ఫలితంగా క్రైస్తవ మతంలో కూడా హిందూ ధర్మంలో మాదిరిగా  దైవాన్ని ప్రాథమిక స్థాయి (Primary) నుండి ద్వితీయ స్థాయి (Secondary)కి చేర్చడం జరిగింది. క్రైస్తవ మతంలో నైతికతకు సంబంధించి చాలా తక్కువ ప్రాధాన్యత కనిపిస్తుంది. యూరప్, అమెరికాలో, మద్యపానం, జూదం, వ్యభిచారం[1] చాలా ఎక్కువ. నల్లవారు, తెల్లవారనే వివక్ష, నల్ల క్రైస్తవులపై అణచివేతలు కొనసాగుతున్నాయి. హిందూధర్మంలో తక్కువ కులం వారిపై అణచివేతల మాదిరిగానే ఇవి కూడా ఉన్నాయి. హిందూ మతం మాదిరిగానే క్రైస్తవంలోను సమాజవాద దృక్పథం,  సమానత్వం, సోదరభావాలను సృష్టించే  శక్తి సామర్థ్యాలు లేవని స్పష్టమవుతుంది. కాబట్టి దేవుడు మునుపటి ధర్మాల్లో చోటు చేసుకున్న దోషాలను నివారించడానికి, మానవ కళ్యాణం కోసం, చివరి దైవప్రవక్త ముహమ్మద్ (స)ను ప్రపంచంలో ప్రభవింపజేశాడు. దివ్యఖురాన్‌లోని చిట్టచివరి దైవాదేశాల ద్వారా ప్రపంచంలోని అన్ని చెడులు, లోపాలు ప్రక్షాళనం చేయడానికి పంపించాడు.

---

1. ఇప్పుడైతే స్వలింగసంపర్కం, స్వలింగ వివాహాలు  (Homosexuality and Lesbianism) కూడా సమ్మతమై పోయాయి.

# ఇస్లామ్ ధర్మం

ఇస్లాంను తెలుసుకోవాలంటే ముందు ప్రవక్త ముహమ్మద్ (స) వ్యక్తిత్వాన్ని తెలుసుకోవడం అవసరం. ఆయన ద్వారా దేవుని ఆదేశాలు దివ్యఖుర్ఆన్ రూపంలో, చిట్టచివరి దైవగ్రంథం రూపంలో అవతరించాయి. రాముడు, బుద్ధుడు, మహావీరుడు రాజకుటుంబాల్లో జన్మించారు. కాని ప్రవక్త ముహమ్మద్ రాజకుటుంబంలో జన్మించలేదు. ఆయన పుట్టినప్పుడు ఉత్సవాలేవీ ఘనంగా జరగలేదు. ఆయన పెంపకం సుఖభోగాలతో జరగలేదు. ఆయన విద్యాశిక్షణల ఏర్పాట్లు కూడా ఏమీ జరగలేదు. ఆయన తల్లికడుపులో ఉన్నప్పుడే తండ్రి మరణించారు. ఆయన 6 సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు తల్లి కూడా లోకాన్ని వదలివెళ్ళారు. ఆయన 8 ఏళ్ళ వయసులో ఉన్నప్పుడు తాతగారు కూడా తనువు చాలించారు. కేవలం ఆయన పినతండ్రి అబూతాలిబ్ ఒక్కరు మాత్రమే ఆయన పట్ల ప్రేమ, జాలి సానుభూతి చూపించారు. ఆ విధంగా విద్యాశిక్షణలు, సుఖవిలాసాల వాతావరణంలో ఆయన పెరగలేదు. నలభై సంవత్సరాల వయసు వరకు ఆయన అత్యంత నిజాయితీపరుడిగా, సత్యవాదిగా, సుగుణశీలునిగా జీవితం గడిపారు. అందువల్లనే ఆయన్ను అమీన్ (నిజాయితీపరుడు) అని ప్రజలు పిలిచేవారు. ప్రారంభం నుంచి ప్రవక్తగా నియామకం వరకు, ఆ తర్వాత ఇస్లామ్ ధర్మాన్ని ప్రపంచంలో సంపూర్ణంగా స్థాపించిన తర్వాత పరమపదించేవరకు ఆయన నిరక్షరాసిగానే ఉన్నారు. నలభై సంవత్సరాల వయసులో ఆయనకు దివ్య వాణి లభించింది. అందరికన్నా ముందు ఆయన శ్రీమతి ఖదీజా (రజి), ఆ తర్వాత పినతండ్రి కుమారుడైన నవయువకుడు అలీ (రజి), బానిస జైద్ (రజి), మిత్రుడు అబూబక్ర్ (రజి) ఆయన మాటలు విని ఇస్లామ్ స్వీకరించారు. ఆ తర్వాత ఆయన సన్నిహితులు ఇస్లామ్ స్వీకరించడం మొదలయ్యింది. దానితో పాటు ముస్లిమేతరుల వైరం కూడా ప్రారంభమయ్యింది. వైరుల సంఖ్య నానాటికి పెరిగింది. రాజ్యాధికార

మిస్తానని ప్రలోభపెట్టినా, ఇంకా ఇలాంటి ఎన్ని ప్రలోభాలు చూపినా ఆయన సత్యసందేశ ప్రచారమార్గం నుంచి తప్పుకోలేదు. దాంతో శత్రువులు ఆయనపై, ఆయన అనుయాయులపై అనేక దౌర్జన్యాలకు పాల్పడ్డారు. చివరకు ఆయన అనుచరులు పుట్టిన ప్రాంతాన్ని వదలి హబ్షా దేశం (ఇథియోపియా) తరలిపోవలసి వచ్చింది. అక్కడికి కూడా శత్రువులు[1] ఖురైషులు వారిని అనుసరించారు. కాని అక్కడి పాలకుడు[2] ఇస్లామ్ సత్యతకు ప్రభావితుడయ్యాడు. ముస్లిము శరణార్థులను ఖురైషులకు అప్పగించడానికి నిరాకరించాడు.

మక్కాలో, ముహమ్మద్ (స)పై, ఆయన అనుచరులపై హింసాకాండ తారస్థాయికి చేరుకుంది. ముహమ్మద్ (స) పై హత్యాయత్నం కూడా జరిగింది. దైవిక ప్రేరణతో ఆయన మక్కా నుండి మదీనాకు వలస వెళ్ళవలసి వచ్చింది. ఈ సంఘట నను ఇస్లామ్ పరిభాషలో హిజ్రత్ అని పిలుస్తారు. అంటే ధర్మం కోసం దేశాన్ని త్యజించడం. కానీ అక్కడ కూడా ఖురైషులు వదలలేదు. మదీనాపై సాయుధ దాడికి పాల్పడ్డారు. అప్పుడు ప్రవక్త (స), ఆయన అనుచరులు ఆత్మరక్షణ కోసం యుద్ధం చేసే అనుమతిని దేవుడు ప్రసాదించాడు. అంటే జిహాద్ చేసే అనుమతినిస్తూ దివ్య ఖుర్ఆన్ వాక్యాలు అవతరించాయి. ఏదిఏమైనా, చివరకు చాలా తక్కువ వ్యవధిలో, అంటే హిజ్రత్ తరువాత కేవలం తొమ్మిది సంవత్సరాల కాలంలో యావత్తు అరేబియా ముహమ్మద్(స), ఇస్లాంల ఆధిపత్యంలోకి వచ్చింది. మరోవిధంగా చెప్పాలంటే, నిరక్షరాస్యత, విశృంఖలత్వం, మూఢనమ్మకాలు, జూదం, దోపిడీ, వ్యభిచారం చివరకు తండ్రి మరణిస్తే సవతి తల్లిని వివాహమాడడం వంటి చెడులు, మద్యపానం, యుద్ధాలు, ఆడపిల్లలను హతమార్చడం, మోసం, అణచివేత, కుతంత్రాలు, మహిళలపై అఘాయిత్యాలు, దౌర్జన్యాలు, బానిసల అణచివేత, అనాథల హక్కులను కబళించడం, విగ్రహారాధన వంటి అనేక చెడుల్లో కూరుకుపోయిన అరబ్ జాతి ప్రవక్త జీవిత

---

1. ఖురైష్ – అరబ్బుల్లో ఒక ప్రసిద్ధ తెగ. దైవప్రవక్త ముహమ్మద్ (స) ఈ తెగలోనే జన్మిం చారు. అరబ్బుల్లోని ఇతర తెగల కన్నా ఎక్కువగా ఖురైషులు ఇస్లామును తమ సామాజిక ప్రాబల్యానికి, బహుదైవారాధన ప్రధానమైన ధార్మిక సంప్రదాయాలకు ప్రమాదకర మైనదిగా భావించారు. అందువల్లనే ఈ తెగవారు అందరికన్నా ఎక్కువగా ఇస్లామును వ్యతిరేకించారు. ఇతర తెగలను కూడా తమతో కలుపుకుని ఇస్లాముకు వ్యతిరేకంగా రెచ్చగొట్టారు.

2. హబ్ష్ పాలకుడు – నజ్జాషీ క్రైస్తవుడు.

కాలంలోనే ఇస్లాం బోధనల 20 సంవత్సరాల ప్రచార ఫలితంగా అదే తరం ధర్మపరాయణత్వం, సన్మార్గాలు పాటించే జాతిగా మారిపోయింది. ఇతర ధర్మగ్రంథాలలో అయితే ఇటువంటి పాపాత్ములైన వారిని రాక్షసులుగా ముద్రవేసి ఎవరో ఒక దేవుడు లేదా అవతారం ద్వారా వధించబడినట్లు చెప్పడం జరిగేది.

కానీ ఇది చారిత్రక అద్భుతం. ప్రవక్త ముహమ్మద్(స) పాపులను నాశనం చేయలేదు, పాపాన్ని నాశనం చేశారు. ఆ విధంగా "తప్పు చేసిన వ్యక్తిని ద్వేషించవద్దు, కానీ అతని తప్పును ద్వేషించండి" అనే సామెతను ఇస్లాం ద్వారా ప్రవక్త ఆచరణాత్మకంగా చేసి చూపించారు. క్లుప్తంగా, దీర్ఘకాలికంగా అనేక అపరాధాలకు, సామాజిక రుగ్మతలకు గురైన అరబ్బు జాతి స్వల్ప కాలంలోనే కోలుకుంది. ముహమ్మద్(స) సామూహిక నేర ధోరణి అనబడే వ్యాధికి విజయవంతంగా చికిత్స చేశారు. ఇది ఒక చారిత్రక అద్భుతం.

అరబ్బు జాతిలోని సామాజిక రుగ్మతలను అదే జాతిలో జన్మించిన వైద్యుడు అంతం చేసాడు. ఆయన అదే జాతిలో పుట్టినా ఆయన మనోవాక్కాయ కర్మల రీత్యా ఆ జాతికి విభిన్నమైనవారు. ఇలాంటి సామాజిక రుగ్మతలకు గురైన ఏ జాతికైనా వ్యాధి నివారక దివ్యౌషధం ఇస్లాం అని, త్వరితంగా నివారించగల శక్తి ఉన్న పరీక్షించబడిన ఔషధమని దీనివల్ల స్పష్టమవుతోంది. అరబ్బులకు ఇస్లాం కాయకల్ప చికిత్స చేసింది. చారిత్రకంగా అరబ్బు జాతికి ఇది పునర్జన్మ వంటిది. నిజానికి, పునర్జన్మ అనేది కేవలం ఒక భ్రమ మాత్రమే. చరిత్రలో అత్యంత అసాధారణమైన సంఘటన, మక్కా విజయం ... ముహమ్మద్ (స) నాయకత్వంలో మక్కాను జయించినప్పుడు ప్రాణనష్టం జరగనేలేదు. ప్రవక్త, ఆయన సహచరులు శత్రువుల దౌర్జన్యాలు, దుర్మార్గాలకు ప్రతీకారం తీర్చుకోకుండా క్షమించి వదిలేయడం చరిత్రలో ఒక అసాధారణ సంఘటనగా నమోదైంది. యుద్ధంలో ఓడిపోయిన వారిని ఇలా సామూహికంగా విజేత క్షమించిన సంఘటన చరిత్రలో మరొకటి లేదు. దీనికి విరుద్ధంగా, ఇతర మతాల పురాణగాధల్లో అవతార పురుషులు, దేవతలు శత్రుసంహారం చేసిన వీరోచిత వర్ణనలు కనిపిస్తాయి. ఇస్లాం స్వచ్ఛమైన వెలుగులో అరబ్బులు తాము చీకట్ల నుంచి బయటకు రావడమే కాదు, ఒక్క శతాబ్దంలోనే ఇస్లాం కాంతులు ప్రపంచంలోని విస్తారమైన భూభాగాల్లో ప్రసరించేలా చేశారు.

ప్రవక్త ముహమ్మద్ (స) నిరాడంబర జీవితం సంపన్న మహిళను వివాహమాడిన తర్వాత కూడా ఎలాంటి మార్పు రాలేదు. ప్రవక్త పదవి తర్వాత యావత్తు

అరేబియాలో ఎదురులేని పాలకుడిగా మారిన తర్వాత కూడా ఆయన నిరాడంబర జీవనం మారలేదు. ఆయన జీవితాంతం అత్యంత సాదాసీదాగా జీవించారు. ఆయన జాతి మత వివక్షకు అతీతంగా అన్ని మతాలు, జాతుల వారికి మేలు చేసేవారు. ఎంత దానశీలురంటే ఇతరుల అవసరాలను తీర్చడానికి అప్పు చేసి మరీ దానం చేసే వారు. ఆయన నైతికతలో లేశమంత లోపం లేదు. సత్యం, నిజాయితీ, పవిత్రత, దయ, సౌజన్యం, శాంతి మూర్తీభవించిన ప్రవక్త ఆయన. ఉదార స్వభావం, దయార్ద్ర హృదయాలకు మారుపేరు ఆయన. పరుల కోసమే ఆయన జీవించారు. అన్నింటికీ మించి, ఆయన సద్గుణాలు అనంతమైనవి. శ్రమకు ఆయన పట్టంకట్టారు. సమానత్వం, సోదరభావం, సహకారాల భావనలు పెంపొందించడానికి ఆయన ఎల్లప్పుడు ప్రయత్నించారు. యుద్ధకాలంలో అయినా, శాంతి సమయంలో అయినా ప్రజలు తనను ప్రముఖుడిగా భావించేలా చేసే పని ఏదీ చేయలేదు. యుద్ధంలోను, శాంతిలోను ఎల్లప్పుడు ఆశ్చర్యకరంగా ఒకేవిధంగా వినమ్రత, దయ, ఉదారత, క్షమాశీలం ప్రదర్శించేవారు. రోజువారీ గృహ జీవితాన్ని గడుపుతున్నప్పుడు కూడా ఎల్లప్పుడూ దైవచింతనలోనే ఉండేవారు. ప్రతి ఒక్కరి కోసం, తన ప్రత్యర్థుల కోసం శత్రువుల కోసం కూడా దేవుని కారుణ్యాన్ని వేడుకునేవారు.

రాత్రులు లేచి నమాజులు చేసేవారు. ఒకసారి ఆయన భార్య ఆయిషా (రజి)కు అనుమానం కూడా వచ్చింది. ఆయన తన మరో భార్య వద్దకు వెళ్ళారని అనుకున్నారు. కాని ఆమె లేచి చూస్తే ఆయన పవిత్ర శిరస్సు సజ్దాలో ఉండటాన్ని చూసి చాలా పశ్చాత్తాపపడ్డారు. ఆయన తన జీవితాన్ని దేవునికే సమర్పించారు. దేవునిపై ఆయన విశ్వాసం అచంచలమైనది. చిన్న చిన్న విషయాల్లోను దేవునిపైనే ఆధారపడేవారు. ఆ విధంగా ఆయన గడిపిన పవిత్ర గృహస్థ జీవితం నిజానికి యోగ, వైరాగ్య జీవితం. ఆయన జీవితం నీటిలో తామరాకు లాంటిది. అదే నిజమైన తపస్సు. ఆయన సాధించిన అపూర్వమైన విజయాలు, ఇస్లామ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం ఆయన ప్రవక్త అని చెప్పే తిరుగులేని సాక్ష్యాలు. ఆయన అక్షరాస్యుడు కాదు, కాని ఆయనకు దేవుడు స్వయంగా ఖుర్ఆన్ రూపంలో అనంత జ్ఞానాన్ని ప్రసాదించాడన్నది కూడా కాదనలేని సత్యం.

ముహమ్మద్(స) గొప్పదనం, ఇస్లాం ఔన్నత్యం, విప్లవాత్మక ప్రభావాలు చారిత్రక ఆధారాల ద్వారా ధ్రువీకరించబడ్డాయి. పిడివాది, మత దురభిమాని అయిన ఉమర్ (తరువాత హజ్రత్ ఉమర్ (రజి) అని పిలువబడ్డారు. ముహమ్మద్(స) అనుచరుల్లో

ప్రముఖులు, ఖలీఫాల్లో రెండవ ప్రముఖ ఖలీఫా) ముహమ్మద్ (స)ను చంపడానికి తన ఇంటి నుండి కత్తి దూసి బయలుదేరారు. కొన్ని దివ్యఖుర్ఆన్ వాక్యాలు విన్న వెంటనే ఆయన మనసు మారిపోయింది. తక్షణం ముహమ్మద్(స) సమక్షంలో హాజరై ఇస్లాంను స్వీకరించారు. ముహమ్మద్ (స) మాటలను వినకుండా ఉండడానికి తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ తన చెవుల్లో దూది పెట్టుకునేవారు. ఆయన విషయంలోను ఇదే జరిగింది. ముహమ్మద్(స) నోట కొన్ని ఖుర్ఆన్ వాక్యాలు విని వెంటనే ముస్లింగా మారిపోయారు.

అనాథగా, సాధన సంపత్తి లేనివారిగా ఆయన (స) పెరిగారు. జీవితాంతం విద్యాశిక్షణలేవీ ఆయనకు లభించలేదు. కాని దివ్య జ్ఞానంతో సంపన్నులయ్యారు. దౌర్జన్యాలను సహిస్తూ దుర్మార్గుల కోసం కూడా దేవుని వేడుకుంటూ, అనివార్య పరిస్థితుల్లో దైవాదేశాల ప్రకారం ఆత్మరక్షణకు యుద్ధాలు చేస్తూ, సంపూర్ణ విజయం సాధించిన తర్వాత తనపై, తన అనుచరులపై ఘోరమైన దౌర్జన్యాలకు పాల్పడిన వారందరిని సామూహికంగా క్షమాభిక్ష ప్రసాదించడం, తన జీవిత కాలంలోనే రాక్షసులన దగ్గ అరబ్బులను ధర్మపరాయణులుగా మార్చడం, నేడు అత్యంత లోకప్రియమైన, విశ్వసనీయమైన ధర్మంగా నిలబడడం ప్రవక్త ముహమ్మద్ (స), ఇస్లాముల శక్తిసామర్థ్యాలకు నిదర్శనం. దౌర్జన్యాలను భరిస్తూ, దైవిక శక్తి ద్వారా పురోగమించారు. కఠినమైన సంఘర్షణల్లోను విజయం సాధించారు. సత్యధర్మంగా ఇస్లాం స్థాపనే ఆయన లక్ష్యం. మనుగడ కోసం పోరాటం (Struggle of Existence), సహజ ఎంపిక లేదా సమర్థులదే మనుగడ (Survival of the Fittest) వైజ్ఞానిక సిద్ధాంతాలే కనుక నిజమైతే వ్యక్తిగా ప్రవక్త ముహమ్మద్ (స), ధర్మంగా ఇస్లాం ఈ సిద్ధాంతం ప్రకారం కూడా రుజువవుతున్నాయి. ప్రవక్త గొప్పదనమేమిటంటే, యుద్ధాల్లో కూడా నైతికతను ఏమాత్రం వదులుకోలేదు. రాముడు వాలిని చంపినప్పుడు ఒక చెట్టు చాటు నుండి బాణం సంధించి విడిచాడు. రావణుడి నాభిలోని అమృతం రహస్యాన్ని తెలుసుకోవడానికి రావణుడి సోదరుడు విభీషణుడికి రాముడు సహాయం చేయడంలో రాజకీయం ఉంది. అదేవిధంగా, ద్రోణాచార్యుడిని వధించడానికి అశ్వత్థామ అనే ఏనుగును చంపి, ధర్మరాజుతో కుంజర అంటే "ఏనుగు" పదాన్ని మెల్లగా పలకమని చెప్పాడు కృష్ణుడు. ద్రోణాచార్యుడు తన కుమారుడు అశ్వత్థామ మరణించాడని భావించి ఆయుధం త్యజించాడు. నిరాయుధుడైన ద్రోణాచార్యుని చంపారు. అలాగే జయద్రథుని వధించడానికి సాయంత్రం కానప్పటికీ సాయంత్రం అనే భ్రమను

సృష్టించడం కూడా కృష్ణుని రాజకీయమే. కానీ దీనికి విరుద్ధంగా, ముహమ్మద్ (స) బద్ర్ యుద్ధంలో అతి తక్కువ మంది సైనికులున్నప్పటికీ[1] ఇద్దరు సైనికులను సైన్యం నుంచి తప్పించారు. వారిద్దరూ పోరాడ్డానికి సిద్ధంగా ఉన్నామని ఎంత వేడుకున్నా వారిని యుద్ధంలో అనుమతించలేదు. కారణమేమిటంటే, ఈ ఇద్దరు గతంలో శత్రువుల చేతికి చిక్కినప్పుడు, వారితో ముహమ్మద్ (స) సైన్యం పక్షాన యుద్ధం చేయబోమని మాట ఇచ్చి విడుదలై వచ్చారు. ఈ విషయం తెలిసిన ప్రవక్త వారు ఇచ్చిన మాట ప్రకారం యుద్ధం చేయరాదని నివారించారు. ఇది ప్రవక్త ముహమ్మద్ (స) చూపించిన నైతికత. ఆయన మంచి పని చేయడానికి మంచి సాధనాలు ఉండాలని నమ్మే వ్యక్తి. మక్కా విజయం తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) తన కుమార్తెను తీవ్రంగా వేధించిన దుర్మార్గుడిని, తన కుమార్తెను ఒంటెపై నుంచి నెట్టేసి, ఆమెను క్రింద పడేసిన దుష్టుడిని కూడా క్షమించారు. ఇలాంటి క్షమాగుణం చరిత్రలో కనిపించదు. నిస్సందేహంగా ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్తల్లో శ్రేష్ఠులు. ఇస్లామ్ పేరులోనే ఔన్నత్యముంది. ఈ పేరు అర్థవంతమైనది. ఇస్లామ్ అంటే శాబ్దిక అర్థం దైవాజ్ఞను స్వచ్ఛందంగా సంపూర్ణంగా శిరసావహించడం. అంటే పరిపూర్ణంగా దేవునికి విధేయుడైన భక్తుడిగా మారిపోవడం. ఇస్లాం ఆది నుంచి ఏకేశ్వరవాదాన్ని బలంగా నిలబెడుతుంది. ఇస్లామ్ అంటే ముహమ్మదీయ మతం కాదు.[2] ఇది దైవదత్తమైన ఆది ధర్మం. ప్రవక్త ముహమ్మద్ (స) చిట్టచివరి దైవప్రవక్త. ఈ ధర్మానికి ఇస్లామ్ అన్న పేరులోనే ఈ వాస్తవాలు తెలుస్తున్నాయి. దీనికి విరుద్ధంగా హిందూ ధర్మం పేరుకు ఖచ్చితమైన అర్థమేదీ లేదు. బౌద్ధము, క్రైస్తవము స్థాపకుల పేర్లను

---

1. ముస్లిమ్ సైనికుల సంఖ్య సుమారు 313. శత్రు సైనికుల సంఖ్య సుమారు 1000 మంది. ముస్లిం సైన్యంలో యుద్ధసామగ్రి, ఆయుధాలు లేవు. శత్రు సైన్యంలో యుద్ధ సామగ్రి, ఆయుధాలు పుష్కలంగా ఉన్నాయి.

2. మత దురభిమానంతో క్రైస్తవ ప్రపంచం ఇస్లామ్ విశ్వజనీన లక్షణాలను పరిమితం చేయడానికి, అనాది సత్యధర్మాన్ని ఆ కాలంనాటి వ్యక్తికి, అంటే ప్రవక్త ముహమ్మద్ (స)కి పరిమితం చేయడానికి “ముహమ్మదనిజం” (ముహమ్మదీయ మతం) అనే పారిభాషిక పదాన్ని ప్రచారంలో పెట్టింది. అంటే ఇస్లాం ఒక ధర్మం కాదు, ఒక వ్యక్తి ఆవిష్కరించిన ఆలోచనాధార (Ism)గా చూపించే ప్రయత్నం చేశారు. ప్రవక్త యేసు ప్రచారం చేసిన ధర్మాన్ని క్రైస్తవ ధర్మం అని పేరుపెట్టి ఒక మానవావిష్కృత మతంగా ప్రచారంలో పెట్టినట్లే ఇస్లాం పట్ల కూడా వ్యవహరించారు (ప్రకాశకులు)

సూచిస్తున్నాయి. అవి విశ్వజనీనతను సూచించేవి కావు. ఇవి ఏ ధర్మాన్నీ సమర్థించేవి కావు, ఖండించేవీ కావు. దీనికి విరుద్ధంగా ఇస్లామ్ ప్రపంచంలోని వివిధ భూభాగాల్లో ప్రవక్త ముహమ్మద్ (స) కన్నా ముందు పంపబడిన సమస్త దైవప్రవక్తల పట్ల విశ్వాసాన్ని ప్రకటిస్తుంది. ఇస్లామ్ ప్రకారం మతధర్మాలన్నీ మూలతః ఒక్కటే.[1]

కాలక్రమేణా అసలు ధర్మంలో మార్పులు చేర్పులు జరిగినప్పుడు, అసలు దైవాదేశాలకు ప్రజలు దూరమైనప్పుడు చిట్టచివరిగా దేవుడు ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా దివ్యఖుర్ఆన్‌ను అవతరింపజేశాడు. **లా యిలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్** – ఇది ఇస్లాం ధర్మంలో విశ్వాసవచనం (కలిమా). దీన్ని ఈ పుస్తకం భూమికలో రేఖాగణిత సిద్ధాంతం (Geometrical Theorem) గా నిరూపించడం జరిగింది. ఇస్లాంలో ఐదు మూలస్తంభాలున్నాయి. 1. తౌహీద్– అంటే ఏకదైవారాధన 2. నమాజ్– అంటే దైహికారాధన 3. జకాత్ – అంటే తప్పనిసరిగా చేయవలసిన దానం 4. రోజా–అంటే రమజాన్ మాసంలో ఉపవాసాలు పాటించడం 5. హజ్ – అంటే కాబా గృహానికి ధార్మిక యాత్ర చేయడం.

బౌద్ధం నిరీశ్వరవాదం కాబట్టి ఏకదైవారాధన అనే ప్రశ్నే అందులో లేదు. ఇతర ధర్మాల్లో స్పష్టమైన ఆదేశంగా ఇది కనిపించదు. పరోక్షరూపంలో, నైతికాదర్శాల రూపంలో ఉందని వెదికి తీస్తే కనిపించవచ్చు. ఇదే పరిస్థితి కొద్దోగొప్పో క్రైస్తవంలోను కనిపిస్తుంది. దేవుని కుమారుడిగా యేసుక్రీస్తును విశ్వసించడం వల్ల ఏకేశ్వరవాదం క్రైస్తవంలో మిగల్లేదు. అయితే ఇస్లామ్‌లోని ఈ ఐదు మూలస్తంభాలు ప్రాచీన హిందూ ధర్మంలో కూడా కనిపిస్తాయి. అయితే ఈ నియమాలు ఒకే చోట కనిపించకపోవచ్చు. జటిలంగా ఉండవచ్చు. లేదా అస్పష్టంగా ఉండవచ్చు. ఇస్లామ్‌లో ఈ నియమాలను సంక్షిప్తీకరించడం, సూత్రీకరించడం, సరళీకరించడం, ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపులతో వ్యవస్థాగతం చేయడం జరిగింది. హిందూధర్మంలో ఈ ఐదు నియమాలు వైయక్తికమైనవి కాని ఇస్లాములో ఇవి సామాజికమైనవి, సాముదాయికమైనవి. ఈ విధంగా ఇస్లాంలో ఈ ఐదు నియమాలు సంస్కరణాత్మక రూపంలో ఇస్లాం ధర్మాన్ని

1. అసలు ధర్మం ప్రతి కాలంలోను ప్రతి ప్రవక్త ద్వారా ప్రచారం చేయబడిన, బోధించబడిన ఇస్లామ్ అంటే దైవవిధేయతా ధర్మమే. ఆ కాలంలో ఆ జాతి భాషలో దానికి ఒక పేరు ఏదైనా ఉండవచ్చు. కాని ఆ ధర్మానికి పునాదులు ఎల్లప్పుడు ఏకేశ్వరవాదం, దైవదౌత్యం, పరలోకం అనే విశ్వాసాలే. దైవానికి సంపూర్ణ విధేయత అనే భావమే అసలు ధర్మసారం. (ప్రకాశకులు)

సరళ, సర్వగ్రాహ్య, సార్వత్రిక, సామాజిక దృక్కోణాలను ఇవ్వడం వల్ల ఇస్లామ్ ధర్మం సర్వోత్తమ ధర్మంగా రూపొందింది. ప్రాచీన వైదిక సాహిత్యం మానవ నాగరికత ప్రారంభంలోనే ఏకేశ్వరవాదాన్ని **'ఏకమేవ్ ద్వితీయో నాస్తి'** అని ప్రకటించింది. అంటే అర్థం దేవుడు ఒక్కడే రెండవవాడు లేడు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో **'జోతిషామ్ పితజ్యోతి'** అన్నాడు. అంటే వెలుగును వెలుగుగా చెప్పడం జరిగింది. దేవుని విశిష్ఠత ఇదే. దివ్యఖుర్ఆన్ దీన్ని **'నూరున్ అలా నూర్'** (24:35) అని పేర్కొంది. ఉపనిషత్తుల్లో పలుమార్లు **"తమసోమా జ్యోతిర్గమయ"** అని చెప్పబడింది. అంటే "మమ్ము అంధకారం నుంచి వెలుగులోకి తీసుకురమ్మని" కోరడం. ఇదే ప్రవక్త ముహమ్మద్ (స) చేసిన ప్రత్యేక ప్రార్థన.[1] భగవద్గీతలో దేవుణ్ణి **'విశ్వతోముఖమ్'** అనడం జరిగింది. అంటే దేవునికి నలువైపులా ముఖం ఉంది అని అర్థం. దివ్యఖుర్ఆన్ కూడా "ఎటు తిరిగినా అటు దేవుడున్నాడు" (2:115) అంటుంది. భగవద్గీత దేవుడిని **'సర్వలోక మహేశ్వరమ్'** అంటుంది. అంటే సమస్తలోకాలకు దేవుడు ప్రభువు. దివ్యఖుర్ఆన్‌లో కూడా ఇలాంటి ప్రకటనే ఉంది. **'రబ్బుల్ ఆలమీన్'** (1:1). భగవద్గీతలో దేవుడిని సత్యంగా పేర్కొనడం జరిగింది. దివ్యఖుర్ఆన్ కూడా దేవుడిని **'హక్'** అంటే సత్యంగా చెప్పింది (22:62). భగవద్గీతలోను దివ్యఖుర్ఆన్ లోను దేవునికి సాటి మరెవ్వరూ లేరని చెప్పడం జరిగింది (42:11). గీతలోను, ఉపనిషత్తుల్లోను ఈ యావత్తు బ్రహ్మాండాన్ని దేవుడు పరివేష్ఠించి ఉన్నాడని చెప్పడం జరిగింది. ఇదేవిధంగా దివ్యఖుర్ఆన్‌లో "అల్లాహ్ అందరినీ పరివేష్ఠించి ఉన్నాడు" (4:126) అని చెప్పడం జరిగింది. భగవద్గీత దేవుడిని "అక్షర్" అంటే నాశం లేనివాడిగా చెప్పింది. మిగిలినవారందరు, అన్నీ సమసిపోయేవే. అంటే అవి క్షరములు. ఇదే విషయాన్ని దివ్యఖుర్ఆన్ కూడా చెప్పింది. 'అన్నీ నశించేవే, మిగిలి ఉండేది అల్లాహ్ మాత్రమే' (55:26). భగవద్గీతలో దేవుడిని **'అచింత్య', 'అనిర్వచనీయ్'** అని చెప్పడం జరిగింది. అంటే మనిషి బుద్ధికి అందని వాడు, వర్ణన చేయడం సాధ్యం కానివాడు. దివ్య ఖుర్ఆన్‌లో కూడా దేవుడి గురించి ఆయన వంటి

---

1. "అల్లాహ్, నా హృదయంలో వెలుగును పుట్టించు. నా చెవుల్లో, నా కన్నుల్లో వెలుగును నింపు. నా కుడి ఎడమలు ప్రకాశమానం చేయి. నా ముందు, నా వెనుక కూడా వెలుగునివ్వు. నా పైన, నా క్రింద కూడా వెలుగునివ్వు. ప్రళయదినాన నా వెలుగును పెంచు". (హదీస్)

**(ఓ ప్రభూ!) మాకు రుజుమార్గం చూపించు" (దివ్యఖుర్ఆన్ 1:5)**

వారెవ్వరూ లేరని చెప్పడం జరిగింది. 'మనిషి చూపులు ఆయన్ను అందుకోలేవు, అర్థం చేసుకోలేవు' (6:103)

చరిత్ర ప్రకారం, వేద సాహిత్యానికి, భగవద్గీతకు అప్పటి అరబ్బుల మతం, మతభావాలు, సంప్రదాయాలతో ఎలాంటి సంబంధము ఎప్పుడూ లేదు. కాని భగవద్గీత, ఖుర్ఆన్ ఈ రెంటి మధ్య ఆశ్చర్యపరిచే సమానతలున్నాయి. గీత, ఖురాన్ రెండూ ఏకేశ్వరవాదం విషయంలో ఒకేలా ఉండడం మాత్రమే కాదు, భగవద్గీతలోని ధర్మయుద్ధం, దివ్య ఖుర్ఆన్‌లోని జిహాద్ భావనల మధ్య సారూప్యత కనిపిస్తుంది. ఈ ఆధారాలు ప్రవక్త ముహమ్మద్ (స) దైవప్రవక్త అని నిరూపించే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

ఇస్లాంలోని రెండవ మూలస్తంభం నమాజ్ విషయానికి వస్తే, ఆరాధన, ప్రార్థనల ప్రాముఖ్యత హిందూ ధార్మిక సాహిత్యంలో విస్తారంగా వివరించబడింది. అయితే ఆరాధనలు, ప్రార్థనలకు ఇస్లాం సామాజిక నిబద్ధత, క్రమబద్ధతలు నిర్దేశించడం ద్వారా నమాజును అత్యంత ప్రభావవంతమైనదిగా మార్చింది. హిందూ మతంలో దానధర్మాలకు గొప్ప ప్రాముఖ్యం ఉంది. కాని బ్రాహ్మణులు మాత్రమే దానికి హక్కుదారులుగా భావించటం జరిగింది. కానీ ఇస్లాం జకాత్‌ను తప్పనిసరి దానంగా చేసింది. అలాగే పేదవారందరికీ జకాత్ పొందే హక్కును ప్రకటించి వాస్తవిక సమాజవాదానికి పునాదులు వేసింది. ఇస్లాంలోని ఈ తప్పనిసరి దానం విశిష్టమైనది.

ఇక ఉపవాసాల విషయానికి వస్తే, హిందూ మతంలో వ్రతాలున్నాయి. చంద్రాయణ వ్రతం చంద్రమాన క్యాలెండర్‌లో నెలరోజుల పాటు చేసే వ్రతం. ఇది ఇస్లాంలోని రోజాలు లేదా ఉపవాసాల వంటిదే. ఈ వ్రతాన్ని ఇప్పుడు హిందువులు పెద్దగా పాటించడం లేదు. అయితే నిర్జల ఏకాదశి ఇంకా అనేక ఇతర వ్రతాలున్నాయి. హిందువుల ఈ వ్రతాలు వివిధ సందర్భాల్లో ప్రత్యామ్నాయాలుగా పాటిస్తారు. ఇవి మహిళలకు మాత్రమే పరిమితం చేయబడ్డాయి. దీనికి విరుద్ధంగా, ఇస్లాంలోని ఉపవాసం అనేది పురుషులు, మహిళలు అందరికీ తప్పనిసరి. రోజా లేదా ఈ ఉపవాసాల్లోని ఏకరూపత, ఖచ్చితత్వం, విశ్వవ్యాప్తి తదితర నియమాలు అత్యంత గౌరవప్రదమైనవి. ఇస్లాంలో ఉపవాసం సామాజిక కోణాన్ని కలిగి ఉంది. కాగా, హిందూ మతంలో ఉపవాసం వ్యక్తిగతం. ముస్లిముల ఉపవాస ముగింపులో సామూహిక ప్రార్థనలు, పరస్పర అభివాదాలు సమానత్వం సోదరభావాలకు నిలువెత్తు నిదర్శనాలు.

హిందువుల్లోని తీర్థయాత్రలను పోలిందే హజ్ యాత్ర. తీర్థయాత్రలు మతవిశ్వాసాలకు లేదా పౌరాణిక గాథలకు సంబంధించినవి. ఇస్లాంలో హజ్ యాత్రలో గాంభీర్యం, ధార్మికవిశ్వాసం మాత్రమే కాదు చారిత్రకత కూడా ముడిపడి ఉంది. సంక్షిప్తంగా, ఇస్లాంలోని ఈ ఐదు మూలస్తంభాలు హిందూ మతంలోను మౌలికంగా కనిపిస్తాయి. హిందూ మతం ప్రాచీనమైనది. కాబట్టి, ఈ పోలికలు ప్రవక్త ముహమ్మద్ (స)దైవప్రవక్త అనడానికి సాక్ష్యాలు.

ఇస్లాం ఈ నియమాలను మరింత అర్థవంతమైనవిగా, ప్రభావవంతమైనవిగా రూపొందించింది. సమాజానికి అద్భుత ఫలితాలిచ్చేవిగా మార్చింది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇస్లాంలో, తౌహీద్ అంటే ఏకదైవారాధన మినహా ఇతర నాలుగు నియమాల్లోను అసాధారణ పరిస్థితుల్లో అవసరమైన మినహాయింపులు ఇవ్వబడ్డాయి. తౌహీద్ లేదా ఏకదైవారాధన అనేది హృదయానికి, మనస్సుకు, ఆత్మకు సంబంధించినది. ఇది సర్వశక్తిమంతుడైన ఒకే దేవునిపై విశ్వాసం కలిగి ఉండడం. కాబట్టి అందులో మినహాయింపు అనే ప్రశ్న లేదు. ఇందులో మినహాయింపు అంటే బహుదైవారాధనకు తలుపులు తెరవడమే. ఇతర మతాలలో, ఏకదేవతారాధన విషయంలో మినహాయింపులు, సవరణల వల్లనే అవి కలుషితమయ్యాయి. బహు దైవారాధన ఏ రూపంలో ఉన్నా అది బహుదైవారాధనగానే ఇస్లాం భావిస్తుంది. ఇస్లాం ఏకేశ్వరవాదాన్ని స్వచ్ఛమైన, శుద్ధమైన రూపంలో కాపాడింది. ఇది ఇస్లాం ప్రత్యేకత. అందువల్ల, ఇస్లాంలోని జకాత్, రోజా మరియు హజ్‌లు శారీరక బలహీనత లేదా అనారోగ్యం మరియు ఆర్థిక ఇబ్బందుల వంటి ప్రత్యేక పరిస్థితులలో మినహాయించ బడ్డాయి. ఉదాహరణకు, జకాత్‌నే తీసుకుందాం. అంటే విధిగా చేయవలసిన దానం. జకాత్ ఇచ్చే స్థోమత లేని వ్యక్తి వివాదాలు, తగాదాలకు దూరంగా ఉండడమే అతని జకాత్ అవుతుంది. సరళమైన, ఆచరణయోగ్యమైన ఇస్లామీయ నియమనిబంధనలు సాధారణ ప్రజలకు, ప్రముఖులకు అందరికీ ఆచరణయోగ్యమైనవి. ఇస్లాంలోని ఐదు మూలస్తంభాల్లో ఒక్క తౌహీద్ మినహా మిగిలిన నాలుగు – శారీరక, ఆర్థిక భారం ఉన్న జకాత్, ఉపవాసం (రోజా) హజ్ యాత్రల్లో మినహాయింపులు ఇవ్వడం ద్వారా ఇస్లాం పేదలకు, వ్యాధిగ్రస్తులకు, వికలాంగులకు కూడా సమానస్థాయిలో ఆచరణల యోగ్యత ప్రసాదించే వరంగా మారింది. ఇతర మతాల్లో పేదలు, వ్యాధిగ్రస్తులు, వికలాంగుల విషయంలో ఇలాంటి అవకాశాలు లేకపోవడంతో వారు నిరాదరణ, నిర్లక్ష్యాలకు గురయ్యారు. వ్యయప్రయాసలతో కూడుకున్న మతాచారాలు లేకుండా చేసిన ఇస్లాంలోని ఆచరణాత్మక నియమనిబంధనలు, ఇతర నైతిక, సామాజిక అంశాల సమన్వయం ద్వారా స్త్రీ పురుషులు, బడుగు బలహీనవర్గాలు, అనాథలు, బానిసలు,

వికలాంగులు, వ్యాధిగ్రస్తులు, కుటుంబాలు, సముదాయాలు, దేశాలతో సహా అందరికీ శాశ్వత, సార్వత్రిక ప్రాతిపదికన అందరి మతంగా మారింది. క్లుప్తంగా చెప్పాలంటే, వ్యక్తిగతంగా మనిషి, సామూహికంగా మానవ సమాజాలు ఎదుర్కొనే అన్ని సమస్యలకు పరిష్కారాలలో సమానత్వంతో ఇస్లాం అత్యంత శుభప్రదమైన ధర్మంగా నిలబడుతుంది.

## సంక్షిప్తంగా, ఇస్లాం ప్రత్యేకతలు ఏమిటంటే -

1. ఇస్లాంలో అతి ముఖ్యమైన ప్రత్యేకత అందులోని స్వచ్ఛమైన, విశుద్ధమైన ఏకేశ్వరవాదం. హిందూ మతంలో దైవప్రసాదితమైన వేదాలలోని ఏకేశ్వర వాదం కాలక్రమేణా బహు దేవతారాధనగా మారడమే కాదు, బహు దేవతారాధన నుంచి అవతారవాదంలోకి క్రమేణా దైవాన్ని ప్రాథమిక స్థాయి నుంచి ద్వితీయస్థాయికి తీసుకురావడం వరకు చేరుకుంది. అదేవిధంగా, క్రయిస్తవంలోని త్రిత్వ భావన, అంటే దేవుడు, దైవకుమారుడు, పరిశుద్ధాత్మల భావన కూడా హిందూ అవతారవాదం మాదిరిగా క్రైస్తవ మతంలోను దైవాన్ని ద్వితీయస్థాయికి చేర్చింది. దీనికి విరుద్ధంగా, ఇస్లాంలోని ఏకేశ్వరవాదంలో ఎటువంటి మార్పు రాలేదు. ఎలాంటి పతనమూ కనబడదు. దీని పునాది ఎంత బలంగా ఉందంటే దాన్ని కదపడం అసాధ్యం. దీనికి కారణం ఇస్లాం లోని ప్రాథమిక విశ్వాస వచనం –"అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేడు, ముహమ్మద్ అల్లాహ్ దాసుడు, దైవసందేశహరుడు అని నేను అంగీక రిస్తున్నాను" అని ప్రకటించే విశ్వాస వచనంలోని బలం ఇది. ప్రవక్త ముహమ్మద్ (స)ను దివ్యఖుర్‌ఆన్ లో దేవుడు "అబ్ద్" అని పేర్కొన్నాడు. అంటే అర్థం విధేయత చూపించే దాసుడు అన్నమాట. అంటే దైవదాసుడు దేవుని అవతారం కాలేడు. ఆ స్థానాన్ని ఆక్రమించుకోలేడు.
2. ఇస్లాం మద్యాన్ని అన్ని పాపాలకు మూలంగా చెప్పింది. అందువల్ల, ఇస్లాంలో మద్యపానం కేవలం నైతికాపరాధం మాత్రమే కాదు, కఠిన శిక్షార్హమైన నేరం కూడా. అంటే, కొరడా దెబ్బల శిక్ష విధించడం జరుగుతుంది. కల్లు, గంజాయి, భంగు వంటి మత్తు పదార్థాలను ఇస్లాం నిషేధించింది. కానీ హిందూ మతంలో మద్యపానాన్ని నివారించడమూ కనిపిస్తుంది, అనుమతించడమూ ఉంది. విష్ణు భక్తులకు మద్యపానం నిషిద్ధం. కాళి ఉపాసకులు, ధార్మికుల వద్ద శివుడు భంగ్ వంటివి సేవించే దేవుడు. శైవులు కూడా భంగ్, గంజాయి వంటి పదార్థాలు తీసుకుంటారు.

3. జకాత్ అంటే తప్పనిసరి దానం. ఇది ఇస్లామ్‌లో ప్రత్యేకమైనది. ఇస్లాంలోని ఐదు మూలస్తంభాలు– నమాజ్ (ప్రార్థన), రోజా (ఉపవాసం), హజ్ (కాబా యాత్ర) లలో జకాత్ కూడా ఒకటి. దీన్ని పొందే అర్హత కలిగినవారిలో నిరుపేదలున్నారు, అలాగే అప్పుల పాలయి, అప్పులు చెల్లించలేని స్థితిలో ఉన్నవారు కూడా ఉన్నారు. తమ స్వంత ఉపాధి కార్యకలాపాలు ప్రారంభించే స్థోమత లేనివాళ్ళు కూడా ఉన్నారు. సంపన్నుల సంపదలో పేదలకు నిర్దిష్ట శాతం హక్కు ఉందని ఇస్లాం స్పష్టమైన నిర్దేశాలు ఇచ్చింది. అంటే అర్థం జకాత్ పొందే అర్హత ఉన్నవారు, సంపన్నుల వద్ద యాచించడానికి వెళ్ళవలసిన అవసరం లేదు. సంపన్నుల నుంచి జకాత్ వసూలు చేసి యోగ్యులకు పంపిణీ చేయవలసిన బాధ్యత ఇస్లామిక్ ప్రభుత్వంపై ఉంటుంది. పేదల గురించి ఇంత శ్రద్ధ, వారి గౌరవాదరాలకు భద్రత మరే మతంలోను కనిపించదు.

4. ఇస్లాంలో జూదం సర్వత్రా, సర్వవిధాల నిషిద్ధం. కానీ హిందూ మతంలో దీపావళి రోజున జూదం ఆడడం సంప్రదాయం. క్రైస్తవంలో కూడా జూదం పై ఎలాంటి నిషేధం లేదు.

5. ధనవంతులను మరింత ధనవంతులుగా, పేదలను మరింత పేదలుగా మార్చేస్తుంది వడ్డీ. సమాజాన్ని ఈ రుగ్మత నుండి రక్షించడానికి ఏ మతమూ వడ్డీపై ఎలాంటి నిషేధం విధించలేదు. ఇస్లాం మాత్రమే వడ్డీని అత్యంత కఠినంగా నిషేధించింది. వడ్డీని నిషేధించిన ఖుర్ఆన్ తక్షణం వడ్డీని వదిలేయాలని ఆదేశించింది. వడ్డీని వదలకపోవడమంటే దైవంపై, దైవప్రవక్తపై యుద్ధప్రకటనగా ఖరారు చేసింది. (దివ్య ఖురాన్, 2:279)

6. మతపరంగా లంచాన్ని నిషేధించిన ఘనత కూడా ఇస్లాంది మాత్రమే (దివ్యఖురాన్, 2:188). ప్రవక్త మహమ్మద్ (స) లంచం తీసుకునేవారిని, ఇచ్చేవారిని శపించారు.

7. మహిళలకు ఆస్తి హక్కు ప్రసాదించిన మొట్టమొదటి ధర్మం ఇస్లాం. మరణించిన వ్యక్తి ఆస్తిలో మహిళలకు హక్కు ఇచ్చింది[1]. హిందూ మతంలో వితంతు

1. ఖురాన్ (4:11-12, 4:33, 4:176) – ఈ నియమాలను నిర్దేశించిన తర్వాత వీటిని దేవుని హద్దులుగా పేర్కొంది. ఈ హద్దులను అతిక్రమించినవారు (పరలోక జీవితంలో, నరకంలో) అగ్నిలో గెంటబడతారు, అందులో వారు శాశ్వతంగా ఉంటారు, అది చాలా భయంకరమైన శిక్ష. (4:14) (ప్రకాశకులు)

పునర్వివాహం లేదు. పైగా మరణించిన భర్త శవంతో సజీవంగా దహనమయ్యే (సతీ సహగమన) సంప్రదాయం కూడా ఉంది. అలా జరగకపోయినా, వితంతువుకు మంచి ఆహారం తినటానికి, మంచి బట్టలు ధరించడానికి, మంగళకార్యాలలో పాల్గొనడానికి అవకాశం లేదు. ఆమె అన్ని విధాలా తిరస్కృతగా మిగిలిపోయేది. ఆమె బతుకు భారంగా మారేది. ఇస్లాంలో వితంతువులకు ఎటువంటి కఠినమైన నియమాలు లేవు. భర్త మరణిస్తే నాలుగు నెలల పది రోజుల వ్యవధి గడిచిన తరువాత ఆమె తిరిగి వివాహం చేసుకోవచ్చు.

8. ఇస్లాంలో మహిళలకు అనివార్య పరిస్థితుల్లో భర్తను విడిచిపెట్టే హక్కు కూడా ఉంది. హిందూ మతంలో మహిళకు ఈ హక్కు లేదు. మన దేశంలో రాజ్యాంగం ద్వారా ఇప్పుడు మహిళలకు అనేక హక్కులు లభించాయి.

9. ఎవరైనా మహిళ శీలాన్ని ప్రశ్నించినవారు నలుగురు సాక్షులను తీసుకురావాలని, అలా చేయకపోతే ఎనభై కొరడా దెబ్బల శిక్ష విధించబడుతుందని ఆదేశించిన ఏకైక మతం ఇస్లాం. ఈ సందర్భంలో మనం శ్రీ రామచంద్రుడు, ప్రవక్త ముహమ్మద్ (స)– ఈ ఇద్దరి వ్యవహారశైలిని తులనాత్మకంగా పరిశీలించడం కూడా ఆసక్తికరమైనది. ప్రవక్త ముహమ్మద్ (స) భార్య ఆయిషా (రజి) పాతివ్రత్యంపై ప్రశ్నలు వచ్చినప్పుడు ప్రవక్త ముహమ్మద్ (స) ఆదేశంతో నిర్ణయాలు జరగలేదు. ఆచరణాత్మక విచారణలు, పరిశోధనల తర్వాత అది అపనిందగా నిరూపించబడింది. ఆయిషా (రజి) నిర్దోషిగా నిర్ధారణ అయ్యింది. కానీ సీతాదేవి అగ్నిపరీక్ష ద్వారా పాతివ్రత్యాన్ని నిరూపించినా కూడా శ్రీరామచంద్రుడు కేవలం అనుమానం కారణంగా సీతాదేవిని త్యజించారు. హిందువులు ఇదే విధంగా చేసినట్లయితే ఎందరో నిర్దోష మహిళలు అవమానాల పాలవుతారు. వారి జీవితాలు నాశనమవుతాయి. ఈ విషయంలో స్త్రీలు ఇస్లాం ధర్మానికి కృతజ్ఞతలు తెలియజేయాలి, ఎందుకంటే ఇది నిర్దోషులైన మహిళలపై నిందారోపణలను కేవలం నైతిక అపరాధాలుగా మాత్రమే కాదు చట్టపరంగా కూడా శిక్షార్హమైన నేరాలుగా ఇస్లాం ప్రకటించింది.

10. తూనికలు కొలతల్లో మోసం చేయడాన్ని చట్టపరంగా నేరంగా, ధార్మిక పాపంగా ప్రకటించిన ధర్మం ఇస్లాం మాత్రమే. ఈ నేరానికి గాను పరలోకంలో కూడా శిక్ష తప్పదు.

11. ఇస్లాం అనాథుల ఆస్తిని కబళించడం ధార్మికంగా పెద్ద పాపం అని పేర్కొంది. (ఖురాన్, 4:10, 4:127, 6:152, 17:33)

12. ఒకవేళ మీరు దేవుణ్ణి ప్రేమించేవారైతే, దేవుని సృష్టిని ప్రేమించండని ఇస్లాం చెబుతుంది.

13. తోటివారి పట్ల ఎవరు అత్యంత ఉత్తమంగా వ్యవహరిస్తారో వారిని దేవుడు అధికంగా ప్రేమిస్తాడని ఇస్లాం చెబుతోంది.

14. జీవులపై దయ చూపించే వారిపై దేవుడు దయ చూపిస్తాడని ఇస్లాం చెబుతుంది.

15. దయ అనేది ధార్మిక విశ్వాసం (ఈమాన్) ముఖ్య లక్షణం. దయలేని వారిలో ఈమాన్ ఉండదు.

16. తోటి మనిషిని తనకు సమానుడిగా భావించనంతవరకు ఎవరి ధార్మిక విశ్వాసం లేదా ఈమాన్ సంపూర్ణం కాదు.

17. పొరుగువారు పస్తులుంటే తాను కడుపునిండా తిని నిద్రించేవ్యక్తి నిజమైన ముస్లిం కాదని ఇస్లాం చెబుతోంది.

18. ఇస్లామీయ రాజ్యం కుఫ్రను (అవిశ్వాసాన్ని) కొన్ని ప్రత్యేక సందర్భాలలో, నిర్దిష్ట పరిమితుల మేరకు సహిస్తుంది, కాని ఇస్లాం దుర్మార్గాన్ని, అన్యాయాన్ని మాత్రం సహించదు.

19. ఒక వ్యక్తి దుర్మార్గం వల్ల అతని పొరుగు వారికి భద్రత లేకపోతే ఆ వ్యక్తి విశ్వాసి కాదని ఇస్లాం చెబుతోంది.[1]

1. ముహమ్మద్ (స) పొరుగువారి హక్కుల గురించి నొక్కి చెప్పారు. ఈ విషయంలో ముస్లిం ముస్లిమేతరులనే భేదం చూపలేదు. ముహమ్మద్ (స) ఇలా అన్నారు, "జిబ్రయీల్ (దైవదూత) నా వద్దకు ఎప్పుడు దైవాదేశాలు తీసుకువచ్చినా, నన్ను పొరుగువారితో మంచిగా ప్రవర్తించాలనే మాటలు చెప్పేవారు. పొరుగువారికి వారసత్వ హక్కులు కూడా ఇచ్చేస్తారా అని కూడా నాకు చివరకు అనిపించింది". "ఇస్లామీయ తత్త్వవేత్త, ధర్మవేత్త ఇమామ్ ఇబ్నె హజర్ ఈ ప్రవచనంపై వ్యాఖ్యానిస్తూ పొరుగువారిలో ముస్లిములు, ముస్లిమేతరులు, స్నేహితులు, శత్రువులు అందరూ ఉన్నారని పేర్కొన్నారు. అలాగే, దయ, వినమ్రతల విషయంలోను ప్రవక్త ముహమ్మద్ (స) చాలా నొక్కి చెప్పారు. ఆయన ఇలా అన్నారు: "నేను శపించటానికి కాదు, కారుణ్యంగా పంపబడ్డాను." ఈ విషయంలోను ముస్లిములు ముస్లిమేతరులు అనే తేడా లేదు. అందరూ దీనికి పాత్రులే.

20. ఎవరైనా మరొకరి చిన్న స్థలాన్ని అయినా గాని అన్యాయంగా కబళిస్తే ప్రళయదినాన అతన్ని ఏడు పాతాళాల లోతుల్లో పాతేయడం జరుగుతుంది.

21. ఇస్లాంలో ఉన్న సమానత్వం, సోదరభావం ప్రపంచంలో మరే మతంలోనూ కనిపించదు. హిందూ మతంలో దళితులను తక్కువగా చూడడం జరుగుతుంది. దీనికి వ్యతిరేకంగా 2500 సంవత్సరాల క్రితం బుద్ధుడు గొంతు విప్పాడు. అప్పటి నుండి ఇప్పటివరకు అనేక మంది సంస్కర్తలు ఈ అసమానతలను మార్చడానికి ప్రయత్నించారు. ఆధునిక కాలంలో గాంధీజీ ఎంతో ప్రయత్నం చేశారు. కానీ ఆయన కూడా ఈ భావనను మార్చలేకపోయారు. ఇదేవిధంగా క్రైస్తవుల్లో కూడా తెల్లవారు, నల్లవారు అనే భేదం ఉంది. తెల్లవారి చర్చీలు, నల్లవారి చర్చిలు వేర్వేరుగా ఉన్నాయి. తెల్లవారి చర్చీల్లో నల్లవారు ప్రవేశించలేరు. ఆధునిక కాలంలో కూడా, సామాజికవాద నినాదాలు వినిపిస్తున్నప్పుడు కూడా, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు ఉన్నప్పటికీ, దక్షిణ ఆఫ్రికాలో తెల్లక్రైస్తవులు నల్లక్రైస్తవులపై అణచివేతలు సాగించారు. ఈ విభజనను ఇస్లాం సమూలంగా పెకలించి వేసింది. జాతివివక్ష కొనసాగిన దక్షిణ ఆఫ్రికాలో కూడా ఒక జూలు వ్యక్తి ముస్లింగా మారగానే, ముస్లిం సమాజంలో సమానస్థాయి పొందేవాడు. కానీ క్రైస్తవుడిగా మారితే, క్రైస్తవ సమాజంలో ఈ సమానత్వం లభించేది కాదు. గాంధీజీ ఇస్లాంలోని ఈ సమానత్వాన్ని ఎంతో ప్రశంసించారు.[1]

---

1. రాజేంద్ర నారాయణ్ లాల్ సులభంగా, సరళంగా ఈ విషయాలను వివరించడానికి ప్రయత్నించారు. అయితే ఇస్లాంలో సమానత్వం, సోదరభావాల గురించిన కొన్ని బోధనలు, ఆదేశాలను ఇక్కడ ప్రస్తావించడం సముచితంగా భావిస్తున్నాము.

ఇస్లాం మౌలికంగా మనుషులందరూ ఒక్కటే అని చెబుతుంది. మనుషులంతా ఒకే తల్లి, తండ్రి సంతానం అంటుంది. దివ్య ఖురాన్‌లో దైవం ఇలా చెప్పాడు:

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను." (ఖురాన్, 49:13)

ఇది చాలా అర్థవంతమైన వాక్యం. ఇందులో మూడు ప్రధాన విషయాలు ఉన్నాయి.

# ఇస్లాం కరవాలంతో విస్తరించిందా?

ప్రపంచంలోని అన్ని మతాలలో, ఇస్లాంపై జరిగినంత దుష్ప్రచారం ఇతర మతాల్లో దేని విషయంలోనూ జరగలేదు. ప్రారంభంలో ప్రవక్త ముహమ్మద్ (స) తన సొంత తెగ అయిన ఖురైష్ నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఇస్లాంకు

---

వీటిని అర్థం చేసుకోకపోవడం వల్లనే మానవాళి వంశాలుగా, రాజ్యాలుగా, జాతులుగా, వర్ణాలుగా విభజించబడింది. మనుషులు ఒకే తల్లిదండ్రుల సంతానమనే వాస్తవాన్ని మనిషి మర్చిపోయాడు. మానవ చరిత్రలో అత్యంత దారుణమైన ఘర్షణలు, విద్వేషాలు, రక్తపాతం, చరిత్రలోనే కాదు నేడు కూడా ఇదంతా కనిపిస్తుంది, ఇదంతా ఈ భ్రమాత్మక అసమానతల కారణం వల్లనే చోటు చేసుకుంటుంది. ఈ ఖుర్ఆన్ వాక్యం మనిషికి ఈ వాస్తవాన్నే ముందుగా తెలియజేస్తుంది.

రెండవ విషయం మనుషుల్లో వంశం, గోత్రం, కుటుంబం, తెగ, జాతి, రాజ్యం అనే భేదాలకు అర్థం ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అని కాదు. మనుషులంతా ఒకే ప్రదేశంలో ఉండడం సాధ్యం కాదు. అందువల్ల వివిధ దేశాలు, జాతులు, వంశాలు, తెగలు, కుటుంబాలు ఏర్పడ్డాయి. దీనివల్ల ఒకరినొకరు గుర్తించడం సాధ్యపడుతుంది. ఒకరి హక్కును మరొకరు గౌరవించడం జరుగుతుంది. ఈ విధంగా ఒక వ్యవస్థ ఏర్పడుతుంది.

మూడవ విషయం ఏమిటంటే– వాస్తవానికి ఔన్నత్యం అనేది వంశం, గోత్రం, వర్ణం, జాతి వల్ల లభించదు. సదాచారాల వల్లనే లభిస్తుంది. ఎవరైతే సంయమనం, సదాచరణ, సన్మార్గం పాటిస్తారో వారే శ్రేష్ఠులు. వారు ఏ దేశం, జాతి, గోత్రం లేదా వర్ణానికి చెందిన వారు అయినా సరే. ఈ లక్షణాలు లేనివారు ఎవరైనా సరే హీనులే. అరబ్ దేశంలో ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించిన ఖురైషు వంశీయులు తాము చాలా గొప్పవారమని గర్వించేవారు. ఎవ్వరూ తమకు సమానులు కాదనుకునేవారు. మక్కా విజయం తర్వాత ప్రవక్త (స) ఖురైషులను ఉద్దేశించి ఇలా చెప్పారు:

“ప్రజలారా! మనుషులందరు రెండు విభాగాల్లోనే ఉన్నారు, ఒకరు సన్మార్గులు, సదాచారులు. వారు దైవసాన్నిహిత్యంలో ఉంటారు. మరో వర్గం దురాచారులు, దుర్మార్గులు. ఇలాంటి వారు దైవసమక్షంలో పరాభవం పాలవుతారు. మనుషులందరు ఆదమ్ సంతానమే. ఆదమ్‌ను దేవుడు మట్టితో సృష్టించాడు.” విజేతగా ఇలాంటి ప్రసంగాన్ని రామచంద్రుడు లంకా విజయం తర్వాత ఇవ్వలేదు. అలాగే కృష్ణుడు కౌరవులపై విజయం తర్వాత కూడా ఇవ్వలేదు. ప్రవక్త ముహమ్మద్ (స) తన చివరి హజ్ సందర్భంగా, అరబ్ దేశం నలుమూలల నుండి ముస్లింలు మక్కాకు హజ్ యాత్ర కోసం వచ్చినప్పుడు ఇలా చెప్పారు : “ప్రజలారా, జాగ్రత్త! మీ అందరి దేవుడు ఒక్కడే. ఒక అరబ్బుకి అరబ్బేతరునిపై, ఒక అరబ్బేతరుడికి అరబ్బు పై, ఒక తెల్లవాడికి నల్లవాడిపై, ఒక నల్లవాడికి తెల్లవాడిపై ఎలాంటి ఆధిక్యత లేదని గ్రహించండి– ధర్మ పరాయణత,

వ్యతిరేకంగా దుష్ప్రచారం, అణచివేతలు కొనసాగాయి. ఇస్లాంపై ఎంత దుష్ప్రచారం జరిగినా, ఇస్లాం అంతకంతకూ విస్తరించడం కూడా దాని ప్రత్యేకతే. ఇస్లాం దైవిక సత్యధర్మం అనడానికి ఇది కూడా ఒక ప్రమాణమే. ఇస్లాంపై జరిగిన దుష్ప్రచారా లలో, "ఇస్లాం కత్తిబలంతో విస్తరించింది" అనే ప్రచారం తీవ్రమైనది. కత్తిబలంతో కాకపోతే, అనేక ఇతర మతాలున్నప్పటికీ కేవలం ఇస్లాం మాత్రమే ప్రపంచంలో ఇంతగా ఎలా విస్తరించింది? ఈ ప్రశ్నకు క్లుప్తంగా జవాబేమిటంటే, ఇస్లాం ఆవిర్భవించే నాటికి అప్పటి వివిధ మతానుయాయులు తమ తమ మతాచారాలను కలుషితం చేశారు. మానవాళి సాఫల్యం కోసం, సంక్షేమం కోసం దైవం తన సంకల్పంతో ఇస్లాంను విజయవంతంగా ప్రపంచంలో విస్తరించేలా చేశాడు. చరిత్రయే దీనికి సాక్షి.[2]

---

సదాచరణ కలిగిన వారికి తప్ప. దైవ సమక్షంలో అత్యంత గౌరవనీయుడు ధర్మపరాయణుడు, సదాచార సంపన్నుడు మాత్రమే".

ఇలాంటి బోధన, మాటలకే పరిమితం కాలేదు. ప్రవక్త ముహమ్మద్ (స) సహచరుల్లో అరబ్బులు, అరబ్బేతరులు అందరూ ఉండేవారు. కొందరు బానిసలు కూడా ఉండేవారు. వీరికి ఖురైషులతో సమానత్వం మాత్రమే కాదు, కొందరికి ఆధిక్యత కూడా లభించింది. రెండు వందల సంవత్సరాల కాలంలోనే ఇతర దేశాల జాతులకు చెందిన ముస్లిములు అరబ్బులకు మత నేతలుగా కూడా మారారు. ఇప్పటికీ ఇస్లామీయ విద్యాసంస్థల్లో, మస్జిదుల్లో, అన్నపానీయాల్లో ఈ సమానత్వాన్ని సోదరభావాన్ని చూడవచ్చు. శూద్ర జాతుల నుండి ముస్లింలుగా మారిన వారు కూడా ఇందులో పెద్ద సంఖ్యలో కనిపిస్తారు. ఇస్లామీయ సమానత్వం, సోదరభావాల సుందర దృశ్యం మనకు మక్కాలో హజ్ యాత్ర సందర్భంగా కనిపిస్తుంది. అరబ్బులు, ఈరానీలు, అఫ్ఘానీలు, తుర్కీలు, భారతీయులు, మలేషియన్లు, ఇండోనేషియన్లు మొదలైనవారు అందరూ అక్కడ సోదరులుగా కనిపిస్తారు.

2. మక్కావాసులు తమ శక్తినంతా ఉపయోగించి యుద్ధం ద్వారా ఇస్లాంను, ముస్లింలను తుదముట్టించే ప్రయత్నాలు చేస్తున్నప్పుడు ఈ క్రింది దేవుని వాక్యం అవతరించింది– "వారు అల్లాహ్ జ్యోతిని తమ నోటితో ఊది ఆర్పగోరుతున్నారు. కాని అవిశ్వాసులకు ఎంత అనిష్టంగా ఉన్నాసరే అల్లాహ్ తన జ్యోతిని పూర్తిగా వ్యాపింపజేయ టానికే నిర్ణయిం చుకున్నాడు. ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్నీ ఇచ్చి పంపాడు. దానిని సకల ధర్మాలపై ఆధిక్యం వహించే ధర్మంగా చేయటానికి; ఇది బహు దైవారాధకు లకు ఎంత అనిష్టమైనాసరే." (దివ్యఖుర్ఆన్: 61:8,9)

అరబ్బుదేశంలో బహుదైవారాధకులతో పాటు క్రయిస్తవులు, యూదులు కూడా ఉండేవారు. ఈ రెండు మతాల అనుయాయులు కూడా ఇస్లాంను ద్వేషించేవారు. క్రైస్తవ దేశాల నుంచే ఇస్లాం కరవాలంతో విస్తరించిందన్న దుష్ప్రచారం మొదలయ్యింది. కాని తర్వాతి కాలాల్లో ఈ దేశాలకు చెందిన మేధావులే కొంతమంది ఈ ప్రచారాన్ని

ముహమ్మద్ (స) ప్రవక్త పదవిని చేపట్టక ముందు అరబ్ జాతి పూర్తిగా ధర్మభ్రష్టత, పాపాచారాల్లో కూరుకుపోయి ఉండేది. అటువంటి పతనావస్థలో ఉన్న జాతిని ధర్మపరాయణులుగా, సన్మార్గగాములుగా మార్చడానికి ఎటువంటి వనరులు, సాధనసంపత్తి లేకపోయినా, కేవలం దైవికశక్తితో ముహమ్మద్(స) ఒక్కరే పూనుకున్నారు. స్వచ్ఛమైన హృదయాలు కలిగిన కొందరు ఆయన మాటలు విని ఇస్లాం ధర్మం స్వీకరించారు. కానీ ఖురైష్ నాయకులు తమ పూర్వీకుల మతాన్ని వదలి, ముహమ్మద్ (స) బోధిస్తున్న సత్యధర్మాన్ని స్వీకరించడానికి, ఆయన్ను ప్రవక్తగా ఒప్పుకోడానికి సిద్ధపడలేకపోయారు. వారంతా ఇస్లాంకు వ్యతిరేకంగా నిలబడ్డారు. ముహమ్మద్ (స)పై, ఆయన అనుచరులపై దుర్భర దౌర్జన్యాలకు పాల్పడడం ప్రారంభించారు. ఈ దౌర్జన్యాలకు తట్టుకోలేక, కొందరు ముస్లింలు హిజ్రత్ చేశారు. అంటే తమ ధర్మాన్ని కాపాడుకోవడం కోసం దేశాన్ని విడిచిపెట్టి హబ్షా (ఇథియోపియా)కు వలసవెళ్ళారు. మక్కాలో ముస్లిములపై దౌర్జన్యాలు, దుర్మార్గాలు, అణచివేతలు తీవ్రమయ్యాయి. చివరకు ముహమ్మద్ (స), ఆయనతో పాటు ముస్లింలు తమ జన్మభూమి మక్కాలో ఉండడం అసాధ్యమైంది.

మక్కాలో ఇస్లాం పరిస్థితి ఇలా ఉంది కాని మదీనాలో ఇస్లాం ఇంటింటా విస్తరించింది. ప్రపంచంలో ఇస్లాం ఎలా వ్యాపించిందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇంతకీ ఏం జరిగిందంటే, హజ్ యాత్ర కోసం మదీనాకు చెందిన ఒక బృందం మక్కాకు వచ్చింది. ముహమ్మద్ (స) వారికి ఇస్లాం ధర్మాన్ని పరిచయం చేశారు. మదీనా బృందం ఇస్లాం స్వీకరించింది. తర్వాతి సంవత్సరం మరికొంత మంది మదీనా వాసులు ఒక బృందంగా హజ్ యాత్రకు వచ్చారు. ఈ బృందం కూడా ప్రవక్త ఉపదేశం తర్వాత ముస్లింలుగా మారారు. వారి అభ్యర్థనపై, వారి ఇస్లాం శిక్షణ కోసం ముహమ్మద్ (స) తన సహచరులలో ఒకరిని మదీనా పంపించారు. ఈ శిక్షకుని వల్ల మదీనాలో ఇంటింటా ఇస్లాం వ్యాప్తి చెందింది. మూడవ సంవత్సరం, హజ్ యాత్రకు మదీనా నుంచి పెద్ద సంఖ్యలో జనులు మక్కాకు వచ్చారు. వారంతా ముహమ్మద్ (స)ను కలిసి మక్కాను వదలి మదీనా రావాలని ఆహ్వానించారు. మదీనా

---

ఖండించారు. మనదేశంలో కూడా ఇలాంటి ఆరోపణలు చేసేవారు, ఈ ఆరోపణలను ఖండించే మేధావులు కనిపిస్తారు.

వాసులు తమ ధనప్రాణాలను ప్రవక్త రక్షణకు ధారపోస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిపాదనను ముహమ్మద్(స) ఒప్పుకున్నారు. ముస్లింలు మదీనాకు వలస వెళ్ళేందుకు అనుమతిచ్చారు. హబ్షా (ఇథియోపియా)కి హిజ్రత్ జరిగిన తర్వాత, ఇది రెండవ ముఖ్యమైన హిజ్రత్. ముహమ్మద్ (స) రాత్రివేళ తన శత్రువుల కంటబడకుండా తప్పించుకుని హిజ్రత్ చేయాల్సి వచ్చింది. ఎందుకంటే శత్రువులు ఆయన్ను హతమార్చ డానికి ఇంటిని చుట్టుముట్టిన విపత్కర పరిస్థితి అది. అయినప్పటికీ ఆయన సురక్షితంగా అక్కడి నుంచి బయటపడ్డారు.[1]

ఇది ఇస్లాం ప్రారంభ 13 ఏళ్ల చరిత్ర. ఇది వాస్తవమైనప్పుడు ఇస్లాంలోని సత్యత, నైతికతల శక్తి, ముహమ్మద్ (స) దివ్య వ్యక్తిత్వం వల్ల విస్తరించిందని అంగీక రించడానికి అభ్యంతరాలేమిటి? యుద్ధాన్ని ఆయనపై శత్రువులు ప్రారంభించారు. భద్రత కోసం ఎలా దేశాన్ని త్యజించవలసి వచ్చిందో అదేవిధంగా ఆత్మరక్షణ కోసం యుద్ధం చేయాల్సి వచ్చింది. ముహమ్మద్ (స), ఆయన సహచరులు దేశం విడిచినా, మక్కా వాసుల వైరం తగ్గలేదు. వారు మదీనాపై దాడులు ప్రారంభించారు. కేవలం ధర్మ రక్షణ మాత్రమే కాదు, ప్రాణ రక్షణ కూడా ప్రశ్నగా మారింది. ఈ పరిస్థితిలోనే దేవుడు ముస్లింలకు ఆత్మరక్షణ కోసం సంఘర్షించే (జిహాద్) అనుమతి ఇచ్చాడు.

ఇస్లాం వ్యతిరేకులు ఈ విషయంలో కూడా అభ్యంతరాలు చెబుతుంటారు. మక్కాలో ముహమ్మద్ (స) సత్యసందేశ ఉద్యమం పూర్తిగా శాంతియుతంగా ఉండేది కానీ మదీనాలో ఆయనకు బలం లభించిన తర్వాత ఆయన పద్ధతి మారిందని విమర్శి స్తుంటారు. ఈ విమర్శ అన్యాయమైనది. విపత్కర పరిస్థితుల్లో ముహమ్మద్ (స) తన అనుచరులను "మీరు మీ ధర్మాన్ని, మీ ప్రాణాలను కాపాడుకోవద్దు, ప్రాణాలు బలిపెట్టండి" అని చెప్పాలంటారా? ఆత్మరక్షణ కోసం పోరాడ్డం ఏ మతంలో, ఏ రాజకీయ వ్యవస్థలో అయినా నిషిద్ధమా? రామచంద్రుడు తన భార్య కోసం, కృష్ణుడు భూమి కోసం యుద్ధం చేశారు. రామచంద్రుని యుద్ధం వల్ల దేశానికి, జాతికి కలిగిన ప్రయోజనమేమిటి? కృష్ణుడి యుద్ధం వల్ల ఆయన బంధువులు, అర్జునుడి కుటుంబం నాశనం అయిపోయింది. దేశం శక్తిని కోల్పోయింది. ముహమ్మద్ (స) చేసిన యుద్ధంలో చాలా కొద్దిమంది మాత్రమే మరణించారు. మక్కా విజయం తర్వాత

1. మక్కా నుండి ముస్లింలు మదీనాకు వలస వెళ్ళినప్పుడు వారి చేతిలో ఖడ్గం లేదు. అప్పుడు మక్కాలో ముస్లింలు పీడితులుగా ఉండేవారు. వారు సైనికులుగా కాదు, శరణార్థులుగా వెళ్లారు. అయినప్పటికీ, మదీనాలో ఇస్లాం ఇంటింటా విస్తరించసాగింది.

ముహమ్మద్ (స) తన పట్ల 21 సంవత్సరాలుగా తీవ్రశత్రుత్వం చూపిన ప్రాణ శత్రువులను, పెద్ద నేరస్తులను కూడా క్షమించారు. జాతి కూడా భద్రత పొందింది. ఇస్లాం స్థాపితమైంది. తెగలు-తెగలుగా చెల్లాచెదురై ఉన్న దేశం ఇస్లామీయ వ్యవస్థలోకి వచ్చి సుదృఢమైంది.

ఇస్లాం ఖడ్గం ద్వారా విస్తరించిందని వాదించేవారికి తాతారీల ఇస్లాం స్వీకరణ గురించి కూడా తెలియాలి. ముస్లిం అరబ్బులను గెలిచిన ముస్లిమేతర తాతారీలు, గెలిచిన తర్వాత పరాజిత అరబ్బుల ఇస్లాం మతాన్ని స్వీకరించారని తెలుసుకోవాలి. ఈ విచిత్రమైన సంఘటన ఎలా జరిగింది? గెలిచిన వారికి ఖడ్గబలం ఉంటుంది. కాని వారు ఇస్లాం ముందు ఎలా ఓడిపోయారు? ఇస్లాం అసాధారణంగా విస్తరించిందని అనేక విధాల ఆరోపణలు చేసే వారు దీనికి ఏమంటారు?

మంగోల్ క్రూరత్వానికి ఇస్లాం ఇచ్చిన మాదిరి జవాబు ఇతర మతాల వద్ద ఉందా? మంగోల్ దారుణాలకు ప్రపంచమంతా గజగజలాడేది. మంగోల్ యుద్ధ జాతికి సంస్కృతీ నాగరికతలను నేర్పిన ఘనత పూర్తిగా ఇస్లాందే.[1] చైనా, హిందుస్థాన్, ఆఫ్రికాల్లో ఇస్లాం ఖడ్గం ద్వారా విస్తరించిందా? చరిత్ర అలా చెప్పటం లేదే"!

బహుశా మధ్యయుగాల్లో యూరప్‌లో, భారత్‌లో లేదా ఇతర దేశాల్లో జరిగిన యుద్ధాలలో ముస్లింలు కలసికట్టుగా ఉండి విజయాలు సాధించిన కాలంలో యుద్ధానంతరం అక్కడ ముస్లిం సమాజాలు ఉనికిలోకి వచ్చి ఉండవచ్చు. పరాజిత ముస్లిమేతర ప్రజలపై దౌర్జన్యాలు కూడా జరిగి ఉండవచ్చు. కొందరు అత్యుత్సాహులు, అవివేకులు అయిన ముస్లిములు బలప్రయోగాలకు పూనుకుని కూడా ఉండొచ్చు. యుద్ధాలలో కొందరి అవివేక, వ్యక్తిగత వ్యవహారశైలిని ఇస్లాం ఖాతాలో వేయడం అన్యాయమే అవుతుంది. ముస్లిం-ముస్లింల మధ్య జరిగిన యుద్ధాలు, హిందువులు-హిందువుల మధ్య, క్రైస్తవులు- క్రైస్తవుల మధ్య, రాజపుత్ర వంశాల మధ్య, మరాఠాలు- మరాఠాల మధ్య, మొగల్ పాలకులకు పఠాన్లకు మధ్య జరిగిన అనేక యుద్ధాల వంటివే ఈ యుద్ధాలు కూడా.

ఈ యుద్ధాలకు దారితీసిన రాజకీయ కారణాలను విస్మరించి, హిందువులు-ముస్లింల మధ్య ఇస్లాం కారణంగా జరిగిన యుద్ధాలుగా చిత్రీకరించడం వాస్తవ విరుద్ధమవుతుంది.

1. ఆగ్నేయాసియా దేశాలు

భారతదేశంలో జరిగిన యుద్ధాల్లో ఒకవైపు పూర్తిగా ముస్లిం సేనలు, మరోవైపు పూర్తిగా హిందూ సేనలు ఉన్న యుద్ధాలు చాలా చాలా అరుదు. ప్రారంభంలో అలా జరిగి ఉండొచ్చు కానీ ముస్లింలు భారతదేశంలో స్థిరపడ్డ తర్వాత అలాంటివి జరగలేదు. 1565లో తళ్ళికోటలో, బహమనీ ముస్లిం రాజ్యానికి, హిందూ విజయనగర సామ్రాజ్యానికి మధ్య భీకర యుద్ధం జరిగింది. ఇందులో నిజంగానే ముస్లింలు విధ్వంసానికి పాల్పడ్డారు. కానీ అంతకు ముందు విజయనగర హిందూ రాజు అహ్మద్‌నగర్ ముస్లిం రాజ్యాన్ని నాశనం చేసిన సంఘటన కూడా ఉంది. ముస్లింలపై దారుణమైన అఘాయిత్యాలకు పాల్పడ్డారు. దానికి ప్రతీకారమే తళ్ళికోట యుద్ధం.

బలవంతపు మత మార్పిళ్ళని ఇస్లాంపై ఆరోపణ చేసేవారు ఒక చారిత్రక వాస్తవాన్ని గుర్తించాలి, అదేమంటే, మెక్సికోలో క్రైస్తవులు లక్షలాది క్రైస్తవేతరులను హతమార్చారు. అలాగే బౌద్ధ మతం పుట్టిన దేశం నుండి తుడిచిపెట్టుకుపోయిందంటే, దాని వెనుక బ్రాహ్మణ పుష్యమిత్ర బౌద్ధులపై పాల్పడిన దారుణాలు ఉన్నాయి.

క్రైస్తవులు ముఖ్యంగా పోర్చుగలు వారి సజీవదహనాలు, మతోన్మాదాలు, క్రైస్తవ మిషనరీలు ప్రలోభాలు చూపించి మతమార్పిళ్ళు చేయడం– ఇవన్నీ సామ్రాజ్యవాద కారణాలతో జరిగినవే. తెల్ల క్రైస్తవులు, నల్ల క్రైస్తవులపై పాల్పడిన అఘాయిత్యాలు, హిందువుల్లో దళితులపై కొనసాగిన అణచివేతలు ఇవన్నీ ఉన్నాయి. ముస్లిముల మతోన్మాదం అని చెప్పే కట్టుకథల కన్నా ఇవి అమానుషమైనవి. ఇస్లాం ధర్మం తనలోని నిరాడంబరత, సరళత, సమానత్వం, సోదరభావం, నైతికశక్తి కారణంగానే విస్తరించింది.

## ‘కాఫిర్’ పదానికి అర్థం

దివ్యఖుర్ఆన్ యుద్ధకాలానికి సంబంధించి వినిపించిన ఆదేశాల్లో “కాఫిర్‌లను స్నేహితులుగా భావించకండి, వాళ్ళతో యుద్ధం చేసి, ఎక్కడ కనిపిస్తే అక్కడే చంపండి” అని ఉంది. ఈ వాక్యాలను సాకుగా చేసుకుని ఇస్లాంపై చాలా విమర్శలు వచ్చాయి. “కాఫిర్” అనే పదం “హిందూ” లేదా ఇతర మతాలకు సంబంధించినది కాదు. దీని అసలు అర్థం “తిరస్కరించేవాడు” అని. అంటే ముహమ్మద్ ప్రవక్త (స)ను, దివ్య ఖురాన్‌ను అంగీకరించకుండా తిరస్కరించేవాడు. అంటే ఇస్లాం ధర్మాన్ని విశ్వసించని వాడు కాబట్టి అవిశ్వాసి. ఈ అర్థంలో, యూదులు, క్రైస్తవులు, పార్సీలు తదితర ముస్లి

మేతరులందరు "కాఫిర్" లేదా "అవిశ్వాసి" అనే పదం పరిధిలోకి వస్తారు. అంతేకాదు ముస్లిముల్లో కూడా ఎవరైనా ఇస్లాంలోని ఏదైనా ఆదేశాన్ని, ఉదాహరణకు నమాజ్ వంటి ఆదేశాన్ని నిరాకరిస్తే అతను కూడా కాఫిర్ అయిపోతాడు.

వైదిక మతంలో "కాఫిర్"కు సమానమైన పదం "నాస్తికుడు". బుద్ధుడు వేదాలను అంగీకరించనందు వల్ల వైదికులు ఆయన్ను నాస్తికుడన్నారు. బౌద్ధం దానికదే ఒక ప్రత్యేకమైన మతం. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుంటే కాఫిర్ అనే పదం హిందువులకు అవమానకరమైనది కాదు. అలాగే నాస్తికులనే పదం ముస్లిములకు కూడా అవమానకరమైనది కాదు. కాని నిత్యవ్యవహారంలో ముస్లింలు హిందువులను "హిందూ" అని పిలుస్తారు, రాస్తారు. అలాగే హిందువులు ముస్లిములను ముస్లిం అని పిలుస్తారు, రాస్తారు. ఇదే సరయిన పద్ధతి. ఇస్లాం మతంలో ముస్లిమేతరులను సూచించడానికి "కాఫిర్" అనే పదం ఒక్కటే ఉంది. కాని హిందూ మతంలో హైందవేతరులను సూచించడానికి అవమానకరమైన పదాలు కూడా అనేకం ఉన్నాయి. "అనార్య", "అసభ్య", "దస్యుడు", "మ్లేచ్ఛుడు" వంటి అనేక పదాలు ఉన్నాయి. స్వయంగా హిందూ మతానికి చెందినవారయినప్పటికీ కొందరిని అంత్యజులు (శూద్రులు), ఛండాలురు, అస్పృశ్యులని అంటారు. (ఇస్లాంలో "కాఫిర్" పదం కేవలం గుణవాచకం, ఇది అవమానకరమైనది కాదు).

## సగోత్ర వివాహాలు

ఇస్లాం మతం సగోత్ర వివాహాలను అనుమతిస్తుంది. దీనిపై కూడా కొందరు చాలా అభ్యంతరాలు చెబుతుంటారు. కానీ సగోత్ర వివాహాలు, మనోవైజ్ఞానికంగా, కౌటుంబికంగా, సామాజికంగా, ఆర్థికంగా చాలా సానుకూలమైనవి. సగోత్ర వివాహాలపై అభ్యంతరపెట్టే హిందువుల్లోను అవతార పురుషుడిగా భావించే కృష్ణుడి విషయంలో దీన్ని ఆమోదిస్తున్నారు. హిందువులలో ఈ వైరుధ్యం ఉంది. హిందువులు తమ పూర్వీకులైన పురుషుల సంప్రదాయాలను చరిత్ర రూపంలో కొనసాగిస్తూ, ఈ సంప్రదాయాల ఆధారంగా నిషేధాత్మక నైతికత (Negative morality) పేరుతో వివాహ సంబంధాలకు దూరంగా ఉంటారు. కానీ ఇస్లాంలో వివాహసంబంధాల విషయంలో ఆమోదం మనోవైజ్ఞానికమైనది. ఈ మనోవైజ్ఞానిక వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. సంక్షిప్తంగా చెప్పాలంటే తన సొంత చెల్లి విషయంలో సొంత అన్నకు ఉండే భావాల వంటివే మనోభావాలు, పినతండ్రి కూతురు లేదా వరుసకు చెల్లెలయ్యే

అమ్మాయి విషయంలో జీవితాంతం ఉండడం జరగదు. హిందువులలో సగోత్ర వివాహాల ఆంక్షల విస్తృతి చాలా ఎక్కువ చేయడం వల్ల జరిగేది ఏమిటంటే, ఒక తరంలో కాకపోయినా, మరొక తరంలో తప్పకుండా ఒకే సోదరుల కుటుంబాలు పరస్పరం పరాయి వ్యక్తులుగా మారిపోతారు. ఒక సంపన్నుడైన సోదరుడు తన పేద సోదరుడికి లేదా సోదరికి సహాయం చేయగలిగిన ఉత్తమ విధానం, తన కొడుకుకు పేద సోదరుడు లేదా సోదరి కూతురితో పెళ్ళి జరిపించడం. ఎప్పుడో ఒకసారి చేసే ఆకస్మిక సహాయాల ప్రభావం ఉండదు, పైగా దీనివల్ల న్యూనతాభావానికి గురవుతారు. వాస్తవానికి సమాజవాదానికి సరయిన పునాది సగోత్ర వివాహాలే. సగోత్ర వివాహాలను నిషేధించడం వల్ల వరకట్నాలు పెరుగుతాయి. కుటుంబాల్లో సుఖ–శాంతులు దూరమవుతాయి. ఒక కూతురు పుట్టగానే ఆమె తల్లిదండ్రులు ఆందోళనలో పడిపోతారు. ఆమెకు వివాహం ఎక్కడ జరుగుతుందో ఏమోననే చింత అమ్మాయి తండ్రిని క్రుంగదీస్తుంది. కాని బంధువర్గంలోనే అర్హులైన, బాగా తెలిసిన అబ్బాయిలు ఉంటారు. అపరిచితులతో వివాహం ఎప్పుడో ఒకప్పుడు విపరీత ఫలితాలు ఇస్తుంది. సంపూర్ణ అవతారంగా భావించే కృష్ణుడు సగోత్ర వివాహాన్ని ఆమోదించారు. కుంతి కృష్ణుడు మరియు సుభద్ర యొక్క మేనత్త. అర్జునుడు కుంతి కుమారుడు. ఈ విధంగా అర్జునుడు, సుభద్రకు మేనమామ కొడుకు. కానీ అతని వివాహం కృష్ణుడి అన్న కూతురు అంటే బలరాముని కూతురు శశికళతో జరిగింది. కృష్ణుడికి రాధతో ప్రేమానుబంధం ఉండేది, రాధ ఆయనకు మేనత్త. పృథ్వీరాజ్, జయచంద్ర్ చారిత్రక వ్యక్తులు. ఇద్దరు కజిన్స్. పృథ్వీరాజ్ జయచంద్ర్ కుమార్తె సంయోగితతో ప్రేమలో పడిపోయారు, ఈ ప్రేమ మానసిక శాస్త్రానికి వ్యతిరేకం కాదు. వారు వివాహం చేసుకుని ఉంటే, పృథ్వీరాజ్, జయచంద్ర్ ఇద్దరూ ధ్వంసం కాకపోయేవారు, ఫలితంగా హిందూ రాజ్యం నాశనం కాకపోయేది. ఈ వాస్తవాల వెలుగులో, సగోత్ర వివాహ నిషేధంపై హిందువులు గర్వపడటం సరైనది కాదు. (ఇస్లామిక్ సమాజంలో సగోత్ర వివాహంపై విమర్శలు అన్యాయం).

## ఇస్లాం - బానిసత్వం

ఇస్లాం బానిసత్వాన్ని (Slavery) కొనసాగించిందని వాదించేవారు లేదా ఇస్లాం దాస్య వ్యవస్థను ప్రోత్సహించిందని వాదించేవారు పూర్తిగా తప్పుడు వాదనలు

చేస్తున్నారు. ఈ వాదనలు భ్రమాత్మకమైనవి. ఇస్లాం మాత్రమే మనిషికి మనోవాక్కర్మల ద్వారా సమానత్వాన్ని ప్రసాదిస్తుంది.[1]

---

1. బానిస వ్యవస్థ పరంపర కూడా నలుగురు భార్యల సంప్రదాయం వంటిదే. అరేబియాలో ప్రాచీన కాలం నుండి బానిస వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది. సాధారణ కుటుంబంలో కూడా నలుగురైదుగురు బానిసలు ఉండేవారు. ధనిక కుటుంబాల్లో ఇంకా ఎక్కువ మంది బానిసలు ఉండేవారు. అరబ్బు సమాజంలో సాధారణ గృహజీవితంలో బానిసలు ఒక భాగమైపోయారు. బానిసలు తమ యజమానుల పొలాల్లో, తోటల్లో, ఇళ్లలో పనిచేసేవారు. కాపలా కాసేవారు. ఒంటెలు, పశువులు మేపేవారు. ఆడ బానిసలు ఇంటిపని చేసేవారు. బానిసల అన్నపానీయాలు, వసతి, అన్నీ యజమానులపై ఆధారపడి ఉండేవి. ఈ పరిస్థితుల్లో ఇస్లాం బానిసలకు స్వేచ్ఛ ఇవ్వాలని అకస్మాత్తుగా ఆదేశాలిస్తే పరిణామాలు ఎలా ఉండేవి? ఆ బానిసలకు తలదాచుకునే గూడు ఉండేది కాదు. తినడానికి తిండి ఉండేది కాదు. మరోవైపు బానిసలపై ఆధారపడిన అరబ్బుల కుటుంబ, సామాజిక జీవనం అల్లకల్లోలమయ్యేది.

   ఈ పరిస్థితుల దృష్ట్యా ఇస్లాం బానిసత్వాన్ని ఒక్కసారిగా రద్దు చేసే ఆకస్మిక నిర్ణయం తీసుకోలేదు. ఇలా చేయడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదు, సైద్ధాంతికంగా ఉచితము కూడా కాదు. అందువల్ల బానిసలకు స్వేచ్ఛనిచ్చేలా ప్రోత్సహించింది. బానిసలకు స్వేచ్ఛనివ్వడం పుణ్యకార్యంగా ప్రకటించింది. ఎవరైనా బానిసలను ఉపయోగిస్తుంటే, బానిసలను ఇంటి సభ్యులకు సమానంగా మార్చేసే నియమాలు నిర్దేశించింది. బానిసలు మీ సోదరులని ప్రవక్త ముహమ్మద్ (స) యజమానులను ఆదేశించారు. ఆయన బానిస లేదా దాసుడు అనే పదాలు వాడలేదు, సోదరులనే పదం వాడారని గ్రహించాలి. యజమాని తాను ఏది తింటున్నాడో అదే బానిసకు పెట్టాలి. ఏమి ధరిస్తున్నాడో అవే వస్త్రాలు బానిసలకు ఇవ్వాలన్నారు. వారి శక్తికి మించిన పని అప్పగించరాదు. ఒకవేళ అలాంటి పని ఏదన్నా అప్పగిస్తే ఆ పనిలో తాను కూడా బానిసకు సహాయం చేయాలన్నారు. దానితో పాటు బానిసల స్వాతంత్ర్యానికి అనేక మార్గాలు తెరిచారు. ఉదాహరణకు:

- బానిసలకు స్వేచ్ఛ ప్రసాదించడం పుణ్యకార్యంగా ప్రకటించారు. అందువల్ల చాలా మంది తమ బానిసలకు స్వేచ్ఛనిచ్చారు. అంతేకాదు, ఇతరుల వద్ద బానిసలుగా ఉన్నవారిని పుణ్యార్థం కొనుగోలు చేసి కూడా వారికి స్వేచ్ఛనివ్వడం ప్రారంభించారు.
- రమజాన్ మాసంలో ఉపవాసాలను భంగపరిస్తే ప్రాయశ్చిత్తం కోసం నిర్దేశించిన పద్ధతుల్లో ఒకటి బానిసకు స్వేచ్ఛనివ్వడం కూడాను.
- ఎవరైనా ఏదైనా విషయం గురించి ప్రమాణం చేసి దానిని ఉల్లంఘిస్తే, ప్రాయశ్చిత్తం పద్ధతుల్లో ఒకటి బానిసకు స్వేచ్ఛనివ్వడం.

దాస్య వ్యవస్థ విషయంలో ఇస్లాం, ఇస్లాం ప్రవక్త సామాజిక మార్పు కోసం మానసిక చికిత్సను అనుసరించారు. హృదయాల పరివర్తన, మేధో ప్రక్షాళనం ద్వారా సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే ధర్మం ఇస్లాం. రోజుకు 70 సార్లు ఒక బానిసను క్షమించాలని చెప్పడం, దాసుడిని "నా దాసుడు" అని కాకుండా "నా కుమారుడు

- అరబ్బుల్లో ఒక దురాచారం ఉండేది. భార్యపై కోపం వస్తే, "నువ్వు నా తల్లితో సమానం" అని చెప్పేవారు, అంటే 'ఇకపై నీతో శారీరక సంబంధం పెట్టుకోను' అని ప్రకటించడం. అలాంటి సందర్భంలో తిరిగి వైవాహిక సంబంధాన్ని స్థాపించడానికి నిర్దేశించిన ప్రాయశ్చిత పద్ధతుల్లో ఒకటి బానిసకు స్వేచ్ఛనివ్వడం.
- బానిస స్త్రీ అయితే ఆమెతో యజమాని లైంగిక సంబంధం, వ్యభిచారం అవకాశాలు ఖచ్చితంగా ఉంటాయి. దీనివల్ల తీవ్రమైన సామాజిక, నైతిక పరిణామాలు తప్పవు. ఈ దుష్పరిణామాలను నివారించడానికి యజమానికి దాదాపు భార్య హోదా బానిస స్త్రీకి ఇస్లాం ప్రసాదించింది. ఆమె సంతానం బానిసలు కాదు, స్వతంత్రులని ప్రకటించింది.

  భారతదేశంలో దాసదాసీల వ్యవస్థకు మతపరమైన గుర్తింపు ఉండేది. బానిస పుట్టుకతో బానిస, అందువల్ల అతను ఏ దశలోనూ బానిసత్వం నుండి విముక్తి పొందలేడు. మనుస్మృతి ప్రకారం "శూద్రుడు, అతను కొనుగోలు చేయబడిన వాడైనా కాకపోయినా, అతడిని సేవకుడిగానే ఉపయోగించుకోవాలి. ఎందుకంటే బ్రహ్మ అతన్ని బ్రాహ్మణ సేవ కోసం పుట్టించాడు. యజమాని అతన్ని విడిచిపెట్టవచ్చు, కానీ శూద్రుడు దాస్యం నుండి ఎప్పటికీ విముక్తి పొందలేడు, ఎందుకంటే అది అతని సహజ ప్రవృత్తి, ఎవరూ అతన్ని దాని నుండి వేరు చేయలేరు." (మనుస్మృతి, 8/413-414)

  "యుద్ధంలో ఓడిపోయి తీసుకురాబడినవాడు, ఆహారం కోసం స్వయంగా వచ్చినవాడు, దాసీ గర్భం నుంచి పుట్టినవాడు, కొనుగోలు చేయబడినవాడు, దానమివ్వబడినవాడు, తాతతండ్రుల కాలం నుంచి ఒకరి ఇంట పనిచేస్తూ వస్తున్నవారు, శిక్ష కారణంగా లేదా రుణాలు చెల్లించనందువల్ల దాసుడైనవాడు... ఏడు రకాల బానిసలు".

  (మనుస్మృతి, 8/415)

  "బ్రాహ్మణుడు అవసరమైతే శూద్రుని సంపదను స్వేచ్ఛగా తీసుకోవచ్చు. ఎందుకంటే అది అతని సొంత సంపద ఏమీ కాదు. సంపద తన యజమానికి చెందినది (అంటే బ్రాహ్మణునిది.)" (మనుస్మృతి, 8/417)

  ఇది భారతదేశంలో దాసదాసీ వ్యవస్థ. అరేబియాలో బానిసలకు కులం లేదు, తరగతి లేదు, బానిసలు స్వేచ్ఛ పొందగలిగేవారు. భారతదేశంలో దాసదాసీ వ్యవస్థ మతపరమైన ఆచారంగా ఉండేది. ఇస్లాం అరేబియాలో వచ్చినప్పుడు, బానిసల విముక్తి మతంలో పవిత్రమైన పుణ్యకార్యమైపోయింది. ముస్లిం వలీలు సాధుసంతులు భారతదేశానికి వచ్చినప్పుడు, లక్షలాది మంది ఆదరించారు. వారిని గుండెలకు హత్తుకున్నారు. నేడు భారతదేశంలోని లక్షలాది మంది ముస్లింలు ఈ శూద్రుల సంతానమే. అరబ్బు, భారత దేశాల్లోని ఈ బానిసల వారసులు తర్వాత ముస్లింల మత నాయకులు కూడా అయ్యారు, కాని నేడు కూడా హిందు అగ్రవర్ణాలు శూద్రుల హక్కులను వ్యతిరేకిస్తూనే ఉన్నాయి.

లేదా నా కూతురు" అని పిలవాలని చెప్పడం, బానిసలపై అత్యధిక శ్రమ భారం వేయకూడదని ఆదేశించడం, కఠినమైన పనిలో బానిసకు సహాయం చేయాలని ఆదేశించడం, అన్నింటికీ మించి 'మీరందరు దేవుని దాసులు' అని ప్రకటించడం ద్వారా ఇస్లాం, బానిస వ్యవస్థ మహావృక్షాన్ని పైపై నుంచి కాదు, వేళ్ళ నుంచి పెకలించి వేసే ప్రయత్నాలు చేసింది. బానిసల కష్టాలు తొలగించడమే కాదు, వారి హోదా కూడా పెంచింది. సమానత్వం విషయంలో ఇస్లాం సాధించిన అద్భుతానికి చరిత్ర సాక్ష్యం పలుకుతుంది. భారతదేశంలో బానిస రాజవంశం పరిపాలన దీనికి ఒక స్పష్టమైన రుజువు. ఈ బానిసలు బలప్రయోగంతో పాలకులు కాలేదు. యోగ్యత ఆధారంగా చక్రవర్తి స్థానానికి ఎదిగారు.[1]

ముస్లిం చక్రవర్తులు అర్హులైన బానిసల పట్ల పుత్ర ప్రేమను కనబరిచారు. దీనికి విరుద్ధంగా, తెల్ల క్రైస్తవులు నల్ల క్రైస్తవులపై , హిందూ అగ్రవర్ణాలు దళితులపై అణచి వేత, దౌర్జన్యాలు నేటికి కూడా కొనసాగుతున్నాయి.[2]

ఇది సోకాల్డ్ బానిస వ్యవస్థ (ఇస్లాంపై వినిపించే ఆరోపణ)కన్నా చాలా హీన మైన పరిస్థితి.

## శవ దహనమా? ఖననమా? ఏది మంచిది?

ముస్లింలు మృతదేహాలను ఖననం చేయడాన్ని అశాస్త్రీయమని కొందరు వాదిస్తారు. కాని మృతదేహాలను తగలబెట్టడం కంటే వాటిని ఖననం చేయడమే శాస్త్రీయమైనది, సముచితమైన పద్ధతి కూడాను. క్రయిస్తవులు, ముస్లింలు, యూదులు మృతదేహాలను ఖననం చేస్తారు. హిందువులు, సిక్కులు బౌద్ధులు మృతులను దహనం చేస్తారు. ప్రపంచ జనాభాలో అత్యధికులు తమ మృతులను ఖననం చేస్తున్నారు. సైన్స్ ప్రబలంగా ఉన్న యూరప్ అమెరికాల్లో ఖనన పద్ధతి ప్రబలంగా ఉన్నప్పుడు ఈ పద్ధతి అశాస్త్రీయమని చెప్పడం ఎంత వరకు సబబు? దహన పద్ధతి వల్ల గాలి, నీరు కలుషితమవుతాయి. దహనం తర్వాత మిగిలిపోయిన శరీర భాగాలను నీటిలో పడేయడం ద్వారా నీరు కలుషితం అవుతుంది. చాలా వరకు మృతదేహాలు సగం మాత్రమే కాలి ఉంటాయి. ఈ ద్రవ్యోల్బణ యుగంలో హిందూ పద్ధతిలో దహన

1. ఈ బానిసలు యోగ్యత ఆధారంగా పాలకులు, చక్రవర్తులుగా ఎదగడమే కాదు, మేధావులు, పండితులు, ధర్మాచార్యులుగా కూడా ఎదిగారు.
2. నేడు కూడా దేశంలో దళితులపై అణిచివేతలు, దౌర్జన్యాలు పెరుగుతూనే ఉన్నాయి.

సంస్కారాలు చేయడం అసాధ్యం. నెయ్యి, గంధపు చెక్క, అగర్ తదితర సుగంధ ద్రవ్యాలను దహన సంస్కారాలలో ఉపయోగించడం ఇకపై సాధ్యం కాదు. గంగా, యమునా జలాలు కలుషితమయ్యాయని నిపుణులంటున్నారు. ఖననం అశాస్త్రీయమైతే, హిందూ సన్యాసులకు సమాధి ఎందుకు అశాస్త్రీయమైనది కాదు? సమాధి, ఖననం రెండు ఒక్కటే. హిందూ దహన విధానం చాలా ఖరీదైనది. ఖనన పద్ధతి సరళమైనది, చవకైనది, సార్వత్రికమైనది. తీవ్ర చలి ప్రాంతాల వారు మృతులను ఎలా కాల్చివేయగలరు? చరిత్ర ప్రకారం, చనిపోయినవారిని ఖననం చేయడమే సరయిన పద్ధతి.[1]

## పునర్జన్మ సిద్ధాంతం

పునర్జన్మ సిద్ధాంతం విశ్వవ్యాప్తంగా ఆమోదించబడిన సిద్ధాంతంగా పరిగణన పొందుతుంది. హిందూ వేదాలు పునర్జన్మ గురించి స్పష్టంగా ప్రస్తావించలేదు. ఇది తర్వాతి కాలాల్లోని పరికల్పన. హిందూ సిద్ధాంతాల్లో ప్రతి ఒక్క వాదానికి ప్రతివాదం కనిపిస్తుంది. పునర్జన్మ విషయంలో కూడా ఈ వైరుధ్యం ఉంది. హిందూ మత గ్రంథాల్లో, సాధారణంగా మత విశ్వాసాలలో, ముఖ్యంగా గరుడ పురాణంలో కూడా స్వర్గనరకాల ప్రస్తావన ఉంది. హిందూ మతంలో మరణించిన వ్యక్తిని సూచించడానికి స్వర్గీయ అనే పదాన్ని ప్రయోగిస్తారు. గీతలో మరణాన్ని ఆత్మ పాత దుస్తులు వదలి కొత్త దుస్తుల రూపంలో కొత్త జీవితాన్ని స్వీకరిస్తుందని చెప్పడం ద్వారా అర్జునుడికి ఈ శరీరం నశ్వరమైనదనే జ్ఞానమివ్వడం జరిగింది. అలాగే యుద్ధంలో మరణిస్తే స్వర్గం లభిస్తుందని, గెలిస్తే రాజ్యలక్ష్మి లభిస్తుందని కూడా చెప్పడం జరిగింది. పునర్జన్మ, జన్మల పరంపర సిద్ధాంతం ఉన్నప్పటికీ, స్వర్గనరకాల మీద నమ్మకం కూడా మతపరంగా, నైతికంగా సాధారణంగా హిందువులతో ముడిపడి ఉంది. స్వర్గనరకాల మీద నమ్మకం ద్వారా మాత్రమే నైతికతకు ప్రేరణ సాధ్యమని పైన పేర్కొన్న గీత ప్రవచనాల వల్ల రుజువవుతోంది. అన్నింటికంటే ముఖ్యమైన విషయం అర్జునుడిని కేవలం నిమిత్తమాత్రుడిగా మార్చడం ద్వారా మనిషిని నైతిక ఆచరణలకు

1. ఇస్లామీయ ఖనన పద్ధతిలో మృతదేహానికి స్నానం చేయిస్తారు. కఫన్ లేదా శవవస్త్రం కప్పుతారు. పరిమళ ద్రవ్యాలు పూస్తారు. సగౌరవంగా శవపేటిక మీద ఉంచి శ్మశాన వాటికకు తీసుకువెళతారు. సగౌరవంగా ఖననం చేస్తారు. భర్త, సోదరుడు, తండ్రి లేదా కొడుకు తప్ప ఇతరులెవ్వరు చనిపోయిన మహిళ మృతదేహాన్ని తాకరాదు.

ప్రోత్సహించడం గీత ఉద్దేశ్యం. దీని కోసం కృష్ణుడు 'స్వర్గం' లభిస్తుందన్న ప్రేరణే ఏకైక పరిష్కారంగా భావించాడు. పునర్జన్మ అనేది హిందూ దర్శనంలో ఒక తాత్విక సూత్రం కావచ్చు, కానీ మతపరమైన విశ్వాసం రీత్యా స్వర్గనరకాలకే ధార్మిక ఆమోదం లభిస్తుంది. పునర్జన్మ సిద్ధాంతం తర్కానికి కూడా విరుద్ధమైనది. ఇది కలియుగం అని, పాపం పెరుగుతోందని చెబుతారు. సత్యయుగంలో పాపాలు తక్కువగా ఉండేవి. అలాగే, పుణ్యకార్యాల వల్ల మాత్రమే మానవ జన్మ ప్రాప్తిస్తుందని, పాపాల వల్ల జంతుజన్మ పొందడం జరుగు తుందని చెబుతారు. ఇదే నిజమైతే, కలియుగంలో పాపాలు తీవ్ర స్థాయికి చేరుకున్న ఈ రోజుల్లో మానవుల జనాభా నిరంతరం ఎలా పెరుగుతోంది? పాపి ఈ జన్మలో చేసిన పాపాన్ని గ్రహించలేనప్పుడు, అతను పునర్జన్మ గురించి తెలుసుకోవడం సాధ్యమా? అలా జరిగే అవకాశం లేదు. అలాంటి పరిస్థితిలో, పునర్జన్మ సిద్ధాంతం అర్థరహితమైనది, వ్యర్థమైనదిగా మారుతుంది. పునర్జన్మ నైతికతకు కూడా విరుద్ధమైనది. ఉదాహరణకు ఎవరి పుత్రుడైనా మరణించాడని అనుకుందాం, అతన్ని ఓదార్చడానికి మనం అక్కడికి వెళ్ళినప్పుడు అతన్ని ఓదారుస్తూ మీరు పునర్జన్మలో ఎవరి పుత్రుడినో చంపి ఉంటారు కాబట్టి ఇలా జరిగిందని దుఃఖిస్తున్న ఆ తండ్రికి చెప్పగలమా? దుఃఖి స్తున్న వ్యక్తిని సహనం వహించాలని ఓదార్చడమే సాధారణంగా మనమంతా చేస్తాం.

## జిజ్‌యాపై అభిప్రాయం

ముస్లిమేతరులకు జిజ్‌యా గురించి కూడా చాలా అపోహలున్నాయి. ఇస్లామీయ రాజ్యంలో ముస్లిమేతరులపై రాజ్య రక్షణ భారం లేదు. ఈ మినహాయింపు ఉన్నందున ముస్లిమేతరులు నామమాత్రపు రక్షణ పన్ను చెల్లించాలి. అప్పుడు వారిని రక్షించే బాధ్యత ముస్లింలపై ఉంటుంది. జిజ్‌యా చెల్లించిన ముస్లిమేతరులకు పూర్తి మత స్వేచ్ఛ లభిస్తుంది. దీన్నిబట్టి ఇస్లాంలో బలవంతంగా మతం మార్చడానికి అనుమతి లేదని తెలుస్తోంది. గురుస్థానంలో వున్న అగ్రవర్ణ బ్రాహ్మణులకు ఎల్లప్పుడు జిజ్‌యా నుండి మినహాయింపు లభించేదని చరిత్ర సాక్ష్యమిస్తోంది. అక్బర్, జహాంగీర్, షాజహాన్‌ల కాలంలో జిజ్‌యా పూర్తిగా ఎత్తివేయడం జరిగింది.[1]

1. ఇప్పుడు ముస్లిం దేశాలలో ఎక్కడా జిజ్‌యా లేదు. కానీ జిజ్‌యా గురించి దుష్ప్రచారం కొనసాగుతూనే ఉంది. రాజేంద్ర జీ వంటి మేధావులు వివరణలు ఇవ్వవలసి వస్తోంది. అనేక ముస్లిం దేశాలలో క్రైస్తవులు, హిందువులు ఉన్నారు. కానీ ఏ ముస్లిం దేశంలోనూ వారిపై జిజ్‌యా వేయడం లేదు. బంగ్లాదేశ్లో, పాకిస్తాన్లో హిందువులు ఉన్నారు. ఈ

# భారతదేశం, యూరపు దేశాల్లో ఇస్లాం ప్రభావం

భారతదేశం, యూరపు దేశాల్లో ఇస్లాం ప్రవేశించడానికి ప్రధాన కారణాలలో మానవ అవసరం, దైవిక ప్రేరణలున్నాయి. ఐరోపాలోకి ఇస్లాం ప్రవేశం, క్రైస్తవులు, ముస్లింల మధ్య యుద్ధానికి సంబంధించి క్రైస్తవులు క్రూసేడ్ యుద్ధాలంటారు. ముస్లిములు జిహాద్ అని పిలుస్తారు. ఈ యుద్ధం స్వరూపం ఏదైనప్పటికీ, ఐరోపాను అనాగరికత నుండి నాగరికత వైపు మళ్ళించడంలో ఇస్లాం ప్రధాన పాత్ర పోషించిందన్న వాస్తవాన్ని ముస్లిమేతర చరిత్రకారులు కూడా అంగీకరిస్తున్నారు. గ్రీకు సాహిత్యం, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, గణిత శాస్త్రాల సంరక్షణ, పురోగతులకు ముస్లింలు తోడ్పడ్డారు. వీటి ద్వారా ముస్లిములు ఐరోపాను ప్రకాశవంతం చేశారు. అత్యున్నతస్థాయి నైపుణ్యాలను సాధించారు. యూరపులో ముస్లింలు గొప్ప ఔదార్యం ప్రదర్శించారు (ఈ వాస్తవాన్ని ఐరోపాలోని చాలా మంది క్రైస్తవ పండితులు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు కూడా ఒప్పుకుంటారు)

ముస్లింల రాకవల్ల యూరప్ ఈ ప్రయోజనాలన్ని పొందింది, కానీ ముస్లింలతో సంబంధాలు తెగిపోయిన తర్వాత యూరప్ భౌతిక ప్రగతి శిఖరాలను అందుకుంది కానీ నైతిక పతనానికి గురయ్యింది. ఫలితాలు (నైతిక విలువలు అంతరించడం వల్ల) నేడు మన ముందు ఉన్నాయి. యావత్తు యూరప్, అమెరికా మద్యపానం, వ్యభిచారం, జూదం, దొంగతనం, దోపిడీ, హత్యానేరాలతో అలమటిస్తోంది.

---

దేశాలలో జిజ్‌యా పన్ను విధించడం లేదు. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లోని హిందువులపై జిజ్‌యా లేకపోవడానికి కారణం స్వయంగా అక్కడి చట్టమే అని హిందూ సోదరులకు చెప్పాలనుకుంటున్నాము. పాకిస్తాన్ చట్టం పూర్తి ఇస్లామీయ చట్టమైతే అక్కడి హిందువులకు మరిన్ని అధికారాలు లభిస్తాయి. వారి మతం, ఆచారాలు, భాష, సంస్కృతి లేదా నాగరికతలో జోక్యం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉండదు. ముస్లిమేతరుడు కూడా ఒక ముస్లిం మాదిరిగానే పాకిస్తాన్‌లో సమానస్థాయి పౌరుడిగా ఉంటాడు.

ఇస్లామీయ రాజ్యంలో పౌరులు మూడు రకాలు : (1) యుద్ధంలో పరాజితులైనవారు, కాని ఇస్లాం స్వీకరించడానికి తిరస్కరించినవారు. ఇలాంటి వారు రక్షణశిస్తు అంటే జిజ్‌యా చెల్లించాలి. (2) యుద్ధానికి ముందు సంధి చేసుకున్నవారు. సంధి షరతులు ఏవైనా కావచ్చు. ఆ షరతుల్లో జిజ్‌యా లేకపోతే, సంధి షరతులకు విరుద్ధంగా వారిపై జిజ్‌యా విధించే అవకాశం లేదు. (3) యుద్ధం లేదా సంధి వంటివి ఏవీ లేకుండా, ఇస్లామీయ రాజ్యంలో పౌరులుగా ఉన్న ముస్లిమేతరులపై కూడా జిజ్‌యా విధించే అవకాశం లేదు.

అనాగరికత స్థానంలో నాగరికత, ఆటవికత స్థానంలో మానవత ఐరోపాకు అవసరమైనప్పుడు దైవిక ప్రేరణతో ఇస్లాం అక్కడ ప్రవేశించింది. అక్కడ నైతికత, సమానతల కాంతిని వెదజల్లింది. మార్టిన్ లూథర్ వంటి మత సంస్కర్తలకు ప్రేరణగా నిలిచింది. అదేవిధంగా, భారతదేశంలోకి ఇస్లాం ప్రవేశించడంలోను మానవీయ అవసరం, దైవిక ప్రేరణలున్నాయి. భారతదేశంలో అప్పటికి అత్యున్నత నాగరికత అభివృద్ధి చెందింది. కానీ నాగరికత పరాకాష్టే సర్వస్వం కాదు. అనైతికత, రాజకీయ ఘర్షణలు, నిమ్నకులాల పట్ల ద్వేషం తారస్థాయికి చేరుకున్నాయి. భ్రష్టవైఖరులు విస్తరించాయి. బౌద్ధ మతాలు కూడా వ్యభిచారానికి, దురాచారాలకు, మంత్ర తంత్రాలకు కేంద్రాలుగా మారాయి. ఇదే పరిస్థితి హిందూ మతంలోను ఉండేది. వారు తమ ప్రాచీన మత ఆదర్శాలను మరిచిపోయారు. హృదయంలో సంకుచితత్వం, మస్తిష్కంలో కాపట్యం పెరిగిపోయాయి. భగవద్గీత మాటల్లో చెప్పాలంటే మతం పతనమయ్యింది. ఈ పరిస్థితిని దేవుడు సహించలేదు.

భారతదేశంలోకి క్రీ.శ. 712లో సింధు ప్రాంతంలో ఇస్లాం ప్రవేశించడం వెనుక ఈ సహజ కారణాలతో పాటు కొన్ని ఇతర యాదృచ్ఛిక రాజకీయ కారణా లున్నాయి. ముస్లింలు సింధ్‌ను సులభంగా జయించారో, అతికష్టమ్మీద జయించారో గాని సింధును జయించి తమ పరిపాలనను స్థాపించారు. కానీ కొంత కాలానికే అక్కడి హిందువుల పట్ల చాలా ఉదారహృదయులుగా మారడంతో పాటు వారికే అధికారాన్ని అప్పగించారు. దీనిని ఒక విధమైన స్నేహపూర్వక హెచ్చరికగా భావించాలి. కాని హిందువుల్లో మార్పు రాలేదు. మూడు వందల సంవత్సరాల పాటు దేవుడు వారికి అవకాశం ఇచ్చాడు. కాని మార్పు రాలేదు. వారు తమ మార్గంలోనే కొనసాగారు. దేవుని పేరిట దేవాలయాలలో అపార సంపద కూడగట్టేవారు. దేవాలయాలలో దేవదాసీల నాట్యగానాలు (లైంగిక వేధింపులు) మతాచారాలుగా మారిపోయాయి. ఫలితంగా వారు దైవాగ్రహానికి గురయ్యారు. భారతదేశంలోకి మహ్మూద్ గజ్నవి ప్రవేశించాడు. పదిహేడు సార్లు దాడి చేసి, గాఢ నిద్రలో ఉన్న హిందువులను కుదిపేశాడు. అలా కూడా హిందువులు తమ నిద్ర మత్తు వదల్లేదు. దేవుడు వారికి మరో నూట యాభై సంవత్సరాల వ్యవధి ఇచ్చాడు. అప్పటికీ మార్పు రాలేదు, చివరకు దేవుడు ముహమ్మద్ ఘోరి ద్వారా వారి రాజ్యాధికారాన్ని సమాప్తం చేయించాడు.[1]

1. అణచివేత, దుర్మార్గాలు, దోపిడీ, దౌర్జన్యాలు, వ్యభిచారం వంటి దుష్కర్మలను భూమిపై దేవుడు ఎక్కువ కాలం కొనసాగనివ్వడని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. సంస్కరణకు అవకాశం, వ్యవధి తప్పక లభిస్తాయి. ఈ వ్యవధి కొన్ని శతాబ్దాల పాటు లభించవచ్చు.

అనేక శతాబ్దాలు భారతదేశంలో ముస్లింల ఆధిపత్యం కొనసాగింది. నేడు ముస్లింలు భారతదేశాన్ని తమ స్వంత దేశంగా భావించి ఇక్కడ నివసిస్తున్నారు. భారతదేశంలో జన్మిస్తున్నారు, జీవిస్తున్నారు, మరణిస్తున్నారు. ప్రపంచం కూడా వారిని భారతీయులుగానే పరిగణిస్తుంది.

ముస్లింల ఉనికి భారతదేశానికి కూడా ప్రయోజనకరంగానే రుజువయ్యింది. ఉత్తరాది, దక్షిణాదిలను ఏకం చేసిన ఘనత కేవలం ముస్లిం సామ్రాజ్యాలది మాత్రమే. ముస్లింల సమానత్వం హిందువులపై ప్రభావం వేసింది. రామానుజుడు, రామానందుడు, నానక్, చైతన్య మొదలైన చాలా మంది సంస్కర్తలకు అది ప్రేరణ అయ్యింది. భక్తి ఉద్యమాలు మతోన్మాద వైఖరులను నియంత్రించాయి. సిక్కు మతం, ఆర్యసమాజాల్లో ఏకేశ్వరవాదం, సమానత్వభావన స్పష్టంగా కనిపిస్తాయి. ఇది ఇస్లాం ప్రభావం అనే చెప్పాలి. అనివార్య పరిస్థితులలో విడాకులు, భార్యకు, కుమార్తెలకు ఆస్తి హక్కుల వంటి సమానత్వానికి, సామాజిక సంస్కరణకు సంబంధించిన ప్రభుత్వ చట్టాల వెనుక ప్రేరణ కూడా ఇస్లాం నుంచే లభించింది.

## బహుభార్యాత్వం

బహుభార్యాత్వం అనే అంశం మీద ప్రవక్త ముహమ్మద్ (స)పై, ఇస్లాంపై అనేక ఆరోపణలు వినిపిస్తూ ఉంటాయి. ఇవి అత్యంత అనుచితమైన ఆరోపణలు. బహుభార్యాత్వం ప్రవక్త ముహమ్మద్ (స) కన్నా ముందు కాలాల్లోని ప్రవక్తలలో కూడా ఉంది. కాని ఇక్కడ వాటిని ప్రస్తావించడం లేదు. హిందూ మహాపురుషుల ఉదాహరణలు చూద్దాం.

హిందూ అవతారాలలో సంపూర్ణ అవతారంగా పరిగణించబడే కృష్ణుడికి ఎనిమిది మంది పట్టపురాణులు, పదహారు వందల మంది రాణులు ఉన్నారు. వారితో పాటు, చాలా మంది గోపికలతో, రాధతో ఆయనకున్న సాన్నిహిత్యం గురించిన వర్ణనలు కూడా ఉన్నాయి. కానీ, ఆయనను యోగిరాజ్‌గా విశ్వసిస్తారు, ఈ బహు

కానీ తర్వాత దైవ అవిధేయులు, శాపగ్రస్తులైన జాతిని పతనానికి గురిచేసి, దేవుడు సమర్థులు, సౌజన్యశీలురైన వారికి రాజ్యాధికారం ప్రసాదిస్తాడు. దీనిని ఒక విధమైన Check and Balance దైవిక చట్టంగా కూడా చెప్పవచ్చు. ఆక్రమణలను, యుద్ధాలను ఈ కోణంలో కూడా చూడాలి. కేవలం రాజకీయ, భౌతిక కోణాల్లో మాత్రమే చూడరాదు. (ప్రచురణకర్త)

భార్యాత్వానికి  ఆధ్యాత్మిక వివరణలు ఇస్తుంటారు. ఆయన జీవితాన్ని నీటిలో కలువలాంటి నిర్మల జీవితంగా భావిస్తారు. అంటే, ప్రత్యక్షంగా అనేకమంది భార్యలను కలిగి ఉన్నప్పటికీ, వారందరితో విరక్తుడిగా ఉండేవారని నమ్మడం. రాముడు ఏకపత్నీవ్రతుడు, కానీ అతని తండ్రి దశరథుడికి బహుభార్యలున్నారు. మహాభారత నాయకుడైన అర్జునుని తండ్రికి కూడా ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలు ఉండేవారు.

ఇస్లాం ప్రవక్తకు సంబంధించినంతవరకు, ఆయన 25 సంవత్సరాల వయస్సులో 40 ఏళ్ల వితంతువు ఖదీజా (రజి)ను వివాహం చేసుకున్నారు. మధ్య వయస్కుడయ్యే వరకు (50 సంవత్సరాల వయసు వరకు) ఆమె మాత్రమే ఆయనకు భార్యగా ఉన్నారు. మధ్యవయస్కుడయ్యే వరకు, ఇంద్రియ సుఖాల కోరికలు అంతరించే  వయస్సు వరకు ఆమె ఒక్కరే ఆయనకు భార్య. ఆయన చేసుకున్న ఇతర వివాహాలు పరిశీలిస్తే, ఆ మహిళల రక్షణ అవసరాల కోసం లేదా ఇస్లామీయ ప్రయోజనాల కోసం చేసుకున్నారని స్పష్టమవుతుంది. ఈ వివాహాలకు కారణం భోగలాలసత కాదని స్పష్టం అవుతుంది. దీనికి అనేక రుజువులున్నాయి. ఒక నిదర్శనమేమిటంటే – ప్రవక్త పత్ని ఆయిషా (రజి)కు ఒక రాత్రి ఆయన పడకపై కనిపించలేదు. ఆమెకు అనుమానం వచ్చింది. ఆయన మరో భార్య వద్దకు వెళ్ళారేమో అని అనుమానించారు. కాని లేచి చూస్తే ఆయన నుదురు నేలకు ఆనించి సజ్దాలో దైవాన్ని ప్రార్థిస్తూ కనిపించారు.[1]

---

1. ప్రవక్త ముహమ్మద్ (స) బహుభార్యల గురించి రచయిత రాజేంద్ర చక్కని వివరణ ఇచ్చారు.  అయితే, ముహమ్మద్ (స)కు సంబంధించిన ఈ విషయంలో మరింత స్పష్టమైన వివరణ అవసరమని భావిస్తున్నాము. రచయిత రాజేంద్ర  నారాయణ్ లాల్ చెప్పినట్లుగా, మహిళల రక్షణ, ఇస్లామీయ ప్రయోజనాలు ఈ వివాహాల వెనుక ఉన్నాయి. దీనికి సంబంధించిన కొన్ని వివరాలు క్రింద చూడండి:

(అ) ముహమ్మద్(స)  కాలంలో ఆ ప్రాంతం,  ఆ సమాజం ధార్మికంగా, నైతికంగా, రాజకీయంగా పూర్తి క్షీణావస్థలో ఉంది. సంపూర్ణ విప్లవం ద్వారా ఒక ఆదర్శవంతమైన రాజ్యాన్ని, సమాజాన్ని నెలకొల్పడం అత్యంత ఆవశ్యకమే కాదు అత్యంత కఠినమైన పనిగా కూడా మారింది. కాని పరిస్థితి ఎలా ఉందంటే, దేశం మొత్తం ముహమ్మద్ (స)ను వ్యతిరేకిస్తోంది. ఈ దశలో స్నేహితులు, సహాయకులుగా ఉన్నవారితో సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవలసిన అవసరం ఉంది. అలాగే శత్రువులుగా ఉన్నవారు స్నేహితులు కాకపోయినా వారి శత్రుత్వాన్ని వీలైనంత వరకు తగ్గించాలి.

(ఆ) ముహమ్మద్ (స) ఇద్దరు భార్యలు–హజ్రత్ ఆయిషా (రజి), హజ్రత్ హఫ్సా (రజి)లు ఆయనకు అత్యంత సన్నిహిత మిత్రులైన  హజ్రత్ అబూబక్ర్ (రజి), హజ్రత్ ఉమర్

# సాధారణ ప్రజలకు బహుభార్యాత్వ అనుమతి

ఇస్లాం పురుషుడికి నలుగురు భార్యలను వివాహం చేసుకునే అనుమతి ఇచ్చింది. దీనిపై అభ్యంతరాలు చెప్పేవారు ఈ అనుమతి వెనుక ఉన్న సామాజిక వివేచనను అర్థం చేసుకోవడం లేదు. మొదటి విషయం, నలుగురు భార్యలను వివాహం చేసుకోవాలన్నది ఆదేశం కాదు. కేవలం అనుమతి మాత్రమే. రెండవ విషయం,

---

(రజి)ల కుమార్తెలు. హ్రజత్ జైనబ్ (రజి) ప్రవక్త ముహమ్మద్ (స) మేనత్త కుమార్తె. ఆయన ఆమెను తన సేవకుడు, పెంపుడు కుమారుడు హ్రజత్ జైద్ (రజి)తో పెళ్ళి చేయించారు. కాని జైనబ్ (రజి), జైద్(రజి)ల మధ్య పొసగలేదు. వారు విడాకులు తీసుకున్నారు. జైద్ (రజి) ముహమ్మద్ (స) సేవకుడు మాత్రమే కాదు పెంపుడు కుమారుడు కూడా అని చెప్పు కున్నాం. అరబ్బుల్లో పెంపుడు కుమారుడిని, స్వంత కుమారుడిగా పరిగణించే దురా చారం ఉండేది. అందువల్ల పెంపుడు కుమారుడి వితంతు భార్య లేదా విడాకులు తీసు కున్న భార్యను పెళ్ళి చేసుకోవడం నిషిద్ధంగా ఉండేది. ఇస్లాం ఈ దురాచారాన్ని తిరస్క రించింది. ఆచరణాత్మక స్థాయిలో ఈ దురాచారాన్ని నిర్మూలించడానికి జైనబ్ (రజి)ను ప్రవక్త (స) వివాహం చేసుకున్నారు. ఈ వివాహం వల్ల ఆ కాలపు సమాజానికే కాదు, భవిష్యత్తు తరాలు కూడా ఈ ఉదాహరణను స్వీకరించాయి. పెంపుడు కుమారుడు, స్వంత కుమారుడి మధ్య తేడా స్పష్టం చేయడం జరిగింది. రెహానా (రజి), జువేరియా (రజి), సఫియా (రజి)లు యూదు నేతల కుమార్తెలు. యూదులు ప్రవక్తతో శత్రుత్వం వహించేవారు. ఈ ముగ్గురు మహిళల గౌరవాదరాల రక్షణకు, యూదులతో వైరాన్ని తగ్గించడానికి ముహమ్మద్ (స) ఈ ముగ్గురిని వివాహం చేసుకోవడం అవసరమైంది. ఉమ్మె హబీబా (రజి) మక్కా ముఖ్య నాయకుడు, ప్రవక్తకు తీవ్ర శత్రువు అయిన అబూ సుఫ్యాన్ కుమార్తె. ఆమెను వివాహం చేసుకున్న తరువాత అబూ సుఫ్యాన్ శత్రుత్వం తగ్గింది. హ్రజత్ ఉమ్మె సలమా (రజి) మక్కా సర్దారు, ప్రవక్త (స)కు తీవ్రవిరోధి కుమార్తె. ఈ వివాహాల తరువాత సంబంధిత తెగలు ఇస్లాం పట్ల వైరాన్ని తగ్గించుకున్నాయి.

(ఇ) ముహమ్మద్ (స) దేవుని తరఫున ఏ ధార్మిక, నైతిక, సాంస్కృతిక విప్లవం కోసం నియ మించబడ్డారో ఆ ఉద్దేశ్యాలు పూర్తవ్వాలంటే కేవలం పురుషులకు మాత్రమే విద్యాశిక్షణ లిస్తే సరిపోదు. మహిళల విద్యాశిక్షణలు కూడా అవసరం. ఇస్లామీయ సభ్యత ప్రకారం స్త్రీ పురుషుల మిశ్రమ కార్యకలాపాలు నిషిద్ధం. కాబట్టి ముహమ్మద్ (స) మహిళలకు ప్రత్యక్షంగా బోధించడం సాధ్యం కాదు. అలాగే మహిళల ప్రత్యేక విషయాలు కూడా ఉంటాయి. వాటి గురించి మహిళలు పురుషులకు చెప్పలేరు. పురుషులు వారికి నేర్పిం చలేరు. ఈ అవసరాలను తీర్చడానికి ప్రవక్త ముహమ్మద్ (స) వివిధ వయస్కులు, విభిన్న సామర్థ్యాలున్న మహిళలను వివాహం చేసుకుని తన భార్యలుగా వారికి బోధనా శిక్షణలు

నలుగురు భార్యలకు అనుమతి ఏ పరిస్థితుల్లో, ఎలాంటి ఉద్దేశ్యాలతో ఇచ్చారన్నది చూడాలి. ఇస్లాంకు ముందు అరబ్బుల్లో అసంఖ్యాక భార్యల ఆచారం ఉండేది. పదేసి వివాహాలు చేసుకునేవారు. కాని భార్యల అవసరాలు తీర్చలేకపోయేవారు. వారిని బాధించేవారు. వారిపై దౌర్జన్యాలకు పాల్పడేవారు. భార్యలందరితో న్యాయంగా, సమానంగా వ్యవహరించేవారు కాదు. ఈ చెడులను నిర్మూలించడానికి, నలుగురి కన్నా ఎక్కువ భార్యలు ఉండరాదనే నిషేధం విధించారు. అంతేకాదు, నలుగురు భార్యల పట్ల సమానంగా, న్యాయంగా వ్యవహరించాలన్న షరతు కూడా విధించడం జరిగింది.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే, బహుభార్యాత్వం సమాజంలో సర్వసామాన్యమై ఉన్నప్పుడు, ఆ సమాజంలో పురుషుడిని ఒకరి కంటే ఎక్కువ భార్యలను కలిగి ఉండకూడదని కఠినంగా ఆదేశిస్తే, ఆ ఆదేశాన్ని పాటించడం కష్టమవుతుంది. రహస్యంగా, దొంగచాటుగా ఈ ఆదేశాన్ని ఉల్లంఘించడం జరుగుతుంది (నేటి సోకాల్డ్ 'నాగరిక' సమాజంలో ఇలాంటి చాలా ఉదాహరణలున్నాయి). ఇస్లాం కోరుకునే పరిశుద్ధ సమాజ నిర్మాణం జరగదు. ఒకరి కన్నా ఎక్కువ భార్యల అవసరం ఆ కాలంలోని అరబ్బు సమాజానికే కాదు, నేటి అరబ్బు సమాజానికి కూడా ఉండవచ్చు. ఇతర దేశాలలోని సమాజాలకు కూడా ఉండవచ్చు. మన సమాజానికి కూడా ఉండవచ్చు, సమాజాన్ని స్వచ్ఛంగా, పరిశుద్ధంగా ఉంచడానికి దూరదృష్టితో కూడుకున్న

---

అందించారు. వారి ద్వారా మహిళలకు వారి ప్రత్యేక విషయాల్లో అవసరమైన మార్గదర్శకత్వం అందించగలిగారు. ముహమ్మద్ (స) భార్యలలో హజ్రత్ ఆయిషా (రజి), హజ్రత్ ఉమ్మె సలమా(రజి) గొప్ప విద్వత్తు కలిగినవారయ్యారు. ముహమ్మద్ (స) చెప్పిన మాటలను హదీస్ అని పిలుస్తారు, హదీసు పుస్తకాలలో ప్రవక్త భార్యలు వివరించిన హదీసులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

ముహమ్మద్ (స) బహువివాహాల వెనుక ఉన్న కారణాలివి. ముహమ్మద్ (స)కు తన కోరికలపై పూర్తి నియంత్రణ ఉండేది. ఆయన తన కన్నా పెద్ద వయసున్న మొదటి భార్య ఖదీజాతో 25 సంవత్సరాలు దాంపత్య జీవితం గడిపారు. ఆమె మరణం తరువాత, ఆయన సౌదా (రజి)ను వివాహం చేసుకున్నారు. ఆమె కూడా వృద్ధ వితంతువు. మిగిలిన వివాహాలన్నీ 53 సంవత్సరాల వయస్సు తర్వాత, లైంగికేచ్ఛ ఉండని వయసులో జరిగిన వివాహాలని గమనించాలి. ఈ భార్యలు ఉన్నప్పటికీ ఆయన రాత్రులు సుదీర్ఘ సమయం దైవారాధనలో నిలబడే వారు. ఆయన కాళ్ళు కూడా వాచిపోయేవి.

అనుమతిగా ఇస్లాంలోని బహుభార్యాత్వాన్ని వివేకం వివేచన ఉన్న ప్రతి వ్యక్తి అంగీకరిస్తాడు. [1]

ఈ చర్చ వల్ల అర్థమయ్యేది ఏమిటంటే, బహుభార్యాత్వం (నలుగురు భార్యల) అనుమతి ద్వారా పదేసి మంది భార్యలను వివాహం చేసుకోకుండా నిషేధించడం జరిగింది. మరోవైపు సమాజంలో వ్యభిచారం, దేహవ్యాపారం, ఉంపుడుగత్తెలను ఉంచుకోవడం వంటి రుగ్మతల తలుపులను కూడా మూసివేయడం జరిగింది. నాలుగు భార్యల అనుమతి షరతుతో కూడుకుంది. భార్యల మధ్య సమానత్వం, న్యాయం పాటించాలనే షరతు ద్వారా అనవసరమైన వివాహాలను కూడా అడ్డుకోవడం జరిగింది. ఈ షరతు తరువాత నలుగురిని పెళ్ళాడ్డం కూడా ఆగిపోయింది.

గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే, ఇది ఒక మతపరమైన నియమం, ఆ సమాజం కూడా ధర్మపరాయణత నిండిన సమాజం. కాబట్టి ఆ సమాజం ఈ నియమాన్ని ఖచ్చితంగా పాటించేది. కానీ ఒకే భార్య అని వాదించేవారి వ్యవహారశైలి ఎలా ఉంది? ఈ సమాజాల పరిస్థితి ఏమిటి? యూరప్, అమెరికాలోని క్రైస్తవులు ఇస్లాంలోని బహుభార్యాత్వానికి వ్యతిరేకంగా అత్యధిక ప్రచారం చేశారు.

ఈ దేశాలలో ఒకరి కంటే ఎక్కువ భార్యలను నిషేధించారు. కానీ వ్యభిచారానికి తలుపులు బార్లా తెరిచేశారు. ఉంపుడుగత్తెలు, సొసైటీ గర్ల్స్, కాల్ గర్ల్స్, వేశ్యలు, క్లబ్బులు, హొటళ్ళు అన్నీ ఉన్నాయి. సాధారణ ప్రజల్లోను వ్యభిచారం, ప్రముఖుల్లోను వ్యభిచారం, పార్లమెంటు సభ్యుల్లోను వ్యభిచారం, మంత్రుల్లోను వ్యభిచారం, మతాధికారుల్లోను వ్యభిచారం విస్తరించింది. పురుషుల పరిస్థితే మహిళలది కూడాను. వ్యభిచార రుగ్మత సోకని స్త్రీలున్న వర్గమేదీ మిగల్లేదు. వ్యభిచారం ఇంతగా విస్తరించినప్పుడు ఒకరి కంటే ఎక్కువ భార్యల అవసరమేముంది? ఇప్పుడు అస్సలు ఒక్క పెళ్ళయినా చేసుకోవడం ఇష్టం లేని పురుషులు స్త్రీలు చాలా మంది ఉన్నారు. వివాహం చేసుకోవడానికి కూడా ఇష్టపడని స్త్రీ పురుషులు పుట్టుకొస్తున్నారు. స్వేచ్ఛగా

---

1. వేశ్యావృత్తి, వ్యభిచారం, ఒళ్ళమ్ముకోవడం, అక్రమ సంబంధాలు, లైసెన్సుడు వేశ్యా గృహాలు, 'కాల్-గర్ల్స్' వంటి దుష్ట సంప్రదాయాలు - వీటివల్ల తలెత్తే అసంఖ్యాక నైతిక రుగ్మతలు, సామాజిక నేరాలు, సమస్యలు, సమాజానికి వాటిల్లే హాని ఇవన్నీ బహుభార్యాత్వంపై తీవ్ర నిషేధాల పరిణామాలే. ఇస్లాం బహుభార్యాత్వానికి అనుమతి ఇచ్చి ముస్లిం పురుషులను, స్త్రీలను, కుటుంబాలను, సమాజాన్ని ఈ దుష్పరిణామాల నుంచి కాపాడింది. (ప్రచురణకర్త)

జీవించాలని, ఆనందాలు జుర్రుకోవాలని భావిస్తున్నారు. మన దేశంలోని పరిస్థితిని కూడా మనం చూడాలి. మన సమాజం కూడా ఈ చెడులకు దూరంగా లేదు. మతాన్ని, ధర్మాన్ని ఇప్పుడు ఎవ్వరు పట్టించుకోవడం లేదు. నీతినియమాలు ప్రభావం లేనివిగా మారాయి.[1]

---

1. ఇస్లాం సమాజాన్ని అన్ని విధాలా పరిశుద్ధంగా ఉంచాలని కోరుతుంది. వ్యభిచారం కుకర్మల్లో అత్యంత నీచమైనది. ఇస్లాం వ్యభిచారాన్ని మతపరంగా పాపంగాను, నైతికంగా, సామాజికంగా అపరాధంగాను ప్రకటించింది. ఈ నేరానికి కఠినమైన శిక్షను విధిస్తుంది. దురదృష్టం ఏమిటంటే, సమాజాన్ని పరిశుద్ధంగా ఉంచడానికి, మహిళల మానమర్యాద లను కాపాడ్డానికి తగిన సామర్థ్యం ఉన్న ఈ శిక్షను అనాగరిక, ఆటవిక శిక్షగా ముద్రవేసి ఇస్లాంను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలు ప్రతి స్థాయిలోను జరిగాయి. కాని, ఇప్పుడు (1999) భారతీయ రాజకీయ నేతలు, బిజెపి సీనియర్ నాయకులు కూడా లోక్‌సభలో అత్యాచారానికి మరణశిక్ష చట్టం తీసుకురావాలని అన్నారు.

   యూరపులోని సోకాల్డ్ నాగరిక, మానవ ప్రేమికులు ఈ శిక్షను క్రూరం, అమానుషం అంటున్నారు. వ్యభిచారం కుకర్మ, నిషిద్ధం అని ఒప్పుకోడానికి వారు సిద్ధంగా లేరు. అందువల్ల ఇలా అంటున్నారు. వ్యభిచారం యూరపు జీవితంలో ప్రధాన భాగంగా మారింది. దాదాపు మూడున్నర సంవత్సరాల క్రితం డబ్లిన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక ప్రొఫెసర్ నేతృత్వంలో యూరపునకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత న్యాయ నిపుణుల బృందం ఇస్లామిక్ చట్టాన్ని, ముఖ్యంగా శిక్షాస్మృతిని అధ్యయనం చేయడానికి, దానిపై చర్చించడానికి సౌదీ అరేబియాకు వచ్చింది. నేర విభాగాలు సందర్శించే పూర్తి అనుమతి వారికి లభించింది. ఆ దేశంలో నేరాల పరిస్థితి ఏమిటో తెలుసుకునే పూర్తి అవకాశాలు ఇచ్చారు.

   ఈ దేశంలో నేరాల రేటు ఎంత ఉందో చూసి వారు ఆశ్చర్యపోయారు. అరబ్బు నగరాలతో సమాన జనాభా ఉన్న ఐరోపాలోని నగరాల్లో నేరాల సంఖ్య నిష్పత్తి చూస్తే, యూరపులో వెయ్యి నేరాలు జరుగుతుంటే అరబ్బు నగరాల్లో ఒక్క నేరంగా ఉంది. అంటే ఐరోపాలో వెయ్యి నేరాలు జరిగితే అరేబియాలో ఒక్క నేరం జరుగుతుంది. ఆ యూరపు నిపుణుల బృందం దృష్టిలో వ్యభిచారానికి రాళ్లతో కొట్టి చంపే శిక్ష, దొంగతనం చేసిన వాడి చేతిని నరికివేసే శిక్షలు అమానుషమైనవి. అరబ్బు ప్రాంతంలో ఒక వ్యక్తికి కోటి డాలర్లు ఇచ్చి ఏ ప్రాంతానికైనా ఒంటరిగా సురక్షితంగా పంపవచ్చని ఆ బృందానికి తెలిసింది. కాని ఐరోపాలో ప్రతిరోజూ దోపిడీలు జరుగుతాయి, హత్యలు జరుగుతాయి. ఇస్లామీయ చట్టం గుణగణాలు, ప్రభావాల గురించి తెలుసుకుని వారు తమ అభిప్రాయాల పట్ల సిగ్గుపడ్డారు. తమ దేశాలకు తిరిగి వెళ్లి విలేకరుల సమావేశంలో ఇస్లామీయ చట్టం మాత్రమే నేరాలను నిర్మూలించగలదని, నిస్సందేహంగా ముస్లింలు తమ చట్టాల పట్ల గర్వించడం సముచితమేనని అన్నారు.

హిందువులు ఆలోచించాలి. దేవుని సంపూర్ణ అవతారం శ్రీకృష్ణుడు కూడా బహుభార్యలను కలిగి ఉన్నారు. చాలా మంది పౌరాణిక, చారిత్రక మహాపురుషులు కూడా బహుభార్యలను కలిగి ఉన్నారు. హిందూ ధర్మంలో బహుభార్యాత్వంతో పాటు బహు భర్తృత్వం కూడా ప్రస్తావించబడింది. పాండవుల భార్య బహుపతులను కలిగి ఉంది. ఇస్లాంలోని బహుభార్యాత్వ అనుమతి సమాజంలో అక్రమ సంబంధాలు, వేశ్యావృత్తి, ఉంపుడుగత్తెల రుగ్మతల నుంచి సమాజాన్ని కాపాడుతుందని, ఈ సంబంధాల వల్ల జన్మించే నిర్దోషులైన సంతానానికి సంబంధించి కూడా సమాజానికి ఇది శ్రేయస్కరమైనదని, గౌరవప్రదమైనదనీ వివేకవివేచనలున్న వారు ఎవరైనా సునాయాసంగా గ్రహించగలరు.

---

చివరగా, హిందూ మతంలో వ్యభిచారానికి సంబంధించిన చట్టాలను కూడా చూద్దాం. మనుస్మృతిలో  కొన్ని నియమాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి

ఒక శూద్రుడు ద్విజకులానికి చెందిన (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) స్త్రీతో  వ్యభిచరిస్తే అతనికి మరణశిక్ష విధించాలి. (మనుస్మృతి, 8/359)

పరాయి స్త్రీలతో వ్యభిచరించిన పురుషులకు  భయపెట్టే శిక్షలు రాజు విధించాలి. అంగచ్ఛేదాలు విధించి, దేశం నుండి బహిష్కరించాలి. (8/352)

ఇంటి యజమాని తన భార్యతో మాట్లాడటం నిషేధించిన వ్యక్తి అతని భార్యతో మాట్లాడకూడదు. అతను మాట్లాడినట్లయితే, పదహారు మాషాల (దాదాపు తులం) బంగారం జరిమానా చెల్లించాలి. అయితే ఇది నాట్యకత్తెలు, లేదా భార్య ద్వారా జీవనోపాధి పొందే వ్యక్తులకు వర్తించదు. ఎందుకంటే వారు తమ స్త్రీలను తార్చడం చేస్తారు. (8/362)

ఒక కన్యపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి మరణదండన విధించాలి. కానీ ఆ అమ్మాయి ఇష్టంతో లైంగిక సంబంధం పెట్టుకుంటే, ఆమె స్వకులానికి చెందినదయితే మరణదండన లేదు. (8/364)

ఉత్తమ కులానికి చెందిన వ్యక్తితో  లైంగిక సంబంధం కోరుకుని అతన్ని సేవించే అమ్మాయిని శిక్షించరాదు. కానీ హీన కులస్తుని వద్దకు  వెళ్ళే అమ్మాయిని కఠినంగా నిరోధించాలి. (8/365)

ఉత్తమ కులానికి చెందిన అమ్మాయితో లైంగిక సంబంధం పెట్టుకున్న హీనకులస్తుడు మరణదండనకు అర్హుడు. అయితే అతను తన కులానికి చెందిన అమ్మాయితో సంబంధం పెట్టుకుంటే ధనపరిహారం చెల్లించి, ఆమె తండ్రి పరిహారంతో సంతృప్తి చెందినట్లయితే, ఆమెను వివాహం చేసుకోవచ్చు. (8/366)

# ఇస్లాంలో పరదా కట్టుబాటు:

ఇస్లాం విధించిన పరదా పద్ధతి స్త్రీపురుషుల మధ్య భేదం చూపిస్తుంది, ఇది మహిళలపై వివక్ష, వారి ఆరోగ్యానికి, ప్రగతికి ప్రతిబంధకం అనే విమర్శలు వినిపిస్తుంటాయి. నా సమాధానం ఏమిటంటే ఇస్లాంలోని పరదా పద్ధతి సముచిత మైనది, సహేతుకమైనది, ఖచ్చితంగా అవసరమైనది. స్త్రీపురుషుల సమానత్వానికి సంబంధించి మహిళలకు ఆస్తి హక్కు, అవసరమైతే విడాకులు తీసుకునే హక్కు, ఏ సందర్భంలోనైనా మహర్ (స్త్రీ ధనం వివాహ సమయంలో వధువుకు ఇవ్వడం జరుగు తుంది) పొందే హక్కును ఇచ్చింది ధర్మం ఇస్లాం. దీనికి విరుద్ధంగా, హిందువులలో వితంతువులను వారి స్వంత ఉనికి లేనట్లుగా సతీసహగమనం చేయించేవారు. ఇస్లాంలో వితంతువులకు తమ భర్త మరణానంతరం నాలుగు నెలల పది రోజుల వ్యవధి తర్వాత తిరిగి వివాహం చేసుకుని సంతోషకరమైన జీవితాన్ని గడిపే హక్కు ఉంది.[1] విడాకులు పొందిన మహిళలు మూడు నెలల పది రోజుల తరువాత తిరిగి వివాహం చేసుకోవచ్చు.

హిందూ మతానికి చెందిన వితంతువుకు తిరిగి వివాహం చేసుకోవడానికి లేదా సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి హక్కు లేదు. ఆమె తన సొంత కుటుం బంలో నిరాదరణకు, పరాభవాలకు గురై బతకాల్సి వచ్చేది. క్రైస్తవ దేశాలలో మహిళల ఆస్తి హక్కులు ఇంకా పూర్తిగా గుర్తించబడలేదు. మహిళలకు అసలు ఆత్మ ఉందా లేదా అనే చర్చలు ఒకప్పుడు యూరపులోని క్రైస్తవ పండితుల మధ్య జరిగాయి.

మహిళల ఆరోగ్యానికి, వారి పురోభివృద్ధికి పరదా ప్రతిబంధకం ఎలా అవుతుంది? మహిళలు పరదా లేకుండా తిరిగితేనే ఆరోగ్యంగా ఉంటారా? స్త్రీలు పరదా పాటించాలన్న ఆదేశం మాత్రమే ఉంది. పరదాలో ఉండి ఆమె తన భర్తతో పాటు ఎక్కడైనా వెళ్ళవచ్చు. ఎలాంటి ఆంక్ష లేదు.

ముస్లిం మహిళలు ఆరోగ్యంగా లేనట్లయితే ఆరోగ్యవంతమైన పిల్లలకు ఎలా జన్మనిస్తారు? ముస్లింలు ఆరోగ్యంగా ఎలా ఉండగలరు? ముస్లింలు సాధించిన సత్వర

---

1. ఈ నాలుగు నెలల పదిరోజుల వ్యవధి ఎందుకు విధించారంటే, స్త్రీ ఒకవేళ గర్భం ధరించిన ప్రారంభదినాల్లోనే వితంతువైపోతే (లేదా విడాకులైపోతే) ఈ వ్యవధిలో ఆమె గర్భవతి అనే విషయం స్పష్టమైపోతుంది. ఆ తర్వాత ఆమె వివాహం చేసుకుంటే ఆ దాంపత్యంలో మాజీ భర్త వల్ల కలిగిన సంతానం ఎవరన్నది స్పష్టమవుతుంది. సంక్లిష్టమైన సమస్యలేవీ ఉత్పన్నం కావు.

విజయాలు చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. ఈ విజయాలు సాధించిన వారు ముస్లిం తల్లుల పిల్లలే కదా. ఆ కాలంలో మరింత కఠినంగా పరదా నియమాలు పాటించేవారు.

మహిళల ఆరోగ్యం, పురోగతి, సమానత్వం మొదలైన ప్రశ్నలు జన్మించింది మహిళలను కామవాంఛల సామగ్రిగా మార్చిన యూరపులో. ప్రతి మతం, ప్రతి ప్రాచీన నాగరికతలో సంపాదించడం పురుషుల పనిగాను, ఇంటిని చూసుకోవడం స్త్రీల కార్యక్షేత్రంగాను ఉండేది. హిందూ మతంలో కాని, నాగరికతలో కాని సంపాదన భారం మహిళలపై ఎప్పుడైనా ఉందా? స్త్రీ పురుషుల సమానత్వం, సమాన హక్కుల గురించి వాదించేవారు మొదట స్త్రీ పురుషులను సమానం చేసేయమని దేవుడిని అడగాలి. పురుషులు కూడా పిల్లలకు జన్మనివ్వాలి. కేవలం స్త్రీలు మాత్రమే పురిటినొప్పులు ఎందుకు భరించాలి?

శరీరధర్మ శాస్త్రం, మనస్తత్వ శాస్త్రాల ప్రకారం స్త్రీలు శారీరకంగా, మానసికంగా కోమలంగా ఉంటారు. పరదా వారి రక్షణకు ఉపయుక్తమైనది. పరదా వారిని చెడు చూపు నుంచి కాపాడుతుంది. చెడు చూపు పర్యవసానాలు కొన్నిసార్లు భయంకరంగా ఉంటాయి. అపహరణలు, అత్యాచారాలు చెడు చూపు ఫలితాలే. పత్యం మానేసి రోగానికి గురికావడంలో వివేకం లేదు.[1]

---

1. స్త్రీల స్త్రీత్వం, సతిత్వాలకు ఎలాంటి విలువ ఇవ్వని సోకాల్డ్ మహిళా పరిరక్షకులే పరదా పద్ధతిపై అభ్యంతరాలు లేవనెత్తుతుంటారు. ఇలాంటి వారు స్త్రీలను కేవలం కామవాంఛల సాధనాలుగా మాత్రమే చూస్తారు. ఇలాంటి వారు ఇస్లాంలోని పరదా పద్ధతి ఔచిత్యాన్ని, ప్రాముఖ్యతను ఏం అర్థం చేసుకుంటారు?

స్త్రీలో ప్రకృతి సిద్ధంగా పురుషుడిని తనవైపు లాగే ఆకర్షణ ఉంది. సహజంగానే పురుషుడు స్త్రీ పట్ల ఆకర్షితుడౌతాడు. పరదా రాహిత్యమే నిజానికి వ్యభిచారానికి తలుపులు తెరుస్తుంది. పరదా ద్వారా ఈ తలుపులను ఇస్లాం మూసేసింది. స్త్రీకి అత్యంత విలువైనది శీలసంపద. ఇస్లాం దీన్ని కాపాడుతుంది. పరదా విరోధులు దీనికి శత్రువులు. భారతదేశంలో పరదా గురించి పూర్వం తెలియదు. ముస్లిములు భారతదేశానికి వచ్చినప్పుడు, ముస్లిం మహిళలు పరదా పాటించడాన్ని హిందువులు చూశారు, పరదా ఉపయోగాన్ని అర్థం చేసుకున్నారు, పరదా పద్ధతి హిందువులలో ప్రాచుర్యం పొందింది. కాని ప్రస్తుతం హిందువులు పరదా పాటించడమంటే ముస్లిములను అనుకరించడం, మన ప్రాచీన నాగరికతకు వ్యతిరేకం అనే భావనతో పరదా మానేశారు. చివరకు అమ్మాయిలు ఇప్పుడు ఓణీలు ధరించడం కూడా మానేశారు. బ్లౌజులు చీరలు ధరించే వారి వస్త్రధారణ కూడా ఎలా మారిందంటే, బ్లౌజుపైన మెడ నుంచి లోనెక్ వరకు

ఇస్లాం పంది మాంసాన్ని నిషేధిస్తుంది కానీ ఆవు మాంసాన్ని నిషేధించలేదు, ఇది సముచితమా అని కొందరు ప్రశ్నిస్తారు. ఈ ప్రశ్న బుద్ధికి విరుద్ధమైనది.

పందికి, ఆవుకు మధ్య తేడా సగటు మనుషులందరికీ తెలుసు. పంది అసహ్యకరమైన జంతువు. ఆవులను హిందువులు, ముస్లింలు అందరూ తమ ఇళ్ళలో పెంచుతారు. కాని పందులు ఎంత మురికిగా ఉంటాయో అందరికీ తెలుసు. అందువల్లనే పందిమాంసాన్ని ఇస్లాం నిషేధించడంలో ఎంతైనా ఔచిత్యం ఉంది.[1]

---

అనాచ్ఛాదితం, ఛాతీ నుంచి నాభి వరకు అనాచ్ఛాదితం. పొట్ట, వీపు కనిపిస్తూ, శరీరానికి అతుక్కుపోయిన చీర, అవయవసౌష్టవమంతా కనిపించే వస్త్రధారణ. దీని ఫలితమే మనం వార్తాపత్రికల్లో చదివే అపహరణలు, అత్యాచారాల వార్తలు. పరిస్థితి ఇలాగే కొనసాగితే యూరప్-అమెరికా మాదిరి స్థితి భారతదేశంలోను తలెత్తుతుంది. పాశ్చాత్య దేశాల్లో ఇప్పుడు మనిషి పశువుగా మారాడు. పైగా పశువుకన్నా హీన స్థితికి దిగజారాడు.

1. రాజేంద్ర నారాయణ్ లాల్ గారు గోవధ గురించి క్లుప్తంగా మాత్రమే మాట్లాడారు. కానీ ఈ ప్రశ్నకు సంబంధించి జీవహింస అనే అభ్యంతరం కూడా ప్రముఖంగా వినిపిస్తుంది. జీవహింసను ఇస్లాం అనుమతించిందన్న విమర్శలు వినిపిస్తాయి. అందువల్ల, ఈ విషయాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. నిజానికి గోరక్ష అనే అంశాన్ని మరింత భావోద్వేగాలు రెచ్చగొట్టేదిగా మార్చడానికి ఈ విషయాలు ప్రస్తావిస్తుంటారు. నిజానికి జీవహింసకు సంబంధించిన ఈ అభ్యంతరం బౌద్ధికంగా, జ్ఞానపరంగా, ఆచరణపరంగా ఎలా చూసినా సరయిన అభ్యంతరం కాదు.

నిజానికి, హిందూ మతంలోనే మాంసాహారం అనుమతి ఉంది. మనుస్మృతి 5వ అధ్యాయంలోని ఈ క్రింది శ్లోకం చూడండి :

"బ్రాహ్మణులు యజ్ఞయాగాల కోసం, సేవకులను రక్షించడం కోసం జంతువులను, పక్షులను చంపవచ్చు. ఎందుకంటే అగస్త్య ముని ఇంతకు ముందు ఇలా చేశారు".
(మనుస్మృతి, 5/22)

"ఆది ఋషులు, బ్రాహ్మణులు, క్షత్రియులు చేసిన యజ్ఞాలలో తినదగిన జంతువులు, పక్షుల మాంసం ఆహుతి చేయడం జరిగింది" (మనుస్మృతి, 5/23)

మంత్రాల ద్వారా పవిత్రం చేయబడిన మాంసాన్ని తినాలి. బ్రాహ్మణుడు మాంసం తినాలనుకున్నప్పుడు నియమానుసారం తినవచ్చు. వ్యాధిగ్రస్తమైన స్థితిలో, ఇతర ఆహారం వల్ల మరణభయం ఉన్నప్పుడు తినవచ్చు. వీటన్నింటినీ ప్రాణానికి ఆహారంగా బ్రహ్మ సృష్టించాడు. స్థావరాలు (అన్నము, పండ్లు మొదలైనవి) జంగమ(కదిలేవి) పశు పక్షులు మొదలైనవి ప్రాణానికి ఆహారం." *(మనుస్మృతి, 5/27-28)*

"(శ్రాద్ధ లేదా మధుపర్కలో)" ఆచారమైనప్పుడు మాంసం తినని వ్యక్తి మరణించిన తర్వాత ఇరవై ఒక్క జన్మల వరకు పశువుగా పుడతాడు. బ్రాహ్మణులు మంత్రసంస్కారం చేయ

ఇక గొడ్డు మాంసం గురించి ... గొడ్డు మాంసాన్ని ఇస్లాం అనుమతించింది. కాని తప్పనిసరిగా తినాలన్న ఆదేశమేమీ లేదు. ఇస్లాం నియమనిబంధనలన్నీ బుద్ధీ వివేకాలపై ఆధారపడినవి, కేవలం ధార్మిక భావనలపై ఆధారపడినవి కావు. ఇస్లాం స్వచ్ఛమైన ఏకేశ్వరవాదం. గోవులను పూజ్యమైనవిగా భావించదు.

హిందూ మతానికి సంబంధించి, సింధు లోయ నాగరికతలోని హిందువులు ఆవుకు మతపరమైన గుర్తింపు ఏమీ ఇవ్వలేదు. "వ్యవసాయ నాగరికతకు ఆద్యులు" అయిన ఆర్యులు ఆవును ఆర్థికంగా లాభదాయకమైనదిగా భావించారు. కానీ ప్రత్యేక సందర్భాల్లో ఆర్యులు ఎద్దు మాంసాన్ని తినేవారు. కాలక్రమేణా, యజ్ఞాలలో తీవ్రమైన జీవహింస చోటు చేసుకుంది. గతంలో గో-మేధ యజ్ఞం జరిగేది. బౌద్ధ అహింస ఈ తీవ్రమైన హింసకు ప్రతిక్రియగా వచ్చింది. కానీ ఆచరణాయోగ్యంగా నిలువలేదు. చాలా మంది బౌద్ధులు మాంసాహారులు. ఇప్పటికీ దేవీదేవతలకు బర్రెలు, మేకలు బలివ్వడం జరుగుతూనే ఉంది.[1]

ప్రపంచంలోని అన్ని జాతులు అవి నాగరికమైనవి కానీ అనాగరికమైనవి గానీ అన్ని జాతుల్లోనూ, ధర్మాల అనుయాయుల్లోనూ మాంసాహారులున్నారు. భారతదేశం లోని హిందువుల్లో కొద్ది మంది తప్ప అత్యధికులు మాంసాహారులే. దేవీదేవతలకు బర్రెలు, గొర్రెలు బలిస్తూ, పశుపక్షాదుల మాంసం తింటూ మరోవైపు జీవహింస అని ఇస్లాంను నిందించే ప్రహసనం కొనసాగుతోంది. ఇస్లాం అనేది ఒక దేశం లేదా ఒక జాతికి సంబంధించిన మతం కాదు. ఇది మొత్తం ప్రపంచానికి చెందిన దైవిక ధర్మం. ప్రపంచంలో చాలా దేశాలు ఉన్నాయి. కొన్ని దేశాల్లో ప్రజల ప్రధానాహారం మాంసం లేదా చేపలు. విశ్వజనీన ధర్మమైన ఇస్లాం పశువధను నిషేధించడం ఎలా సాధ్యం?

---

కుండా జంతువుల మాంసాన్ని తినకూడదు. సనాతన నియమాలను అనుసరించి మంత్రాలతో సంస్కరించబడిన జంతువుల మాంసాన్ని తినాలి." *(మనుస్మృతి, 5/35-36)*

సంత్ వినోబా జీ గీత ప్రవచనంలో ఇలా చెప్పారు- భవభూతి రాసిన 'రామచరిత'లో ఒక సంఘటన ఉంది. వాల్మీకి ఆశ్రమానికి వశిష్ఠ ఋషి వచ్చారు. ఆయన అతిథి సత్కారాలకు ఒక ఆవు దూడను కోశారు. అప్పుడు ఒక చిన్న పిల్లవాడు ఒక పెద్ద అబ్బాయితో "ఈ రోజు గడ్డం ఉన్న వ్యక్తి మా ఆశ్రమానికి వచ్చాడు, అతను మా దూడను చంపాడు" అన్నాడు. ఇది విన్న పెద్ద బాలుడు " అరె, ఆయన వశిష్ఠ మహర్షి. వాగుడు ఆపు" అన్నాడు. (గీత ప్రవచనం-7వ అధ్యాయం, 256వ పేజీ)

1. ఇలాంటి అనేక ఉదాహరణలు విద్వాంసులు రాసిన పుస్తకాల్లో ఉన్నాయి. ఢిల్లీ నుంచి ప్రచురించబడే మాసపత్రిక "సరిత"లో రతన్ లాల్ బంసల్ "గోవధ"పై రాసిన అనేక వ్యాసాలు వచ్చాయి.

# ఇస్లామీయ రాజ్యం

రామరాజ్యం, విక్రమాదిత్యుడు, అశోకుడి వంటి ఆదర్శ రాజ్యాలను ఇస్లాం స్థాపించలేదని కొందరు అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదు.[1]

రామరాజ్యం చారిత్రకమైనది కాదు, పౌరాణికమైనది. కాల్పనికమైనది. అంతేకాకుండా, సీతమ్మ వనవాసం, బ్రాహ్మణవాదం వంటి విమర్శలు ఆధునిక కాలంలో దీనిపై వినవస్తున్నాయి. దక్షిణ భారతదేశంలో హిందువులు కూడా తులసిదాసు రచించిన రామాయణాన్ని ఆదరించడం లేదు. ఇక అశోకుడి ఆదర్శ రాజ్యం బౌద్ధమత రాజ్యం. అశోకుడు ఉన్నంత కాలం ఆ సామ్రాజ్యం మనుగడ సాగించింది, తరువాత కుప్పకూలిపోయింది. భారతజాతిని బలహీనపరిచింది. అశోకుడి తరువాత, భారతదేశంలో అనేక శతాబ్దాలు చీకటి యుగంలో గడిచాయి. బౌద్ధమతం నీతినియమాలకు పేరు పొందింది, అంతేకాని ఆదర్శవంతమైన, శాశ్వత పరిపాలనకు కాదు. డాక్టర్ భండార్కర్ అశోకుడి విజయాలను తీవ్రంగా విమర్శించారు. విక్రమాదిత్యుని యుగం నిస్సందేహంగా స్వర్ణయుగం కానీ అంతర్జాతీయ స్థాయిలో కాదు. ఆ సమయంలో భారతదేశంలో హిందువులే ఉండేవారు. ఈ కోణంలో చూస్తే, షేర్ షా, అక్బర్, జహాంగీర్, షాజహాన్‌ల కాలం అత్యంత ప్రభావవంతమైన స్వర్ణ

1. ఇస్లామీయ రాజ్యం వాస్తవికత గురించి సాధారణ ప్రజలకు తెలియదు. ఇస్లామీయ రాజ్య సిద్ధాంతం అత్యున్నతమైనది.

   సమస్త సృష్టి, ఈ ప్రపంచం యావత్తు దేవునికి చెందినవి. ఆయనే యజమాని, ప్రభువు, పాలకుడు. మనిషి దేవునికి ప్రతినిధి. మనిషికి ఇష్టం వచ్చినట్లు పాలించే హక్కు లేదు. దేవుడు ప్రసాదించిన సంవిధానం ప్రకారం పాలించడం మనిషి కర్తవ్యం. ఈ సూత్రంపై ఆధారపడని రాజ్యం, దాని పాలకుడు ముస్లిం అయినప్పటికీ అది ఇస్లామీయ రాజ్యం కాదు. భారతదేశంలో ముస్లింలు స్థాపించిన సామ్రాజ్యాలు పూర్తిగా ఇస్లామీయ రాజ్యాలు కావు. ఇస్లామీయ రాజ్యానికి రాజ్యాంగం పవిత్ర ఖురాన్. ఆదర్శవంతమైన ఇస్లామీయ రాజ్యం దైవప్రవక్త ముహమ్మద్(స) స్థాపించి చూపించారు. ఆదర్శవంతమైన ఇస్లామీయ పాలకులు ప్రవక్త ముహమ్మద్ (స) అనుయాయులైన ఖలీఫాలు (ప్రతినిధులు)– అబూ బకర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి) అలీ (రజి). వారు ధర్మపరాయణులు. వారు పాలకులుగా ఉన్నప్పటికీ ఫకీర్లుగా జీవించారు. వారు న్యాయశీలురు, ప్రజారంజకులు, నిస్వార్థపరులు, అత్యంత నిరాడంబర జీవితం గడిపినవారు. చరిత్రలో అలాంటి ఉదాహరణలు మరెక్కడా దొరకవు.

యుగం. వారి సామ్రాజ్యం సువిశాలమైనది. హిందువులు అధికసంఖ్యలో ఉన్నప్పటికీ అల్పసంఖ్యలో పాలకవర్గం ఉండేది.

విక్రమాదిత్యుడి కాలం కంటే ఈ పాలకుల కాలంలో మతపరమైన ఔదార్యం, సుఖశాంతులు, ప్రగతి వికాసాలు మరింత అధికంగా కనిపిస్తాయి. అంతర్జాతీయ దృక్కోణంలో చూస్తే ప్రవక్త ముహమ్మద్ (స) తర్వాతి నలుగురు ఖలీఫాల నిరాడంబర జీవనం, ఆ తర్వాతి కాలంలోని ఖలీఫా హారూన్ రషీద్ అత్యున్నత స్థాయి పరిపాలనలకు చరిత్రలో మరో ఉదాహరణ కనిపించదు. అంతెందుకు, ప్రస్తుత కాలంలో అధికధరలు, అసహనం, నేతల్లో తీవ్రమైన అవినీతి వంటి చికిత్స లేని వ్యాధుల కాలంలో గతాన్ని పరిశీలిస్తే ధరలను అదుపు చేయడంలో అల్లావుద్దీన్, పరమత సహనం విషయంలో షేర్ షా సూరీ, వ్యక్తిగత పవిత్రతతో జీవించిన అత్యున్నత పాలకుడిగా ఔరంగజేబు గుర్తుకువస్తారు.

## ముస్లింలపై వేర్పాటువాద ఆరోపణలు

ముస్లింలు వేర్పాటువాదులనే ఆరోపణలు కూడా వినిపిస్తుంటాయి. ఆస్ట్రియన్లు, నీగ్రోలు, మంగోలులు మొదలైన ఎన్నో జాతుల వారు భారతదేశానికి వచ్చారు. హిందువుల్లో కలగలిసిపోయారు. కానీ ముస్లింలు ఇప్పటివరకు తమ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు.

ముస్లిములపై వేర్పాటువాదం ఆరోపణలు చేసేవారు కొన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకోరు. ముస్లింలకు పూర్వం భారతదేశానికి వచ్చిన జాతుల వారికి హిందువుల మాదిరి మతం లేదు, విద్యాజ్ఞానాలు లేవు కాబట్టి వారు హిందువుల్లో ఐక్యమైపోయారు. కానీ ఈ పరిణామాల ఫలితంగా హిందూ ధర్మం వికృతమయ్యింది. ఆధునిక హిందూ మతం ప్రాచీన వైదికమతం కాదు. ఇది అనేక మతాల సమ్మిశ్రమం.

ఇతర జాతుల మాదిరిగా కాకుండా, ముస్లింలు ఒక గొప్ప మతం, గొప్ప మతగ్రంథం ఖురాన్, ఆదర్శవంతమైన జీవనం గడిపిన ప్రవక్త ముహమ్మద్(స) జీవన చరిత్రలతో వచ్చారు. వారు స్వచ్ఛమైన ఏకేశ్వరవాదులు. దానికి ఆధారభూతమైన విశ్వాసవచనం – **లా ఇలాహ ఇల్లల్లాహ్** – అంటే ఒకే ఒక్క దేవుడు తప్ప మరొక దేవుడు లేడు. ఆ ఒకే ఒక్క దేవునికి తప్ప మరెవరి ముందు తల వంచమనే గౌరవం వారికి ఉండేది. ఇక్కడ అసంఖ్యాక కాల్పనిక దేవీదేవతలు, వారి పూజాదికాలు,

ఆరాధనలు ప్రబలంగా ఉండేవి. పశుపక్ష్యాదుల పూజ జరిగేది. అవతారవాదం బలంగా ఉండేది. ముస్లిముల చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్ (స) గొప్ప దైవభక్తుడు, ఆరాధకుడు, దైవప్రవక్త మాత్రమే. ఇక్కడ బ్రాహ్మణవాదం ఉండేది, శుచిశుభ్రతలుండేవి. నిమ్నోన్నతలుండేవి. ముస్లింలలో ఇలాంటి వివక్షలేవీ ఉండేవి కావు. అందరూ సమానమే.

ముస్లింలు తమ సంస్కృతి, భాష మొదలైనవాటిని భద్రంగా కాపాడుకోవాలనుకుంటే వారిని దేశ వ్యతిరేకులని ఆరోపిస్తున్నారు. హిందువుల సంగతేంటి? అందరూ హిందువులే కాని వేర్వేరు భాషలెందుకు? భాషల ఆధారంగా రాష్ట్రాలు ఎందుకు ఏర్పడ్డాయి? దక్షిణాది హిందువులు హిందీని వ్యతిరేకిస్తున్నారు. కొందరు సిక్కులు తమ సొంత దేశాన్నే కోరుకుంటున్నారు. కాశ్మీర్లో ముస్లింలు మెజారిటీగా ఉన్నారు. జమ్మూలో హిందువులు దాన్ని భరించడం లేదు. జమ్మూ కాశ్మీర్ను హిమాచల్ ప్రదేశ్లో కలిపేయాలనుకున్నారు. అన్ని రాష్ట్రాలు మరిన్ని హక్కులు, కేంద్రం నుండి మరింత స్వేచ్ఛను కోరుతున్నాయి. ఇవన్నీ ఉన్నప్పటికీ వేర్పాటువాదం, జాతివ్యతిరేకత ఆరోపణలకు ముస్లిములు మాత్రమే గురవుతున్నారు. ఇదేమి న్యాయం? కొన్ని ముఖ్యమైన అంశాలను మినహాయిస్తే, ముస్లింలు ఎందులో విభిన్నంగా ఉన్నారు? పోలీసు, పిఎసి తదితర విభాగాల్లో వారి జనాభా దామాషా ప్రకారం స్థానాలు లేవు. 30 ఏళ్లుగా వారికి అన్యాయం జరుగుతోంది.

## ముస్లిములపై జాతి వ్యతిరేక ముద్ర

ముస్లింలకు జాతీయ దృక్పథం లేదని, అరబ్బు తదితర ముస్లిం దేశాల నుంచి ప్రేరణ పొందుతారనే విమర్శలు వినిపిస్తుంటాయి.

ఈ భావన పూర్తిగా అబద్ధం, బహుశా ఇంతకంటే హానికరమైన భావజాలం మరొకటి ఉండకపోవచ్చు. ఇది ఘోరమైన ఆరోపణ అంటే తప్పులేదు. చరిత్ర ఈ భావజాలానికి పూర్తి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తుంది. భారతదేశంలో ముస్లిం పాలన క్రీ.శ. 712 నుండి 1857 వరకు కొనసాగింది. వాళ్ళు భారతదేశం కోసం జీవించారు. భారతదేశం కోసం మరణించారు. జాతి వ్యతిరేకులు ఒక దేశంలో వెయ్యి సంవత్సరాలుగా నివసించడమే కాదు, కొంతకాలం పరిపాలించడం ఎలా సాధ్యం? సగటు బుద్ధివివేకాలున్న వ్యక్తి కూడా దీన్ని అర్థం చేసుకోలేడు. ముస్లింలు జాతి వ్యతిరేకులు అయితే వారు పాలకులుగా ఉన్నప్పుడు అధిక సంఖ్యాకులైన హిందువుల తిరుగుబాట్లు

జరిగి ఉండేవి. కానీ ఇలాంటి తిరుగుబాటు వెయ్యి సంవత్సరాల కాలంలో ఎప్పుడూ జరగలేదు. ప్రారంభ కాలంలో తప్ప, అంటే ముస్లింలు ఇక్కడికి రాకముందు కాలాన్ని వదిలేస్తే, ఆ తర్వాత పది శతాబ్దులలో జరిగిన యుద్ధాల్లో ఒకవైపు పూర్తిగా హిందువులు, ఒకవైపు పూర్తిగా ముస్లిములు ఉన్న యుద్ధం ఒక్కటి కూడా లేదు.

దీనికి విరుద్ధంగా, హిందువుల్లో యోధజాతిగా భావించబడే రాజపుత్రులు ముస్లిం సామ్రాజ్యసైన్యాలు నడిపేవారు. మొఘల్ సామ్రాజ్యానికి చెందిన మాన్ సింగ్ కాబూల్‌ను జయించడం భారతదేశం సాధించిన విజయంగానే పరిగణించబడింది. శివాజీ సైన్యంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉండేవారు. ఔరంగజేబు సైనికాధికారి కూడా రాజా జై సింగ్. చరిత్రలో హిందువులు ముస్లిములను విదేశీయులుగా ఎన్నడూ చూడలేదు. అంతేకాదు, 1857లో హిందువులు, ముస్లింలు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తమదైన రీతిలో సంఘర్షించారు. 1857లో మొఘల్ చక్రవర్తి బహదూర్ షా నాయకత్వంలో మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం జరిగింది. హిందువులు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సంతోషంగా మొఘల్ చక్రవర్తి నాయకత్వాన్ని అంగీకరించారు. సంక్షిప్తంగా చెప్పాలంటే, మొదటి స్వాతంత్ర్య యుద్ధంలో ముస్లింల పాత్ర హిందువులు పోషించిన పాత్రతో సమానంగానే ఉంది.

1920-21లో ముస్లింలు ఖిలాఫత్ ఉద్యమాన్ని కాంగ్రెసులో విలీనం చేసినప్పుడు మాత్రమే కాంగ్రెస్‌కు అవసరమైన బలం లభించింది. 1916లో జిన్నా ప్రభావం వల్లనే సంపూర్ణ స్వరాజ్యం కోసం కాంగ్రెసుతో ఒక ఒప్పందం కుదిరింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు పూర్తి ముస్లిం ప్రాంతమైన సరిహద్దు ప్రావిన్సులో ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ నాయకత్వంలో కాంగ్రెసు పనిచేసింది. సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో ముస్లింల పాత్ర సాటిలేనిది. విప్లవ వీరులలో అష్ఫాఖుల్లా ఖాన్‌ను ఎవరు మరచిపోగలరు? అబుల్ కలాం ఆజాద్, హిఫ్జుర్రహ్మాన్‌ల పేర్లు లేకుండా కాంగ్రెస్ గురించి మాట్లాడలేము. పాకిస్తాన్ ఏర్పడిందన్నది నిజం. 1937లో, ముస్లిం లీగ్‌కు మంత్రివర్గంలో రెండు సీట్లు ఇస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. కానీ ఎన్నికల విజయంతో వచ్చిన గర్వం వల్ల ఇచ్చిన మాట మరచి పోయింది. ఇద్దరు ముస్లిం లీగ్ సభ్యులు కాంగ్రెస్‌లో చేరాలనే షరతు విధించింది. ఇది జిన్నాకు పెద్ద అవమానమే. పాకిస్తాన్ ఏర్పాటుకు కారకులు ముస్లిం నాయకులు మాత్రమే కాదు. కాంగ్రెస్‌లోని హిందూ నాయకుల దూరదృష్టి లేమి, అహంకారం కూడా కారణాలు. బేరసారాలకు కూడా పరిమితులుంటాయి. మోసాలకు కూడా

హద్దులుంటాయి. వాస్తవానికి, పాకిస్తాన్ వేర్పడడానికి కారణం హిందువులు లేదా ముస్లింలు కాదు. రాజకీయ నాయకులు, హిందూ, ముస్లిం రాజకీయ నాయకుల హ్రస్వదృష్టి దీనికి కారణం. దీనికి కాంగ్రెస్ పార్టీదే బాధ్యత. ఒక వైపు, కాంగ్రెస్ భారతీయులందరికీ ప్రాతినిధ్యం వహించే మాటలు చెప్పింది, మరోవైపు, ప్రత్యేకంగా హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకుంది. చివరకు జరగవలసింది జరిగిపోయింది.

పాకిస్తాన్‌తో రెండు యుద్ధాలు జరిగాయి. కానీ భారతదేశంలోని ముస్లింలు పాకిస్తాన్ పక్షాన ఉన్నారా? అబ్దుల్ హమీద్ త్యాగం చారిత్రక త్యాగం కాదా? ఇక్బాల్ కంటే గొప్పగా జాతీయ గీతం రాసిన వారున్నారా? మాలిక్ ముహమ్మద్ జాయిసి, రుస్కాన్, కుతుబన్, షేక్, కబీర్, రహీమ్, అన్నింటికంటే మించి హిందీ పితామహుడైన ఖుస్రోను హిందీ నుండి తొలగిస్తే హిందీ ప్రాముఖ్యత మిగులుతుందా? స్వతంత్ర భారతదేశంలో హిందీ భాషను ముస్లింలు ఎప్పుడైనా వ్యతిరేకించారా? దీనికి విరుద్ధంగా, దక్షిణ భారతదేశంలోని హిందువులు ఏకగ్రీవంగా హిందీని వ్యతిరేకించినప్పుడు షేక్ అబ్దుల్లా హిందీకి అనుకూలంగా తన స్వరాన్ని వినిపించారు. కాని, స్వతంత్ర భారతదేశంలో, ఉర్దూని రెండవ భాషగా స్వీకరించాలనే ముస్లింల సహేతుకమైన డిమాండ్‌ను ఇప్పటివరకు అంగీకరించలేదు. ముస్లింలకు మక్కా మదీనాలు అత్యంత పవిత్రమైన ప్రదేశాలు. అక్కడి నుంచి దైవిక ప్రేరణ పొందడం జరిగితే అందులో ఎవరికేమి అభ్యంతరం? ఇంగ్లాండ్‌కు చెందిన ఆంగ్లేయుడు జెరూసలేం భక్తుడైతే, అతను ఇంగ్లాండ్‌కు సంబంధించి జాతి వ్యతిరేకి అవుతాడా? ఒక బర్మా బౌద్ధుడికి సారనాథ్ పట్ల ఉన్న గౌరవం అతని దేశం బర్మాలో జాతి వ్యతిరేకిగా మార్చేస్తుందా? స్వతంత్ర నేపాల్ హిందువులు కాశీ భక్తులు కాదా? వాస్తవానికి, ముస్లింలు జాతి వ్యతిరేకులని, అరబ్బు తదితర ముస్లిం దేశాల నుండి ప్రేరణ పొందుతారనే హిందువుల ఆరోపణ వెనుక ఉన్న మనస్తత్వం- భారతదేశం తప్ప మరే ఇతర దేశంలోనూ వారికి పుణ్యక్షేత్రాలు లేవన్న వాస్తవంలో ఉంది. నేపాల్ మాత్రమే అటువంటి దేశం, కానీ స్వతంత్ర భారతదేశంతో దానికీ మంచి సంబంధాలు లేవు.